ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ తదియ రా. 2.15 వరకు, అనంతరం చవితి; నక్షత్రం: పుష్యమి ఉ. 10.22 వరకు, అనంతరం ఆశ్లేష; అమృతకాలం: లేదు; వర్జ్యం: రా. 10.26 నుండి 11.56 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

Estd 1938

# ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!






సంపుటి:56 • సంచిక:264 • గురువారం 4 జనవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad


మంచు కురిసే వేళలో... వణికించే చలిలో...!



బుధవారం పార్లమెంట్ హౌస్‌లో కేబినెట్ సమావేశానికి వెళుతున్న ప్రధాని మోదీ

# తలాక్.. బ్రేక్

## రాజ్యసభలో ప్రతిష్ఠంభన

- కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు
- సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్
- సభలో రభస.. వాదోపవాదాలు
- పరస్పర ఆరోపణాస్త్రాలు
- కాంగ్రెస్ తీర్మానంపై అరుణ్ జైట్లీ ఆగ్రహం
- మాకు 17 పార్టీల మద్దతుంది: ఆజాద్



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు బ్రేక్ పడింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ పార్టీ సహా విపక్షాలు పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దాంతో రాజ్యసభ గురువారానికి వాయిదా పడింది. బుధవారం మధ్యాహ్నం రాజ్యసభలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రవేశపెట్టారు. అయితే దీనిని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఆనంద్ శర్మ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానంపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్‌ను ఆరునెలల పాటు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఈలోగా రాజకీయ పార్టీలన్నీ పార్లమెంటులో దీనిపై చట్టం చేయాలని సూచించిందన్నారు. ఆరునెలల గడువు వచ్చే ఫిబ్రవరి 22తో పూర్తవుతున్న నేపథ్యంలో బిల్లును అత్యవసరంగా చేపట్టాలని కోరారు. ఈ బాధ్యత అందరిపై ఉందని కనుక బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయలన్నింటిని ఉల్లంఘిస్తోందని, 24 గంటల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉండగా, ఆకస్మికంగా ఓటింగ్‌కు నోటీసు ఎలా ఇస్తారని ప్రతిపాదిస్తారని ⇨ 9వ పేజీలో...

కోరెగావ్ అల్లర్లపై అట్టుడికిన పార్లమెంట్ 11

కిమ్.. నా దగ్గరా బటన్ ఉంది!



నేనూ నొక్కుతా

ఉత్తర కొరియాకు ట్రంప్ హెచ్చరిక 8లో


# భారీ బడ్జెట్

## ప్రతిష్టాత్మక పథకాలకు పెద్దఎత్తున కేటాయింపులు

## 1.50 లక్షల కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్

16శాతానికి చేరిన రాష్ట్ర వృద్ధిరేటు

- రైతు రుణమాఫీ పూర్తవడంతో తాజా బడ్జెట్‌లో పెట్టుబడి సాయానికి రూ.5 వేల కోట్లు కేటాయింపు
- రాష్ట్ర అప్పు రూ.19,840 కోట్లు
- రెవెన్యూ ఆదాయం రూ.45,369 కోట్లు
- ప్రభుత్వం చేసిన రెవెన్యూ ఖర్చు రూ.49,917 కోట్లు
- కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రూ.5 వేల కోట్లు




### విభిన్న బడ్జెట్‌కై కసరత్తు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను రూపొందించేపనిలో తెలంగాణ ప్రభుత్వం నిమగ్నమై ఉంది. బడ్జెట్ ప్రతిపాదనలను ఆన్‌లైన్ ద్వారా అందజేసేందుకు ప్రభుత్వం ఈనెల 8వ తేదీ గడువు విధించడంతో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, కమీషనర్లు తమ శాఖకు అవసరమైన నిధులను ప్రతిపాదించే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ప్రతిపాదనల సమర్పణకు ఇప్పటికే ఆర్థికశాఖ ఆయా శాఖలకు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ప్రతిపాదనలు ఎలా పంపించాలన్న అంశంపై స్పష్టతనిచ్చింది. కేంద్ర ⇨ 2వ పేజీలో...



# ప్రాక్టికల్స్ అంటే ఏంటి? ల్యాబ్.. చూడలేదు!

## ఇంటర్ సైన్స్ స్టూడెంట్స్ దుస్థితి ఇదీ

80% మందికి ల్యాబ్ పరీక్షలంటేనే తెలీదు!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఇంటర్ చదువుతున్న సైన్స్ విద్యార్థుల్లో 80 శాతం మంది విద్యార్థులకు ప్రయోగ పరీక్షలంటేనే తెలియదు. వారికి బ్యూరెట్ అంటే ఏంటో పిప్పెట్ అంటే ఏంటో కూడా తెలియని దుస్థితిలో ఉన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలోలనే కాదు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పేరున్న కార్పొరేట్ కాలేజీలో శ్రవణ్ అనే అబ్బాయి ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు... అతన్ని ప్రాక్టికల్ చేయించారా? అని అడిగితే అవి మాకు చేయించరు అని సమాధానం చెప్పాడు. ఎందుకు చేయించరు అంటే టైం లేదని ప్రాక్టికల్ ఎగ్జామ్స్ అప్పుడు మీకు ఇబ్బందేమి ఉండదని కాలేజీ లెక్చరర్స్ చెప్పారని అన్నాడు. గవర్నమెంట్ కాలేజీలో చదివే వెంకటేష్‌ను ప్రాక్టికల్స్ చేయించారా? అని అడిగితే ⇨ 3వ పేజీలో...



## ఏటీఎం నుంచి డబ్బుల వరద

**కరీమాబాద్, ప్రభ న్యూస్:** వరంగల్ లోని ఎస్‌బీఐ ఏటీఎం నుండి డబ్బులు వరదలా వచ్చాయి. వెయ్యి కొడితే రెండు వేలు, 5 వేలు కొడితే పాతిక వేలు... ఇలా ఇష్టారాజ్యంగా ఏటీఎం నుంచి జలజలా రాలి పడ్డాయి. దీంతో ప్రజలు ఆ ఏటీఎం దగ్గరకు పరుగు పరుగున వచ్చి క్యూ కట్టారు. శివనగర్‌లోని పల్లవి నర్సింగ్ హోమ్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎంలో ఖాతా దారులు రూ.1000 డ్రా చేసుకోగా వారి చేతికి రూ.2000, మరో ఖాతాదారుడు ⇨ 3వ పేజీలో...



ముంబైలోని దాదర్ స్టేషన్ వద్ద దళిత నిరసనకారుల రైల్ రోకో

## మహా బంద్

- అట్టుడికిన మహారాష్ట్ర
- విద్యార్థి మృతి
- రాష్ట్రమంతటా ధర్నాలు... హింసాత్మక ఘటనలు
- నిలిచిపోయిన బస్సులు, రైళ్లు, విమానాలు

11లో

## పెట్టుబడి రాయితీకి కొత్త చిక్కులు

నేరుగా డబ్బుల పంపిణీకి కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అడ్డు

పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలు తెరిపించే దిశగా కొత్త కార్యాచరణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పంటల సాగును ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 'పెట్టుబడి రాయితీ పథకం' మొత్తాన్ని రైతు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తే ఎదురయ్యే చిక్కులను ఎదుర్కొనేందుకు గల ప్రత్యామ్నాయ మార్గాలపై వ్యవసాయ శాఖ అధ్యయనం చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచే ప్రారంభమయ్యే ఈ పథకానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు వివిధ వర్గాలతో సమాలోచనలు జరుపుతున్నారు. ఈ ⇨ 3వ పేజీలో...



మాదాపూర్ అండర్ బైపాస్ రోడ్ ప్రారంభోత్సవంలో మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు

# హైదరాబాద్‌లో మరో ఐటీ క్లస్టర్

లక్షా 25వేల మందికి ఉద్యోగావకాశాలు • బుద్వేల్, రాజేంద్రనగర్ క్లస్టర్ ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ పర్యటన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఐటి రంగంలో ఎంతో పురోగతి సాధిస్తున్న ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో ఐటి క్లస్టర్‌ను ఏర్పాటుచేసే ప్రక్రియను మరింత ముమ్మరం చేసింది. నగర శివారులోని బుద్వేల్, రాజేంద్రనగర్‌లో ఐటి క్లస్టర్ అభివృద్ధి వేగవంతం చేశామని పరిశ్రమల శాఖ మంత్రి ⇨ 2వ పేజీలో...

రూ.23 వేల కోట్లతో జంటనగరాల అభివృద్ధి: కేటీఆర్ 2లో

## హైకోర్టు విభజనకు ముమ్మర సన్నాహాలు

9లో

## కరుణానిధితో రజనీ భేటీ

ఆశీస్సుల కోసమే వెళ్లానని వెల్లడి 8లో






ప్రపంచమంతా ఒకదారి... భారత్‌ది మరోదారి...

# లౌకిక రాజ్యం పేరుకే

## చేసేదంతా మత రాజకీయమే!

- ఒక్కో పార్టీ ఒక్కో మతానికి అండ
- ఓట్లను కొల్లగొట్టే వ్యూహాలు
- ప్రపంచంలో పెరుగుతున్న మతాతీత విధానం
- మనదేశంలో మాత్రం మతాధార అవకాశవాదం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి:** అల్లా, ఏసుక్రీస్తులు భారతదేశంలోకి, భారత రాజకీయాల్లోకి ప్రవేశించని 12వ శతాబ్ధంలోనే ఒకే మతానికి చెందిన శైవులు, వైష్ణవులు శివుడు గొప్పంటే విష్ణువే గొప్పంటూ పరస్పర దాడులకు దిగి ఆధిపత్యం కోసం యుద్దాలు చేసిన భారతదేశంలో ఇప్పటికీ మతాన్నే ఆలంబనగా చేసుకుని అధికార పదసోపానాలు అధిష్టించేందుకు భారత రాజకీయవేత్తలు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మతప్రాతిపదిక రాజకీయాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. ప్రపంచంలో మరే దేశంలోలేనన్ని మతాలు భారత్‌లో ఉన్నాయి. ఇక్కడ హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, బౌద్దులు, జైనులు, జోరాష్ట్రియన్లు, జుడాయిజం, బహాయి మతాలకు చెందిన వారంతా కలిసే జీవిస్తున్నారు. అనేక మతాలకు భారత్ పుట్టిల్లు. హిందూయిజం, బౌద్ధం, సిక్కు, జైనిజాలు ఇక్కడే ఆవిర్భవించాయి. జోరాష్ట్రియన్, బహాయి మత విశ్వాసకులు భారత్‌లోనే అత్యధికంగా ఉన్నారు. ప్రపంచంలోనే అతిపురాతన మతాల్లో ఒకటిగా హిందూయిజం గుర్తింపు పొందింది. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా ముస్లింలున్న మూడో దేశమిది. క్రైస్తవంలోని కేథలిక్‌లు, ప్రొటెస్టంట్లు, ఓరింటల్ ఆర్థోడాక్స్‌లు కూడా ఇక్కడున్నారు. భారత్ పేరుకు లౌకికరాజ్యం. వాస్తవానికి ఇక్కడ అన్ని మతాలు సమానం. ప్రభుత్వం ఏ మతాన్ని ప్రోత్సహించకూడదు. అలాగే ఏ మతాన్నికించపర్చకూడదు. పరస్పర ద్వేషాన్ని అనుమతించకూడదు. కానీ మత ఆధారిత రాజకీయ ప్రయోజనాల కోసం ఇప్పటికే మతపరమైన యాత్రాస్థలాల సందర్శన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్థికసాయం చేసి ప్రోత్సహిస్తోంది. మతపర సంస్థల్ని ప్రభుత్వం గుర్తిస్తోంది. మత సంబంధిత బహిరంగ సభలకు అనుమతులిస్తోంది. ఒక్కో పార్టీ ఒక్కో మతాన్ని ప్రోత్సహిస్తూ ఆ మతస్తుల ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోంది. కానీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా మతాలకతీత విధానం ⇨ 3వ పేజీలో...

# హైదరాబాద్‌లో మరో ఐటీ క్లస్టర్


మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేటీ రామారావు చెప్పారు. ఈ క్లస్టర్‌లో బహుళజాతి సంస్థలతో పాటు దేశీయ సంస్థలు తమ యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయని చెప్పారు. ఈ క్లస్టర్‌లో ఎంవోయూ కుదుర్చుకునేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని, ఇవి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే లక్షా 25వేల మందికి కొత్తగా ఉద్యోగాలు కలుగుతాయని కేటీఆర్ చెప్పారు. ఈ క్లస్టర్ ప్రాంతాల్లో పర్యటించి క్లస్టర్ ఏర్పాటు కోసం సేకరించనున్న స్థలాలను మంత్రి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ క్లస్టర్‌లో కంపెనీలను స్థాపించేందుకు ఇప్పటికే 30కిపైగా సంస్థలు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని కేటీఆర్ తెలిపారు. ఇందులో ఐటి పరిశ్రమలో పేరున్న దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ స్థాయి బహుళజాతి సంస్థలు కూడా ఉన్నాయన్నారు. కంపెనీల విజ్ఞప్తి మేరకు వాటి వివరాలను ఇప్పుడే పూర్తిగా చెప్పడం లేదని, త్వరలోనే ఆయా కంపెనీలతో లాంఛనంగా పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు చేసుకోనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఐటి పరిశ్రమను నగరంలోని నలుమూలలకు విస్తరించాలన్న దీర్ఘకాలిక లక్ష్యాన్ని నిర్దేశించామని, కొత్త క్లస్టర్ ద్వారా ఐటి పరిశ్రమ మరింత విస్తరిస్తుందని కేటీఆర్ చెప్పారు. నూతనంగా ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్‌లో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టిఎస్-ఐఐసి అధికారులను ఆదేశించారు. ఈ ఐటి క్లస్టర్‌కు సంబంధించి అత్యుత్తమ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, ఈ కంపెనీలు పూర్తిస్థాయిలో ఏర్పాటయ్యాక దాదాపు లక్షా 25వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయన్నారు. రానున్న ఐదేళ్ళలోపే ఈ కంపెనీలు తమ పూర్తిస్థాయి కార్యకలాపాలను ప్రారంభిస్తాయని కేటీఆర్ చెప్పారు.

ప్రస్తుతం రాజేంద్రనగర్‌లో ఉన్న కార్యకలాపాలు లేని అనేక ప్రభుత్వ సంస్థలు తమ భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని, వాటి భూ యాజమాన్య మార్పులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్లస్టర్ పనులను వేగవంతం చేసేందుకు ఐటి, రెవెన్యూ శాఖలు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, టిఎస్-ఐఐసిలతో కలిపి ఒక సమావేశాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహిస్తారని చెప్పారు. పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఐటి, రెవెన్యూ శాఖల అధికారులు మంత్రి పర్యటనలో పాల్గొన్నారు.

## 'లింగనిర్ధారణ'పై ఉక్కుపాదం

- 10మందితో ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** గర్భస్థ శిశువు లింగనిర్ధారణ పరీక్షలను కఠినంగా అమలు చేసేందుకు రాష్ట్ర ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం జీఓ జారీ చేసింది. గతంలో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ లింగనిర్ధారణ కమి టీని నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో దీనిపై ప్రభుత్వం కమిటీని నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఆ శాఖ కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు.

మిగతా వారు మెంబర్ సెక్రటరీగా, మెంబర్ కన్వీనర్‌గా, మరో ఏడుగురు మెంబర్లుగా ఈ కమిటీలో ఉంటారు. ప్రతి 3 నెలలకు ఒకసారి ఈ కమిటీ గర్భస్థ శిశువు లింగనిర్ధారణకు సంబంధించి రివ్యూ జరుపుతుంది. దీనిపై వచ్చే ఫిర్యాదులు, సలహాలను కూడా ఈ కమిటీ ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంబీబీఎస్ డాక్టర్లకు, అన్ని డయాగ్నస్టిక్ సెంటర్లకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నలుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణలో 2002 బ్యాచ్‌కు చెందిన నలుగురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్, హెచ్ఎండిఎ కమీషనర్ చిరంజీవులు, కేంద్ర రక్షణశాఖలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిలు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

# భారీ బడ్జెట్

- తాజా బడ్జెట్‌లో విద్యుత్ పంపిణీ సంస్థలకు అదనంగా వెయ్యి కోట్లు
- జీఎస్టీ ప్రభావం అంతంత మాత్రమే
- డబుల్ బెడ్‌రూం, మిషన్ భగీరథకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
- పీఆర్‌సీ బకాయిల చెల్లింపునకు నిధులు
- ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఖర్చు లక్షా 20వేల కోట్లు ఉండొచ్చని అంచనా
- 8లోగా ప్రతిపాదనలు పంపాలని శాఖలకు ఆదేశాలు


అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి ఈటల (పాత చిత్రం)

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ఖజానాపై ఆ ప్రభావం ఏమాత్రం పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు లక్షా 20వేల కోట్ల రూపాయల వరకు చేరుకుంటుందని ఆర్థికశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో రైతులకు పెట్టుబడి సాయానికి అవసరమైన నిధులతో పాటు నూతన సంవత్సరాన ప్రభుత్వం ప్రారంభించిన వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ అమలుకు, మిషన్ భగీరథ, నీటి పారుదల ప్రాజెక్టులు, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఏ మేర నిధులు అవసరమో వాటిని రూపొందించేందుకు అధికారులు, ఆర్థిక రంగ నిపుణులు తమదైనశైలిలో కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లను రద్దు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొన్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత ఏడాది పెద్దనోట్ల రద్దు, తాజాగా వస్తు సేవల పన్ను సమస్యను ఎదుర్కొంటుండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన ప్రక్రియకు ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టనుంది. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతిపాదనలను త్వరితగతిన పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించింది. రాష్ట్ర వార్షిక ప్రణాళికకు అనుగుణంగా ప్రభుత్వం బడ్జెట్‌ను అసెంబ్లీ, శాసనమండలిలో ప్రవేశపెట్టనుంది. ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు అందాక ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా రాష్ట్ర వార్షిక ప్రణాళికను రూపొందిస్తుంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరానికి రాష్ట్రప్రభుత్వం 1,49,646 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది కాస్తా 1.50 లక్షల కోట్ల రూపాయలకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెల ముగిసే నాటికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాల ప్రకారం రాష్ట్ర రెవెన్యూ ఆదాయం 45,369 కోట్ల రూపాయలు కాగా, 19,840 కోట్ల రూపాయల అప్పుతో కలిపి 65,260 కోట్ల రూపాయలుగా ఉంది. ఖర్చులను పరిశీలిస్తే అక్టోబర్ నెల ముగిసే నాటికి ప్రభుత్వం చేసిన రెవెన్యూ ఖర్చు 49,917 కోట్ల రూపాయలు ఉంది. మొత్తం ఖర్చు 63,244 కోట్ల రూపాయలుగా అధికారులు తేల్చారు. జాతీయ స్థాయిలో ఒకే పన్ను విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండడంతో జిఎస్టీ ప్రభావం రాష్ట్ర ఖజానాపై భారీగా పడింది. అయితే తెలంగాణ వినియోగ రాష్ట్రం కావడంతో ఆ ప్రభావం రాష్ట్రంపై పెద్దగా లేదని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది రాష్ట్ర వృద్ధిరేటు 15 నుంచి 16 శాతం వరకు ఉండవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టి 1,49,000 కోట్ల రూపాయల బడ్జెట్ అంచనాలకుగానూ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చని అధికారులు భావి స్తున్నా రు. ఈ మేరకు అంచనాలు కూడా వేసినట్టు తెలు స్తోంది. కేంద్ర ప్రాయో జిత పథకాల రూపంలో కేంద్రం నుం చి రాష్ట్రానికి రావలసిన రూ.10 వేల కోట్లలో ఇప్పటి వరకు సగం మాత్రమే రూ.5వేల కోట్లు వచ్చా యని మిగతా మొత్తా న్ని ఫిబ్రవరి చివరిలోపల వచ్చేలా చర్యలు చేపట్టాలని ఇప్ప టికే ముఖ్యమంత్రి చంద్రశే ఖరరావు ఆర్థికశాఖ ఉన్నతాధి కారులతో పాటు ఢిల్లీలోని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది.

ఈ ఏడాది రైతు రుణమాఫీకి రూ.4,250 కోట్లు ఒకేసారి చెల్లించడంతో ఆ ప్రభావం ఇతర పథకాలపై పడింది. దీని ఫలితంగా గుత్తేదార్లకు, ఇతరులకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు వస్తే తప్ప బకాయిలను చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త వార్షిక బడ్జెట్ రూపకల్పనకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

వచ్చే ఖరీఫ్ నుంచి రైతుకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రెండు విడతల్లో రూ.8వేలను చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో ఈ పెట్టుబడి సాయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అయితే రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తవడంతో ఈ పథకానికి కేటాయించిన నిధులను పెట్టుబడి సాయానికి కేటాయించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక వ్యవసాయ రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్‌కు అయ్యే అదనపు ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుండడంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు తాజా బడ్జెట్‌లో అదనంగా రూ.1000 కోట్లను కేటాయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తితో పాటు ఈ రంగానికి ఇదివరకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఖర్చు ఆ స్థాయిలో లేకపోవడంతో మిగిలిన నిధులను త్వరితగతిన ఖర్చుచేసి పెండింగ్ పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది పూర్తి చేయాలని భావిస్తున్న మిషన్ భగీరథకు వివిధ వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణంతో పాటు తాజాగా కొత్త బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రారంభించిన రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో ఏడాదిన్నరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండడంతో సీఎం కేసీఆర్ ప్రకటించిన పథకాలు, కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఇందుకు బడ్జెట్‌లో అవసరమైన నిధులను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ బకాయిల చెల్లింపు ప్రక్రియ డిసెంబర్‌లోనే పూర్తయింది. కొత్త వేతన సవరణ సంఘాన్ని నియమించడంతో పాటు ఈ సంఘం చేసిన సిఫారసులను అమలు చేసేందుకు కూడా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని నిర్ణయించింది.

# ఏం చేసినా...ఈ ఏడాదే

- రాబోయే ఎనిమిది మాసాలే కీలకం
- సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడదాం
- తెలంగాణ రైతు గోస తీర్చాలి: మంత్రి హరీశ్‌రావు


నీటిపారుదలశాఖ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఏం చేసినా.. ఈఏడాదే. రానున్న ఎనిమిది మాసాలు.. ఇరిగేషన్ శాఖకు అత్యంత కీలకం. ప్రతిగంటా..కీలకం.. సమయాన్ని సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ నీటిపారుదల శాఖపై పెట్టుకున్న నమ్మకం నిలుపుకునేవిధంగా అందరూ పనిచేయాలి అని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ నీటిపారుదలశాఖ 2018 క్యాలెండర్‌ను మంత్రి బుధవారం జలసౌధలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదహారుమాసాల్లో చేయాల్సిన పనులు ఎనిమిదిమాసాల్లో చేసేందుకు ఇరిగేషన్ అధికారయంత్రాంగం నడుంబిగించాలని కోరారు. గడచిన మూడున్నరేళ్ళుగా అంకితభావంతో పనిచేస్తున్న ఇంజనీర్లు ఈ ఏడాది ఇంకా పట్టుదలతో పనిచేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సాగునీళ్ళొస్తాయని, ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు భావించారన్నారు. రైతులను నిరుత్సాహపరచ వద్దన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టవలసిన బాధ్యత ప్రతి ఇంజనీరుకు ఉందని హరీష్ అభిప్రాయపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇంత విస్తృతంగా, సంపూర్ణంగా అవగాహన ఉన్న సిఎం దేశంలో ఎవరూలేరన్నారు. భవిష్యత్తులో కాళేశ్వరం వంటి భారీప్రాజెక్టులను నిర్మించే అవసరం.. అవకాశం రాదని, కాళేశ్వరం ప్రాజెక్టులో పనులు జరుగుతున్న వేగాన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగతా ప్రాజెక్టులలోనూ పనులు వేగవంతం చేయాలని హరీష్‌రావు సూచించారు. లక్షలాది మంది రైతుల జీవితాలలో వెలుగు నింపే జలసంకల్పంలో భాగస్వాములైనందున ప్రస్తుత ఇరిగేషన్ శాఖ ఇంజ నీర్లంతా గర్వపడాలని అభిప్రాయపడ్డారు. ఒక ఉద్యోగం వలె కాకుండా సామాజిక బాధ్యతగా డ్యూటీచేయాలని కోరారు. ఈ ఎనిమిది మాసాలు వీలైనంతవరకు సెలవులు, పండుగదినాల వంటి రోజుల్లోనూ పనిచేసి జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా టార్గెట్లు పూర్తిచేయాలని ఇంజనీర్లకు మంత్రి విజ్ఞప్తిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పర్యటించిన తర్వాత ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌పై ప్రజల్లో విశ్వాసం కనిపిస్తోందని మంత్రి అన్నారు. మూడుబ్యారేజీలు, మూడు పంపుహౌజ్‌ల పనులు అత్యంత వేగంగా జరుగుతుండడం పట్ల ఇరిగేషన్ అధికారయంత్రాంగంలోనూ ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టులో భూసేకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. అటవీ సంబంధిత సమస్యలు పరిష్కారమ య్యాయన్నారు. 8వేల ఎకరాల భూసేకరణ జరిగిందని గుర్తు చేశారు. 16జిల్లాల్లో కాళేశ్వరంపై ప్రజాభిప్రాయసేకరణ సజావుగా జరిగిందన్నారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సిడివో) విభాగం సిబ్బంది రేయింబవళ్ళు డిజైన్స్ రూపకల్పనలో పనిచేశారని హరీష్‌రావు ప్రశంసించారు. సెలవులు, పండుగల సమయాల్లో కూడా పని చేయడం వల్ల అనుకున్న సమయానికి డిజైన్లు పూర్తిచేయగలిగినట్లు మంత్రి చెప్పారు.

### మైనర్ ఇరిగేషన్ శాఖకు మంచిపేరు

టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి రెండేళ్ళు మిషన్‌కాకతీయ కార్యక్రమం వల్ల మైనర్ ఇరిగేషన్ విభాగంలో జరిగిన పని వల్ల నీటిపారుదలశాఖకు మంచిపేరు వచ్చిందని మంత్రి హరీష్‌రావు అన్నారు. గత సంవత్సరం382మంది ఎఈఈలను ఇరిగేషన్ శాఖలో నియమించామని, ఈ సంవత్సరంలో 312మంది ఎఈఈలను నియమిస్తున్నామన్నారు. తొలి ఏడాదిన్నరకాలం రాష్ట్రం బాలారిష్టాలను ఎదుర్కొన్నదన్నారు. 2019లో ఎన్నికలు జరగనున్నందున సాగునీటి పథకాలకు సంబంధించి 2018కీలకమని అన్నారు.

### స్పెషల్ సిఎస్‌పై ప్రశంసలు

ప్రభుత్వ స్పెషల్‌సిఎస్ జోషిపై మంత్రి హరీష్ ప్రశంసలజల్లు కురిపించారు. ఎలాంటి అహం లేకుండా స్పెషల్ సిఎస్ చేస్తున్న పనితీరును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి హరీష్‌రావు కోరారు. ఒక్కోసారి టైపిస్ట్‌గా, సెక్షన్ క్లర్క్‌గా కూడా అవతారం ఎత్తి పనిచేస్తున్నారన్నారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రభుత్వ స్పెషల్ సిఎస్ జోషి, ఈఎన్‌సిలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, అనిల్, లిఫ్ట్ పథకాల సలహాదారు పెంటారెడ్డి, పలువురు సిఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు.

### ఏపీ మంత్రి దేవినేనికి హరీశ్ ఫోన్

- ఆర్డీఎస్ ఆయకట్టుకు తుంగభద్ర నీరు విడుదల!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు శుభవార్త అందించారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్‌డిఎస్ ఆయకట్టు రైతులకు మంత్రి చొరవ ఫలితంగా సాగునీరు అందనుంది. బుధవారం ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు రాష్ట్ర మంత్రి హరీష్ ఫోన్ చేసి చర్చలు జరిపారు. ఆర్డీఎస్, కెసికెనాల్ ఆయకట్టు రైతులకు తుంగభద్ర నుండి నీటివిడుదలపై చర్చించారు. నీటివిడుదలపై ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం తుంగభద్ర బోర్డుకు ఇండెంట్ ఇవ్వగా, ఎపి ఇంకా ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడిగా ఇండెంట్ ఇస్తే ఇటు ఆర్‌డిఎస్‌కు, అటు సుంకేసులకు నీరు చేరుతుంది. తుంగభద్ర నుండి ఎపికి 5.2టిఎంసిలు ,తెలంగాణకు, 3.5టిఎంసిలు నీటివాటా రావాల్సి ఉంది. ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని చాలారోజులుగా ఆర్‌డిఎస్ పరిధిలోని రైతులు కోరుతున్నారు. ఉమ్మడి ఇండెంట్ పంపించడానికి ఎపి బుధవారం అంగీకారాన్ని తెలిపింది. దీంతో ఒకటి, రెండురోజుల్లో తుంగభద్ర నుండి ఆర్‌డిఎస్ ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మంత్రులు మాట్లాడుకున్న తర్వాత స్పెషల్ సిఎస్ జోషి, ఎపి ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషన్ కూడా మాట్లాడుకున్నారు.

# రూ.23వేల కోట్లతో గ్రేటర్ అభివృద్ధి

- ఎస్ఆర్‌డీపీ కింద రూ. 3వేలకోట్ల పనులు
- అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో అండర్‌పాస్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : జంటనగరాల అభివృద్ధికి రూ.23వేల కోట్లతో ప్రణాళిక రూపొందించామని, దీని అమలు వివిధ దశల్లో ఉన్నాయని మునిసిపల్, పట్టణా భివృద్ధిశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) కింద 3,200 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.3వేల కోట్ల పనులకు టెండర్లు పిలవనున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో 19 ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగు తున్నాయని, నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇందులో భాగంగా అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో మొదటి అండర్‌పాస్‌ను బుధవారం మంత్రి ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ నిర్మా ణాన్ని 12 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేవలం 9 నెలల్లోనే పూర్తిచేశా మని చెప్పారు. భారీ వర్షాలకు కూడా రోడ్లు దెబ్బతినకుండా ఉండేందుకు రూ.950 కోట్లతో కొత్త టెక్నాలజీతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి దేశంలోనే ప్రత్యేక అనుకూలతలు సంతరించుకున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం జవాబుదారీతనంతో పని చేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని స్థాయిల్లో స్పంది స్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. అత్యుత్తమ జీవన ప్రమా ణాలు కలిగిన నగరంగా వరు సగా మూడేళ్ళు హైదరాబాద్ ఎంపికైందని ఆయన గుర్తుచేశారు.


మైండ్‌స్పేస్ వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ మార్చి నెలనాటికి పూర్తవు తుందని, అలాగే జూన్ నాటికి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తిచేస్తామని కేటీఆర్ చెప్పారు. అలాగే జూన్ నెలాఖరు నాటికి కామినేని జంక్షన్ ఫ్లైఓవర్, ఏప్రిల్ చివరి నాటికి చింతల కుంట అండర్‌పాస్ నిర్మాణం పూర్తి చేస్తామని ఆయ న చెప్పారు. వివిఎస్‌టి నుంచి ఇందిరాపార్కు వరకు ఫ్లైఓవర్ నిర్మా ణం పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లోని రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మ తులు చేస్తున్నామని చెప్పారు.




అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో అండర్‌పాస్ రోడ్ ప్రారంభించిన అనంతరం పాదయాత్రగా వస్తున్న మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, నగర మేయర్ రామ్మోహన్, కమిషనర్, ఇతర అధికారులు.

# శరవేగంగా..కాళేశ్వరం

- నిధులపై సీఎం అభయ హస్తం
- వడివడిగా మోటార్ల బిగింపు పనులు
- జలసౌధ నుండి మంత్రి హరీశ్‌రావు పనుల పరిశీలన


కాళేశ్వరం పనులను వీడియోద్వారా చూస్తున్న మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కాళేశ్వరం ప్రాజెక్టు పనులు శరవేగంగా.. జరుగుతున్నాయి. రూ.80వేల కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌కు నీరందించాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు సంబంధించిన బాధ్యతను ఇరిగేషన్ యంత్రాంగంపై పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం కాళేశ్వరంతో పాటు మొత్తం ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.20వేల కోట్లు కావాలని.. కోరగా, రూ.10నుండి 12వేల కోట్ల సర్దుబాటుకు ఆర్థికశాఖ ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం పరిస్థితిని నీటి పారుదల శాఖ, ఆర్థికశాఖ అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్ళగా.. పనులు ముఖ్యమని.. అవస రమైన నిధులు సర్దుబాటు చేస్తామని భరోసా నిచ్చి నట్లు సమాచారం. నిధులపై సిఎం ఇచ్చిన అభయహ స్తంతో నీటిపారుదల శాఖవర్గాల్లో, వర్కింగ్ ఏజెన్సీ లలో ఉత్సాహం నెల కొంది. వర్కింగ్‌సీజన్ కోసం మే వరకు రూ.28వేల కోట్లు కావాలని నీటిపారుదల శాఖ కోరినట్లు తెలిసింది.

### మోటార్ల బిగింపు మొదలు

కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకవైపు సివిల్ పనులు శరవేగంగా కొనసాగుతుండగానే.. మరోవైపు మోటా ర్ల బిగింపు పనులు వేగం పుంజుకున్నాయి. ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరు వరకు నీటితర లింపుకు అను గుణంగా సివిల్ పనులు తుదిదశకు చేరుకోవడంతో ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు ముమ్మరమయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి ఈ ఏడాది గోదావరి జలాలను ఎత్తిపోయాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు నీటిపారుదల శాఖ రేయింబవళ్ళు కృషి చేస్తున్నది. గత డిసెం బర్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో కాళేశ్వరం పనులను పర్యవేక్షించడం, తర్వాత మంత్రి హరీష్ మూడు రోజుల పాటు ప్రతి పనినీ నిశితంగా పరిశీలించడంతో అధికారులు, నిర్మాణ ఏజెన్సీలు దృఢంగా పనిచేస్తున్నాయి. దీనికి తోడు మోటార్ల బిగింపు కూడా వేగవం తమైంది. మేడారం నుండి ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించడానికి రామడుగు వద్ద పంప్‌హౌజ్‌ను నిర్మించారు. సాధారణంగా సివిల్ పనులు ముగిసిన తర్వాత ఒక మోటార్‌ను బిగించేందుకు కనీసం మూడుమాసాల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. రామడుగులో రెండో మోటార్ బిగించడం పూర్తయితే మార్చి నుండి రెండు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉంటాయి. ప్యాకేజీ-6లో భాగంగా ఎల్లంపల్లి నుండి మేడారం రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా నీళ్ళు వచ్చిన తర్వాత లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం మేడారం దగ్గర 124మెగావాట్ల సామర్ధ్యంతో ఏడుమోటార్లను ఏర్పాటుచేస్తారు. ఇక్కడ కూడా సివిల్ పనులు చివరిదశకు చేరడంతో తొలిమోటార్‌ను అమర్చే పనులు ప్రారంభమయ్యాయి. ఇది కూడా మార్చి నాటికి పూర్తికానుంది. ఈలోగా మరిన్నిమోటార్ల బిగింపు పనులు కూడా మొదలు కానున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును యజ్ఞంలా భావిస్తున్న ప్రభు త్వం.. రోజులు, గంటలను లెక్కిస్తూ యుద్ధప్రా తిపదికన పనులను నిర్వహిస్తోంది.

### జలసౌధ నుండి పనులు పరిశీలన..

జలసౌధ నుండి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రత్యక్షంగా జరుగుతున్న విధానాన్ని, ఇప్పటిదాకా జరిగిన పనులను మంత్రి హరీష్ రావు బుధవారం పరిశీలించారు. స్పెషల్ సిఎస్‌జోషి, ఓఎస్డి శ్రీధర్ దేశ్‌పాండే, ఈఎన్‌సిలతో కలిసి ఆయన పనుల పురోగతి తెలుసుకున్నారు.

### కాళేశ్వరంపై ఎన్‌జీటీ విచారణ వాయిదా

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి పర్యావరణ అనుమతులపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో దాఖలైన పిటిషన్‌పై విచారణ ఫిబ్రవరి 16వ తేదీకి వాయిదా పడింది. బుధవారం ఈ కేసును జస్టిస్ యుడీ సాల్వీ బెంచ్ విచారించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ ఈ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని, ప్రాజెక్టుకు సంబంధించి అన్ని రకాల అనుమతులు వచ్చాయని తెలిపారు. పర్యావరణ అనుమతులు లభించి నపుడు ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘిస్తూ పనులు చేపట్టిందని, దీనిపై విచారణ జరిపేందుకు కమీషన్ ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ కోరారు. తాగునీటి అవసరాల కోసమే పనులు చేపట్టిందని, తాగునీటి అవసరాల కోసం చేపట్టే పనులకు ఎలాం టి అనుమతులు అవసరం లేదని స్పష్టం చేశారు. ట్రిబ్యునల్ కల్పిం చుకుని పిటిషనర్లు దాఖలు చేసిన అప్లికేషన్ విచారణ చేయ దగిందా? లేదా అన్నది , అనంతరం విచారణ పరి ధిపై నిర్ణయిస్తామని స్పష్టంచేసింది.

# లౌకిక రాజ్యం పేరుకే... చేసేదంతా మత రాజకీయమే!

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోంది. మతాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు పరస్పర అభిప్రాయబేధాలకు, దాడులకు కారణమౌతుండడంతో పలువురు వీటితో విసిగిపోతున్నారు. గతేడాది మార్చిలో నిర్వహించిన ఓ అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా మతం పట్ల ప్రజల్లో మారుతున్న అభిప్రాయాల్ని గుర్తించారు. ఇప్పటికే నార్వేలో 37శాతం మంది ప్రజలు మతాన్ని విశ్వసిస్తున్నట్లు ప్రకటిస్తే 39శాతం మంది తమకే మతంతోనూ సంబంధంలేదని ప్రకటించారు. క్రైస్తవ సమాజంగా గుర్తింపు పొందిన అమెరికాలో 21శాతం మంది మతాన్ని విశ్వసించడంలేదని తేల్చిచెప్పారు. పిఇడబ్ల్యు రీసెర్చ్ సెంటర్ అధ్యయనం మేరకు ఇది 24శాతంగా ఉంది. ఇక చైనా, జపాన్, చెక్‌రిపబ్లిక్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఐస్‌ల్యాండ్‌లు ఇప్పటికే మతాతీత రాజ్యాలుగా ప్రకటించుకున్నాయి. గేలప్ అధ్యయన నివేదిక మేరకు చైనాలో 45 నుంచి 49.9శాతం మంది తమను పై నుంచి నడిపిస్తున్న అసాధారణ శక్తి అంటూ ఏం లేదన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. 1976నుంచి చైనాలో మతాల గుర్తింపు నిలిపేశారు. అక్కడ ఎవరు ఏ మతాన్నైనా విశ్వసించుకోవచ్చు. ఏ మత ప్రార్థననైనా నిరభ్యంతరంగా నిర్వహించుకోవచ్చు. అంతేతప్ప బహిరంగంగా మత సంబంధిత సభలు, సమావేశాలకు అనుమతులివ్వరు. ఇతర మతాల్ని కించపర్చే చర్యల్ని ప్రభుత్వం సహించదు. ఇక మతప్రాతిపదికన ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోవు. మతాన్ని కేవలం ప్రజల విశ్వాస ప్రతిపదికగానే అక్కడి ప్రభుత్వం గుర్తిస్తోంది. అంతకుమించి ఇందులో ప్రభుత్వం తలదూర్చదు. కాగా జపాన్‌లో ఏ మతాన్ని అనుసరించనివారి సంఖ్య2010లో 30శాతం ఉంటే 2016నాటికిది 39శాతానికి పెరిగింది. వాస్తవానికి జపాన్‌లో బౌద్ధాన్ని అత్యధికులు ఆచరిస్తున్నారు. పురాతన షిండోయిజం మతానికి చెందిన వారు కూడా ఇక్కడ అధిక సంఖ్యలోనే ఉన్నారు. కానీ ఆధునిక యువత



మతాతీతంగానే వ్యవహరిస్తోంది. ఏ మతాన్ని ఆచరించేందుకు వారు ఇష్టపడ్డంలేదు. ఇక ప్రపంచంలోనే మతాన్ని విశ్వసించేవారు అతితక్కువ సంఖ్యగా ఉన్న దేశంగా చెక్‌రిపబ్లికన్‌ను పేర్కోవచ్చు. ఇక్కడ 34శాతం మంది మాత్రమే ఏదో మతాన్ని విశ్వసిస్తున్నారు. శతాబ్ధాల క్రితం నాటి కేథలిక్ చర్చిలు ఇక్కడున్నా మత విశ్వాసాల్ని పెంచేందుకు ప్రభుత్వం మాత్రం అంగీకరించడంలేదు. 1948నుంచి 1989వరకు ఈ దేశం కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉంది. ఇదికూడా ఇక్కడ మతాతీత భావన పెరిగేందుకు దోహదపడింది. ఇక ఫ్రాన్స్‌లో 20శాతు మందికిపైగా మతాన్ని విశ్వసించడంలేదు. చైనా తరహాలోనే ఫ్రాన్స్ కూడా తన సరిహద్దు దేశాల్లో మతాతీత భావన పెంచే ప్రయత్నం చేస్తోంది. 1789 ఫ్రెంచ్ విప్లవం తర్వాత ఫ్రాన్స్ రోమన్‌కేథలిక్ దేశంగా మారింది. అయితే 1905లో చర్చ్, పాలనకు మధ్య స్పష్టమైన అంతరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్నుంచి ఇక్కడ మత ప్రాతిపదిక విధానాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే ఆస్ట్రేలియాలో 23నుంచి 24శాతం మంది తమకెలాంటి మత విశ్వాసాల్లేవని ప్రకటించారు. 1788నుంచి ఈ దేశంపై ఇంగ్లాండ్ చర్చి ప్రభావం అధికంగా ఉండేది. ఇక ఐస్‌లాండ్‌లో అయితే 1874లోనే మత స్వేచ్ఛ కలిగిన దేశంగా ఆవిర్భవించింది. అప్పట్నుంచి ఇక్కడ మతాతీత భావన పెరిగింది.

ఈ ఆరు దేశాల్లోనూ మతపర స్వేచ్ఛ ఉంది. కానీ మతాన్నిక్కడ రాజకీయాలకు ప్రాతిపదికగా వాడుకోరు. మత విశ్వాసాల పేరిట పరస్పర దాడులకు పాల్పడితే ప్రభుత్వం సహించదు. కానీ భారత్‌లో ఇప్పటికీ మతాన్ని రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందే విధానం కొనసాగుతోంది. వాస్తవానికి ఇక్కడ కూడా ప్రజలు మత ఆధారితంగా ఓట్లేయడంలేదు. గతంలోనే ఇది అనేక సార్లు రుజువైంది. ఆధ్యాత్మిక సమావేశాలకొచ్చే లక్షలాదిమంది భక్తులు అదే ప్రసంగీకుడు లేదా ఆధ్యాత్మికవేత్త నేరుగా ఎన్నికల్లో నిలబడితే అతనికి ఓట్లేయడం లేదు. తిరిగి పార్టీల సిద్ధాంతాలు, ఇతర ప్రాతిపదికల్నే విశ్వసిస్తున్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా మతాన్ని, రాజకీయాన్ని వేరుచేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ సమాజం మతపరదాడుల కారణంగా అనేక నష్టాల్ని చవిచూసింది. ప్రపంచంలో ఇంతవరకు జరిగిన యుద్ధాల్లో 80శాతానికిపైగా మత ప్రాతిపదికనే చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ మతం పేరిట ప్రపంచవ్యాప్తంగా మారణహోమాలు నిత్యకృత్యమయ్యాయి. మతాన్ని వ్యక్తిగత విశ్వాసంగా తప్ప సామాజిక విధానంగా అనుసరించడం వల్ల కలుగుతున్న నష్టాల్ని గుర్తించిన ఆధునిక తరం అంచెలంచెలుగా దీనికి దూరమయ్యే ప్రయత్నం చేస్తోంది. ఈ దశలో కూడా భారత రాజకీయవేత్తలు మత ఆధారిత ప్రయోజనాల కోసం ప్రాకులాడ్డం విమర్శలకు తావిస్తోంది.



## స్పైస్ పార్కుకు రూ.20కోట్లు

- కేంద్రమంత్రి సురేష్‌ప్రభుతో ఎంపి కవిత భేటీ
- తెలంగాణకు స్పెషల్ టర్మరిక్ సెల్
- ఫలించిన కవిత ప్రయత్నం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పసుపు రైతుల పక్షాన గత మూడేళ్ళుగా పోరాడుతున్న ఎంపి కల్వకుంట్ల కవిత పట్టుబట్టి అనుకున్నది సాధించారు. పసుపుబోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న ఆమె స్పైస్ పార్క్‌కు రూ.20కోట్ల కేంద్రసాయాన్ని సాధించడంతో పాటు తెలంగాణకు స్పెషల్ టర్మరిక్ సెల్‌ను సాధించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభును నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత బుధవారం ఢిల్లీలో కలిశారు. నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలో స్పైస్ పార్క్ కోసం రాష్ట్రప్రభుత్వం 42ఎకరాల భూమిని రూ.30కోట్లు మంజూరుచేసిందని మంత్రి సురేష్ ప్రభు రాష్ట్రప్రభుత్వ నిధులకు తోడుగా కేంద్రం తరుపున రూ.20కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపి కవిత పసుపురైతులను ఆదుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను మంత్రి అభినందించారు. మంత్రి సూచనమేరకు ఫిబ్రవరి 3న స్పైస్ బోర్డు చైర్మన్, వాణిజ్యమంత్రిత్వ శాఖ అధికారులు హైదరాబాద్ వస్తున్నారు. అదేరోజు హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

### టర్మరిక్ సెల్..

తెలంగాణలో పసుపురైతులను ఆదుకునేందుకు టర్మరిక్ సెల్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఫిబ్రవరిలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సురేష్ ప్రభు దీనిని ప్రారంభించనున్నారు. ఈ సెల్ ద్వారా రైతులకు నాణ్యమైన పసుపువంగడాలు లభిస్తాయి. పంట చేతికి వచ్చాకప్రాసెస్ చేసేందుకు రైతులకు బాయిలర్‌లను అందజెయమని నాబార్డును కోరతామని సురేష్ ప్రభు హామీనిచ్చారు. పసుపురైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన సురేష్ ప్రభుకు ఎంపి కవిత కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి హరీష్‌రావును కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

## గజ్వేల్ కమ్యూనిటీ ఆసుపత్రి అప్‌గ్రేడ్

- 50 పడకల నుంచి100 పడకలకు విస్తరణ

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** మెదక్ జిల్లా గజ్వేల్‌లోని 50 పడకల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం జీఓను జారీ చేసింది.ప్రస్తుతం50 పడకలతో కొనసాగుతున్న ఈ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులను జారీ చేశారు. అప్‌గ్రేడ్ కోసం అవసరమైన నిధులు రూ.21.30 కోట్లకు పరిపాలనా అనుమతులను ఇచ్చింది.

## రజనీపై స్టాలిన్ విమర్శ

**చెన్నయ్:** ద్రవిడ ఉద్యమానికి పురిటిగడ్డ లాంటి తమిళనాడులో సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రవచిస్తున్న ఆధ్యాత్మిక రాజకీయాలకు చోటు లేదని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె.స్టాలిన్ బుధవారం తెలిపారు. డీఎంకే అధినేత ఎం.కరుణానిధిని రజనీకాంత్ కలుసుకున్న తర్వాత కొద్దిసేపటికే స్టాలిన్ ఈ వ్యాఖ్య చేయడం విశేషం. తమిళనాడులో ద్రవిడ ఉద్యమాన్ని దెబ్బ తీయడానికే రజనీకాంత్ ఒక పార్టీ పెడుతున్నారు అనే భావనలో కొందరు ఉన్నారు. ఇది పెరియర్ అన్నా(ద్రవిడ కళగం వ్యవస్థాపకుడు ఇ.వి.రామస్వామి పెరియర్), కలైజ్ఞర్(కరుణానిధి) జన్మించిన గడ్డ అని నేను చెబుతున్నాను. గతంలో సైతం ఇలాంటి ప్రయత్నాలు దెబ్బ తిన్నాయి అని స్టాలిన్ విలేకరులతో అన్నారు. రజనీకాంత్ డీఎంకే మద్దతు అడిగారా అన్న ప్రశ్నకు అలాంటి విషయాలు ఎన్నికలప్పుడే నిర్ణయించబడతాయని ఆయన సమాధానమిచ్చారు.

## చాక్లెట్ రంగులో 10 రూపాయల నోటు!

**ముంబై :** త్వరలో 10 రూపాయల నోటు కొత్త రంగుతో మన చేతుల్లోకి రానుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) మహాత్మా గాంధీ సిరీస్ కింద కొత్త 10 రూపాయల నోట్లను జారీ చేయ నుంది. ఇప్పటికే దాదాపు 100 కోట్ల కొత్త నోట్లను ఆర్బీఐ ముద్రించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చాక్లెట్ బ్రవున్ రంగుతో ఉండే కొత్త నోటుపై కోణార్క్ సూర్య దేవాలయం బొమ్మ ముద్రించి ఉంటుంది. ప్రభుత్వం ఈ డిజైన్‌కు గతవారమే ఆమోదం తెలిపిందని వారు తెలిపారు. 10 రూపాయల నోటు డిజైన్‌లో మార్పు చివరిసారిగా 2005లో చోటు చేసుకుంది. ఆర్బీఐ గత ఆగస్టులో మహాత్మాగాంధీ సిరీస్ కింద కొత్త రూ.200, రూ.50 నోట్లను విడుదల చేసింది. అయితే తాజాగా 10 రూపాయల నోటు డిజైన్‌లో మార్పును ఆర్బీఐ అధికారికంగా ధృవకరించాల్సి ఉంది.

## ట్రాన్స్‌కో సీఎండీకి సీబీఐపీ అవార్డు

- విద్యుత్ సరఫరాలో సాధించిన విశేష ప్రగతికి గుర్తింపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వివిధ రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తూ దేశవ్యాప్తంగా అనేక అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో ఘనత సాధించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) ప్రతి ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డుకు ఈసారి తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు ఎంపిక అయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్ర కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. విద్యుత్ సరఫరా రంగంలో విశేష కృషి చేసి దేశంలోనే తెలంగాణా ట్రాన్స్‌కోను పలు అంశాల్లో అగ్రగామిగా నిలిపినందుకు ప్రభాకర్ రావును సీబీఐపీ జ్యూరీ ఎంపిక చేసింది. అవార్డు ఎంపిక కోసం అనేక అంశాలను జ్యూరీ పరిగణలోకి తీసుకుంది. ఇందులో తెలంగాణ ట్రాన్స్‌కో సాధించిన కొన్ని విజయాలను గమనిస్తే.. గడిచిన మూడున్నరేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా 514 సబ్ స్టేషన్లు, 1724 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థ సామర్థ్యాన్ని 40 శాతం పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగదారులకు చేర్చే విషయంలో తెలంగాణ ట్రాన్స్‌కో వృధాను అరికట్టి 99 శాతం లభ్యతను సాధించి దేశ సగటును మించింది. తెలంగాణ ట్రాన్స్‌కోలో సరఫరా నష్టాలు 3.37 శాతానికి తగ్గాయి. ఇది దేశ సగటు కన్నా తక్కువ. ఉత్తర దక్షిణ గ్రిడ్‌ల మధ్య కొత్త లైన్లు నిర్మించడంలో తెలంగాణ ట్రాన్స్‌కో విశేషమైన చొరవను ప్రదర్శించింది. వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్



అందించడానికి 11వేల మెగావాట్ల డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు తెలంగాణ ట్రాన్స్‌కో సరఫరా వ్యవస్థను సిద్ధం చేసింది. బుధవారం సాయంత్రం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్, కేంద్ర జలవనరల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, విద్యుత్ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ సింగ్, సీబీఐపీ ఉపాధ్యక్షుడు మసూద్ హుస్సేన్, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యు.పి. సింగ్, సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ కార్యదర్శి ఆనంద్ కుమార్, కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎం నుంచి డబ్బుల వరద

(మొదటిపేజీ తరువాయి)

రూ. 5000 డ్రా చేయగా రూ. 25 వేలు, మరో ఖాతా దారుడు రూ.3500 డ్రా చేయగా రూ.35 వేలు ఈ విధంగా డబ్బులు వరదలాగా చేతికి వచ్చాయి. ఆ నోటా ఈ నోటా ఖాతాదారులకు తెలిసి ఏటీఎం వద్దకు భారీగా చేరుకున్నారు. సమాచారం అందుకున్న బ్యాంకు అధికారులు ఏటీఎం మిషన్ పని చేయకుండా నిలిపివేశారు. శివనగర్ శాఖకు చెందిన బ్యాంకు సిబ్బంది హుటా హుటిన ఏటీఎం వద్దకు చేరుకొని ఏటీఎంను మూసి వేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ టెక్నికల్ కారణాలతో ఇలా జరిగిందని పొరపాటున వందలు పెట్టే స్థానంలో రూ.500 జోడించడం వల్ల సమస్య తలెత్తిందని వెల్లడించారు. ఖాతా దారుల నుండి ఎక్కువ మొత్తంలో డ్రా అయిన నగదును రికవరీ చేసుకుంటామని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని సిబ్బంది వెల్లడించారు.

## పెట్టుబడి రాయితీకి కొత్త చిక్కులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సాహక రాయితీని బ్యాంకు ఖాతాల్లో జమచేసినా, చెక్కుల రూపంలో అందజేసినా, అప్పటికే బకాయపడి ఉన్న మొత్తం కింద జమచేసుకునే ప్రమాదం ఉన్నందున పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తున్నారు. గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా లబ్ధిదారులకు నేరుగా డబ్బులు పంపిణీ చేయాలని భావిస్తున్నప్పటికీ, అందుకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అడ్డొస్తున్నాయి.



ప్రభుత్వాలు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టినా వాటిద్వారా లబ్ధిదారులకు చేకూరే ఆర్థిక సహకారాన్ని, నష్టపరిహారం మొత్తాన్ని కేవలం బ్యాంకు ఖాతాల ద్వారానే బట్వాడా చేయాలని గత ఏడాది కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని చిక్కుముడిని అధిగమించేందుకు వ్యవసాయ, ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారుల బృందం వివిధ రంగాల్లోని నిపుణులతో చర్చిస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఈ పథకం అమలుకు సంబంధించి కొంత కసరత్తు చేసిన అధికార యంత్రాంగం, భూ రికార్డుల ప్రక్షాళనతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు మార్గం సుగమం చేసింది.

నేరుగా డబ్బుల పంపిణీకి అవకాశం లేనందున, పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలను తెరిపించి ప్రోత్సాహక రాయితీ మొత్తాన్ని రైతులకు పంపిణీ చేయాలన్న కొత్త ఆలోచన తెరపైకి వచ్చింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 56 లక్షల రైతు కుటుంబాలు ఉన్నందున అంత పెద్దమొత్తంలో ఖాతాలు తెరువడం సాధ్యమా అన్న కోణంలో సమాలోచనలు జరుపుతున్నారు.

ఈ అంశంపై త్వరలోనే రాష్ట్ర పోస్టల్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించాలని నిర్ణయించారు. అనంతరం పూర్తి వివరాలతో కూడిన నివేదికను ముఖ్యమంత్రి ముందుంచి తుదినిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఈ కసరత్తును ఫిబ్రవరి మొదటివారం లోగా పూర్తిచేసి అనంతరం పెట్టుబడి రాయితీ పథకం అమలుకు తుది మార్గదర్శకాలు వెలువరించేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది.

## ఫేస్‌బుక్‌లో మోడీ, సచిన్‌లదే హవా



**న్యూఢిల్లీ:** ఫేస్‌బుక్‌పై 2017 సంవత్సరానికి అత్యంత ప్రసిద్ధి చెందిన పార్లమెంటేరియన్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నిలిచారు. లోక్‌సభ సభ్యునిగా మోడీ, రాజ్యసభ సభ్యునిగా సచిన్ ఈ ఘనత సాధించారని ఫేస్‌బుక్ ఒక ప్రకటనలో తెలిపింది. గడచిన ఏడాది కాలంలో రియాక్షన్లు, షేర్లు, కామెంట్లు ప్రాతిపదికగా ర్యాంకింగ్ నిర్ణయించారు. ఆర్.కె.సిన్హా, అమిత్ షా, అసదుద్దీన్ ఒవైసీ, భగవంత్ మాన్,తదితర పార్లమెంట్ సభ్యులు కూడా ఫేస్‌బుక్ జాబితాలో ఉన్నారు.

సర్వోన్నత ప్రభుత్వ కార్యాలయాల విషయానికి వస్తే పీఎంవో ఇండియా అత్యంత ప్రసిద్ధి చెందగా ఆ తర్వాతి స్థానాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పొందారు. మంత్రిత్వ శాఖల్లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అగ్రస్థానంలో నిలిచింది.పీవోవో ఇండియాకు 13.74 మిలియన్ల ఫాలోవర్లు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు 4.88 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అత్యంత ప్రసిద్ధి చెందిన సీఎంగా నిలిచారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే ఆ తర్వాతి స్థానాన్ని దక్కించుకున్నారు.ఆసక్తికరంగా రాజకీయ పార్టీల్లో ఫేస్‌బుక్ అగ్రతాంబూలం భారతీయ జనతాపార్టీకి లభించింది. ఆ తర్వాతి స్థానం ఆమ్ ఆద్మీ పార్టీకి దక్కింది. మూడవ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నిలిచింది.

## రైలు లేటుపై గంట ముందే ఎస్ఎంఎస్

IRCTC

**న్యూఢిల్లీ:** రైలు రాకపోకల్లో జాప్యం గంట సేపటి కన్నా ఎక్కువ ఉంటే సదరు రైలు కోసం మార్గమధ్యం స్టేషన్లలో ఉండే ప్రయాణికులు ఎస్ఎంఎస్ పొందుతారని భారతీయ రైల్వే బుధవారం ప్రకటించింది. ఈ సర్వీసును అదనంగా 1,104 రైళ్ళకు వర్తింపజేసింది. గత నవంబర్‌లో మొదట 102 ప్రీమియం రైళ్ళతో ప్రారంభించిన ఈ సర్వీసును, ఆ తర్వాత మరో 157 రైళ్ళకు వర్తింపజేశారు. ఇకపై మార్గమధ్యం స్టేషన్లలో వేచి ఉండే ప్రయాణికులు సైతం రైలు ఎప్పుడు వచ్చేది ముందే తెలుసుకుంటారు. తదనుగుణంగా వారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేసుకుంటారు అని రైల్వే బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ సర్వీసును వర్తింపజేసిన 1,104 రైళ్ళలో 1,082 సూపర్‌ఫాస్ట్ రైళ్ళు, 22 హమ్‌సఫర్ రైళ్ళు ఉన్నాయి.

భారతీయ రైల్వే గత నవంబర్ మూడవ తేదీ నుంచి డిసెంబర్ ఏడవ తేదీ దాకా 33 లక్షలకు పైగా ఎస్ఎంఎస్‌లను ప్రయాణికులకు పంపించింది. దీని వలన ప్లాట్‌ఫారమ్‌లపై రద్దీ గణనీయంగా తగ్గుతున్నది. ఈ సర్వీసు పొందాలనుకునే ప్రయాణికులు రిజర్వేషన్ ఫామ్‌లపై వారి మొబైల్ నెంబర్‌ను ప్రస్తావించాలి. ప్రయాణికులు ఎక్కడున్నా కానీ వారికి ప్రతి గంటకు ఎస్ఎంఎస్ అందుతుందని రైల్వే బోర్డు అధికారి తెలిపారు. ఈ సర్వీసును ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు.

## ప్రాక్టికల్స్ అంటే ఏంటి? ల్యాబ్.. చూడలేదు!



(మొదటిపేజీ తరువాయి)

కొన్ని చేయించారు అని సమాధానమిచ్చాడు.

ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూప్ చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ అంటే ఏంటో తెలియదు. ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులతోపాటు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులది కూడా ఇదే పరిస్థితి. రాష్ట్రంలోని దాదాపు 80 శాతానికిపైగా జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ చేయించడం లేదు. ప్రభుత్వ కాలేజీల్లోని ల్యాబ్‌లో అన్ని సౌకర్యాలు, పరికరాలు ఉన్నప్పటికీ ప్రాక్టికల్స్ చేయించడం లేదు. కేవలం థియరీ క్లాసులు చెప్పడం వరకే లెక్చరర్లు పరిమితం అవుతున్నారు. ఇక ప్రైవేటు కాలేజీల్లో అయితే ల్యాబ్‌లు సరిగా ఉండవు... వాటిలో పరికరాల సంగతైతే సరేసరి. ఇంటర్ సైన్స్ విద్యార్థుల్లో 80 శాతం మందికి బ్యూరెట్ అంటే ఏంటో, పిప్పెట్ అంటే ఏంటో తెలియని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. ఇదే విషయాన్ని ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి మంగళవారం జరిగిన ప్రగతి పథంలో ఇంటర్ విద్య అనే సదస్సులో స్వయంగా చెప్పారు. ఇకపై ప్రతి కాలేజీలోనూ ప్రాక్టికల్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కడియం ఇంటర్ విద్య కమిషనర్‌ను ఆదేశించారు.

### పరికరాలు ఉన్నా ప్రాక్టికల్స్ సున్నా...

రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా ప్రైవేట్ జూనియర్ కాలేజీలు సుమారు 1600 వరకు ఉన్నాయి. ఈ ఏడాది అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ లేబరేటరీలో అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వాటి ద్వారా పరికరాలను సైతం కొనుగోలు చేసి ఆయా కాలేజీలకు సరఫరా కూడా చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జిల్లాకొక కాలేజీలో మాత్రం పూర్తిస్థాయిలో ప్రాక్టికల్స్‌ను చేయిస్తున్నారు. అవి కాకుండా అక్కడ, ఇక్కడ మరో ఒకటి, రెండు కాలేజీలు ప్రాక్టికల్స్‌ను చేయిసున్నాయి. అయితే అన్ని పరికరాలు, ల్యాబ్‌లు ఉన్నప్పటికీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని లెక్చరర్లు ప్రాక్టికల్స్ చేయించకుండా కేవలం థియరీ క్లాసులనే బోధిస్తున్నారు. అసలు ప్రాక్టికల్స్ అసలే తెలియకుండా ఉంటాయనే ఉద్దేశంతో మూడు, నాలుగు రోజులు విద్యార్థులను ల్యాబ్‌కు తీసుకెళ్లి ప్రాక్టికల్స్‌ను చేయించే పరిస్థితి ప్రభుత్వ కాలేజీల్లో ఉంది. ప్రాక్టికల్ పరీక్షలు ఆయా కాలేజీల్లోనే నిర్వహిస్తున్నందున మార్కుల్లో ఇబ్బం దులు లేకుండా చూస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు తక్కువలో తక్కువ 15 మార్కుల నుంచి 27 వరకు వేస్తున్నారు. అయితే రాష్ట్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీల్లో దాదాపు అన్నింటిలోనూ ప్రాక్టికల్స్‌ను చేయిస్తున్నారు. బాలరు కాలేజీల్లో కొన్నింటిలోనే చేయిస్తున్నారు.

### ల్యాబ్‌లు ఉండవు... పరికరాలు కనిపించవు....

రాష్ట్రంలోని 1500 ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో కొన్ని చిన్ని చిన్న ప్రైవేటు కాలేజీల్లో ప్రాక్టికల్స్‌ను చేయిస్తారు. కార్పొరేట్ కాలేజీల్లో కేవలం 5 శాతం వాటిల్లోనే ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. కార్పొరేట్ కాలేజీల్లో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ర్యాంకులు వస్తాయని భావించిన విద్యార్థులను ఒకేదగ్గర చేర్చి వారికి ప్రత్యేకంగా క్లాసులను నిర్వహిస్తారు. వాటిని సీవోఇ, ఐఐటీ, నీట్ బ్యాచ్‌ల పేరుతో నిర్వహిస్తారు. ఇలాంటి విద్యార్థులకు అయితే అసలు ప్రాక్టికల్స్ చేయించరు. కానీ వారికి మార్కులు మాత్రం ప్రతి బ్యాచ్‌లో 20 మంది విద్యార్థులు ఉంటే వారిలో కనీసం 15 మందికి తగ్గకుండా 30కి 30 మార్కులు వేస్తున్నారు. వాస్తవంగా వీరు థియరీలో మంచి ప్రతిభ కనబరుస్తారు. కానీ ప్రాక్టికల్స్ అంటే వారికి తెలియదు. అయినా వారికి ర్యాంకుల కోసం మార్కులు అవసరం కాబట్టి వారికి 30 మార్కులు వేస్తున్నారు.

### ప్రభుత్వ పర్యవేక్షణ పెరగాలి

ప్రాక్టికల్స్ అంశంలో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలని తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పిల్లలను ఆల్‌రౌండ్‌గా తీర్చిదిద్దాల్సిన క్రమంలో ప్రాక్టికల్స్ చేయించకుండా ఉంటే ఎలా సాధ్యం అవుతుందని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గౌరీ సతీష్ ప్రశ్నించారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకపోతే విద్యార్థులు ఐఐటీ, మెడిసిన్‌లో చేరినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు.

ప్రధానంగా కార్పొరేట్ కాలేజీల్లో ల్యాబ్‌లే ఉండవని, అయినప్పటికీ ఆయా కాలేజీల్లో చదివే విద్యార్థులకు 30కి 30 మార్కులు వస్తున్నాయని అన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో అన్నింటిలో లేబరేటరీలు ఉండేలాగా, వాటిలో సంబంధిత పరికాలు ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీలకు అనుమతులు ఇచ్చే సమయంలోనే వీటిని పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 4 జనవరి 2018

# మహారాష్ట్రలో కోరేగావ్ చిచ్చు!

భీమ్- కోరేగావ్ అంశం రెండు శతాబ్దాల నాటిదే అయినా... కాలక్రమంలో మహారాష్ట్ర సమాజంలో నివురుగప్పిన నిప్పులా రగులుతున్న సామాజిక అసమానతకు దర్పణం. మొత్తంమీద ఇలాంటి సంఘటనలు కమలనాథుల పాలనలోనే జరగడాన్ని కాకతాళీయమంటే దానికి పెద్దగా ఆమోదం లభించే వాతావరణం లేదు. లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెస్సెస్ ప్రస్తావన తేవడం ఈసందర్భంగా గమనార్హమే. మహారాష్ట్రలో రెండు వందల ఏళ్ళనాటి యుద్ధంలో సాధించిన విజయాన్ని గుర్తు చేసుకునేందుకు మహర్ దళితులు జనవరి ఒకటో తేదీన నిర్వహించిన ఉత్సవాలు కుల ఘర్షణలకు దారితీయడం దురదృష్టకరం. ఆనాడు పీష్వా -2 నేతృత్వంలోని సేనలతో ఈస్టిండియా కంపెనీ తరఫున పోరాడిన మహర్ దళితులు సాధించిన విజయానికి సంకేతంగా కోరేగావ్‌లో ఒక స్థూపాన్ని ఆనాడే నిర్మించారు. ఆ స్థూపం వద్ద ఏటా దళితులు సమావేశమై వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీ. దానిని మరాఠాలు వ్యతిరేకించడమూ సర్వసాధారణమే. ఈసారి ఇరువర్గాల మధ్య అపోహలు, అనుమానాలు పెరిగిపోవడానికి ఇటీవల పొరుగున ఉన్న గుజరాత్ ఎన్నికల్లో కుల సమీకరణాల ప్రభావమే కారణం. దళితుల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకు ప్రభుత్వపరంగా పటిష్టమైన చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘర్షణలు చోటు చేసుకునేవి కావు. ఆనాడు ఈస్టిండియా కంపెనీ తరఫున దళితులు పోరాడారు కనుక, వారు నిర్వహించే ఉత్సవాలు సాగనీయరాదన్న పట్టుదలతో మరాఠాలు వ్యవహరించడమే ఘర్షణలకు మూల కారణం.

విభజించి పాలించడం బ్రిటిష్ వారినుంచి వారసత్వంగా మనకు వచ్చిందేమోనని ఇలాంటి సందర్భాల్లో అనిపిస్తుంటుంది. బ్రిటిష్ సైన్యంలో పనిచేసిన వారిలో దళితులే కాకుండా, ఇతర వర్గాల వారూ ఉన్నారు. పాత విషయాలను తవ్వుకుంటూ పోతే సమాజంలో సామరస్యం ఆవిరవుతుంది. ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి రాజకీయ పార్టీలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. దళితులు సంఘటితమవుతున్నారన్న అపోహ మరాఠాల్లో ఏర్పడటం వల్లనే వారు ఈ ఉత్సవాలను వ్యతిరేకించారు. గుజరాత్ ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ అనుసరించిన వ్యూహం తాజాగా కులాల వారీగా సమీకరణలకు కారణమైంది. గుజరాత్‌లో జిగ్నేష్ నేతృత్వంలో దళితుల్లో కొత్తతరం ఈ ఎన్నికల్లో చురుకుగా పాలు పంచుకుంది. అదే మాదిరిగా మహారాష్ట్రలో కూడా దళితులను సంఘటిత పరిచే కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి. అందులో భాగంగానే, దళితులు కొత్త సంవత్సరం ఆరంభం రోజున పూణేకి సమీపంలోని కోరేగావ్‌లో ఉత్సవాన్ని నిర్వహించారు. దీనిని గురించి మరాఠాలు పట్టించుకోకుండా ఉంటే ఘర్షణలు జరిగిఉండేవి కావు. దళితులు, మరాఠాలు రెండేళ్ళుగా సమయం వచ్చినప్పుడల్లా ఘర్షణ పడుతూనే ఉన్నారు. పాత సంఘటనలకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఈసారి మరాఠాలు దళితుల విజయోత్సవ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. రెండేళ్ళ క్రితం కోపర్డీ గ్రామంలో పద్నాల్గేళ్ళ బాలిక మరణానికి దళితులే కారణమన్న ఆరోపణలపై మరాఠాలూ, దళితుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఒక్క మహారాష్ట్రలోనే కాకుండా, భూస్వాములు, దళితుల మధ్య దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఇందుకు పైకి కనిపించే కారణాలు వేర్వేరుగా ఉన్నా, సామాజిక న్యాయం నినాదంగా మిగిలి పోవడమే అసలు కారణం. గుజరాత్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లలో గోరక్షకుల పేరిట దాడుల్లో మరణించిన వారంతా దళితులే. ఈ దాడుల ప్రభావంగానే దళితులంతా జిగ్నేష్ నాయకత్వంలో ఒక్కటయ్యారు. మహారాష్ట్రలో అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ నేతృత్వంలో దళితులు సమయంవచ్చినప్పుడల్లా దళితుల సంఘటనా శక్తిని ప్రదర్శిస్తూనే ఉన్నారు. గోరక్షకులను హెచ్చరించే సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంత తీవ్రంగా స్పందించారో ఇంకా మన స్మృతిపథంలోనే ఉంది. రాజకీయ లబ్ధి కోసం కులాల సమీకరణ ఎంత చేటో తాజాగా మహారాష్ట్రలో జరుగుతున్న ఘర్షణలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఘర్షణల్లో ఒక యువకుడు మరణించాడు. అనేక మంది గాయపడ్డారు. కోరేగావ్‌లో రెండు రోజుల నుంచి సాగుతున్న బంద్ కారణంగా వాహనాలు, భవనాలు దగ్ధమయ్యాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసమర్థత, అనుభవ రాహిత్యం వల్లే గోటితో పోయే గొడవలు ఘర్షణలకు దారితీస్తున్నాయని మహారాష్ట్ర స్ట్రాంగ్ మ్యాన్, మాజీ కేంద్ర మంత్రి శరద్ పవార్ వ్యాఖ్యను రాజకీయమనుకోలేం. అన్ని వర్గాలనూ కలుపుకుని పోవడంలో ఫడ్నవీస్ విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకులు కూడా ఆరోపించారు. ఇరువర్గాలను సమావేశపర్చి శాంతి సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఫడ్నవీస్‌పై ఉంది.

# చమురు: పరాధీనత తగ్గాలి

భూతాపంపై అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా కార్బన్ వాయువుల నియంత్రణ అంశం ప్రధానంగా చర్చకు వస్తుంటుంది. బొగ్గు ఆధారిత పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాల ద్వారా మాత్రమే కాకుండా, చమురు, సహజవాయువుల ద్వారా కూడా కార్బన్ వాయువులు విడుదలవుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనదేశంలో ఇంధన వినియోగాన్ని పరిశీలిస్తే కార్బన్ వాయువులను విడుదల చేసే ఇంధనాన్ని తగ్గించి, సంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ క్రమంలోనే పవన విద్యుత్, సౌర విద్యుత్, బయోగ్యాస్ వంటివి ప్రాచుర్యం పొందాయి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నా మన దేశంలో ఇప్పటికీ 90 శాతం చమురు, సహజవాయువుల వినియోగంపైనే పరిశ్రమలు, సంస్థలు ఆధారపడుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముడి చమురు దిగుమతులను తగ్గించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. 2022 నాటికి దిగుమతులను పది శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని ఆయన నిర్దేశించారు. అంతర్జాతీయంగా చమురు, సహజవాయువుల ఉత్పత్తి, లభ్యత మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని భారత్ తన ప్రణాళికలను నిర్దేశించుకోవల్సి ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పుడున్న అవకాశాలను అంది పుచ్చుకోవాల్సుంది.

అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధర బాగా పడిపోవడం వల్ల చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తులను తగ్గించాయి. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర గత ఏడాది ఇదే కాలంలో బ్యారల్ 40 డాలర్లు ఉండగా, ఈ ఏడాది 60 డాలర్లు ఉంది. 2011 లో ముడిచమురు బ్యారల్ ధర గరిష్టంగా బ్యారల్ ఒక్కింటికి 115డాలర్లకు పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ భారత్ వ్యూహాలను రూపొం దించుకోవాల్సి ఉంది. మరింత చొరవ తీసుకోవల్సి ఉంది. పశ్చిమాసియా దేశాల పై ఆధారపడటాన్ని తగ్గించి అమెరికా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వ రంగంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. చమురు ధరలు పడిపోవడం ఎగువ ప్రాంతంలోని దేశాలు,సంస్థలకు చేదు అనుభవాలను మిగిల్చాయి. దాంతో ఆ దేశాలు చమురు అన్వేషణ, ఉత్పత్తి కార్యక్రమాలను తగ్గించాయి.

2016 నాటికి అన్వేషించాల్సిన చమురు నిక్షేపాలు చమురు క్షేత్రాల్లో ఇప్పటికీ 40 శాతం వనరులను దక్కించుకోవల్సిఉంది. నిక్షేపాలున్న దామాషాలో అన్వేషణ కార్యక్రమాలు సంతృప్తికరంగా సాగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేనందున అన్వేషణ ఆశించిన స్థాయిలో లేదు. చమురు క్షేత్రాల నుంచి డ్రిల్లింగ్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడితే, దిగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. డిజిటైజేషన్,



**అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధర బాగా పడిపోవడం వల్ల చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తులను తగ్గించాయి. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర గత ఏడాది ఇదే కాలంలో బ్యారల్ 40 డాలర్లు ఉండగా, ఈ ఏడాది 60 డాలర్లు ఉంది. 2011 లో ముడిచమురు బ్యారల్ ధర గరిష్టంగా బ్యారల్ ఒక్కింటికి 115డాలర్లకు పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ భారత్ వ్యూహాలను రూపొం దించుకోవాల్సి ఉంది. మరింత చొరవ తీసుకోవల్సి ఉంది. పశ్చిమాసియా దేశాల పై ఆధారపడటాన్ని తగ్గించి అమెరికా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వ రంగంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రయత్నాలు ప్రారంభించాయి.**

3.14మిలియన్ కిలోమీటర్లకు విస్తరించి ఉన్నాయి. భారత్‌లో కూడా అన్వేషణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగాల్సి ఉంది. అన్వేషణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు విస్తృతం చేస్తున్నప్పటికీ, ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉంది. వీటి వల్ల ఉత్పత్తి వ్యయం చాలా వరకు తగ్గుతుంది. చమురు క్షేత్రాల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాల్సి ఉంది. పెట్రో రసాయనాల విలువ పెరగడానికి శుద్ధి, రీగ్యాసింగ్ ప్రక్రియలు సమర్థంగా జరగాలి. యావత్ ఆసియా దేశాలకే భారత్ చమురు శుద్ధి కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఆసియా మార్కెట్లకు శుద్ధి చేసిన చమురు, గ్యాస్ సరఫరా ఇక్కడి నుంచే చేస్తున్నారు. గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.

ఈ క్రమంలోనే ద్రవీకరించిన సహజవాయువుల (ఎన్ఎన్‌జి)దిగుమతులపై దృష్టి సారించింది. చమురు, సహజవాయు రంగాలకు సంబంధించి ఎగువ, దిగువ ప్రాంతాలకు శుద్ధి చేసిన గ్యాస్ సరఫరా చేసే కేంద్రంగా భారత్ రూపుదిద్దుకుం టోంది. వనరులను సాధ్యమైనంత ఎక్కువ సేకరించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అదే సందర్భంలో మార్కెట్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తన వ్యూహాలను మార్చుకోవల్సి ఉంది. భారత పెట్రో రసాయనాల మార్కెట్ వార్షిక వృద్ధి రేటు వచ్చే ఐదేళ్ళలో పది శాతం ఉంటుందని అంచనా. వచ్చే ఐదేళ్ళలో అది 100 బిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. దేశంలో పెట్రోల్, డీజిల్, తదితర ఇంధనాలను డీరెగ్యులేట్ చేసిన దృష్ట్యా రిటైల్ వ్యాపారస్తులు విక్రయ, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయడంపై దృష్టిని సారించాల్సి ఉంది. ఇప్పటికే రంగంలో ఉన్న కంపెనీలకు తోడు మరిన్న కంపెనీలు ప్రవేశిస్తున్న దృష్ట్యా. విక్రయాలు, పంపిణీపై ఒత్తిడి తగ్గవచ్చు. చిన్న,మధ్య తరహా పంపిణీ దారులకు సకాలంలో ,వారి అవసరాల మేరకు సరఫరా చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పంపిణీ వ్యవస్థ కొద్ది మంది ఉత్పత్తి దారుల వద్దనే కేంద్రీకృతమైంది. ఈ రంగంలో ఉన్న వాటాదారులు మరింత దూకుడును ప్రదర్శిస్తూనే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సంప్రదాయ , సంప్రదాయేతర ఇంధన వనరుల సమీకరణ, పంపిణీల మధ్య సమన్వయంఉంటే మన దేశం ముడి చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధార పడాల్సిన అవసరం బాగా తగ్గుతుంది. మెళకువలు పాటిస్తే చమురు రంగంలో పరాధీనతను తగ్గించవచ్చు.

**• ఏపీ స్వామి**

నివాళి

## అంధులకు కావాలి చేయూత

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం. మూగవారు, చెవిటివారూ పరాధీనులు కాకుండా బతకొచ్చు. అంధులు మాత్రం ఇతరుల సాయంలేనిదే కదలలేరు. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వతంత్ర జీవనం సాగించగలుగుతున్నారు. అంధుల కోసం 186 సంవత్సరాల క్రితం ఫ్రెంచ్ విద్యా వేత్త అయిన లూయీ బ్రెయిలీ ప్రత్యేక లిపిని రూపొందించారు. బ్రెయిలీ పేరిట అది ప్రత్యేక లిపిగా స్థిరపడింది. బ్రెయిలీకి ప్రత్యేక లిపిని రూపొందించాలన్న ప్రేరణ కలగడానికి మూలపురుషుడు ఛార్లెస్




బార్బియర్ అనే సైనికాధికారి. సైనికులు రాత్రి వేళల్లో సమాచారాన్ని గ్రహించడం కోసం 12 ఉబ్బెత్తు చుక్కలతో ఒక లిపిని తయారు చేశాడు. వాటిని ఆరు చుక్కలకు తగ్గించి బ్రెయిలీ కొత్త లిపిని రూపొందించాడు. క్షయ వ్యాధి కారణంగా ఆయన 1852లో మరణించారు. ఆయన కనుగొన్న బ్రెయిలీ లిపి 20వ శతాబ్దంలో ప్రాచుర్యాన్ని పొందింది. స్పర్శతోనే కంటి చూపు లేని వారు విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోగలుగుతున్నారు. బ్రెయిలీ లిపిలో అనేక పుస్తకాలు వచ్చాయి. ప్రపంచంలో ఈనాడు కంప్యూటర్ లేనిదే ఏ రంగంలోనూ వ్యవహారాలు నడవని పరిస్థితి నెలకొంది. యావత్ సమాచారం కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉంటోంది. బ్రెయిలీ లిపిలో ఇప్పటికే టైపు రైటర్లు వచ్చాయి. అంధుల కోసం బ్రెయిలీ అథారిటీ ఆఫ్ నార్త్ అమెరికా కంప్యూటర్ బ్రెయిలీ కోడ్‌ని రూపొందించింది. 2016లో దాని స్థానే యూనిఫైడ్ ఇంగ్లీష్‌కోడ్‌ని ప్రవేశపెట్టారు. బ్రెయిలీ కోడ్‌లో రామాయణ,మహాభారతాలవంటి ఇతిహాసాలనూ, చారిత్రక గ్రంథాలను తయారు చేస్తే అంధులు స్వంతంగా వాటి గురించి తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. మిల్టన్ అనే ఆంగ్ల కవి రాసిన ప్యారడైజ్ లాస్ట్, ప్యారడైజ్ గెయిన్ అనే పుస్తకం ఎంత ప్రాచుర్యాన్ని పొందిందో వేరే చెప్పనవసరంలేదు. అంధులకు సమగ్ర సమాచారాన్ని అందించేందుకు వివిధ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి.అంధులు తమ పట్ల సానుభూతిని ప్రదర్శించకుండా, సమాజం అండగా నిలవాలని కోరుకుంటున్నారు. అంధులకు కావల్సింది సహాయంకాదు, చేయూత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల సంక్షేమానికి పెద్ద పీట వేయాలి.

**• కామిడి సతీష్‌రెడ్డి, పరకాల**

# దండెత్తే శకునంలా కిమ్

కొత్త సంవత్సరం అణుయుద్ధానికి వేదికవుతుందా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్ ఉద్రేకం ఇందుకు బాటలు వేస్తోంది. అమెరికాకు ఆయన చేసిన తాజా హెచ్చరిక ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలను సృష్టిస్తోంది. నా టేబుల్‌పైనే న్యూక్లియర్ బటన్ ఉంది కాస్కో అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. నా ప్రధాన లక్ష్యం అమెరికా అంటూ స్పష్టంచేశాడు. ట్రంప్-కిమ్ మధ్య మాటల యుద్ధం శృతిమించితే ఆ ప్రాంతంలో అణుయుద్ధం తప్పకపోవచ్చు. దీనికి తోడు అమెరికా సైనిక బలగాల జాయింట్ చీఫ్ మైక్ ములెన్ చేసిన ప్రకటన అమెరికన్ల గుండెల్లో గుబులు రేపుతోంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గతంలో కంటే ఉత్తర కొరియా గురికి దగ్గరగా ఉందనేదే ఆ ప్రకటన. ఈ సమస్యకు దౌత్యపరమైన పరిష్కారం లభించే అవకాశం దాదాపు లేకపోవడం వల్ల ములెన్ ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. నా ఉద్దేశంలోఅమెరికా ఉత్తర కొరియా అణ్వాస్త్రానికి దగ్గరగా ఉంది. ఇంతకు ముందెన్నడూ ఉత్తర కొరియాకు ఇంత సమర్థమైన అణ్వాయుధం లేదంటూ ఓ టెలివిజన్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అమెరికా నుంచి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా ఎదుర్కొనే స్థితిలో ఉత్తర కొరియా ఉంది.. అదే సందర్భంలో అమెరికా కంటే బలమైన అణ్వాయుధాన్ని అది సొంతం చేసుకుందని పేర్కొన్నారు. నిప్పుతో చెలగాటమాడుతున్న అమెరికాను అడ్డుకోగలరనేది కిమ్ మాటల సారాంశం. న్యూక్లియార్ బటన్ నా టేబుల్‌పైనే ఉంది.. ఇలా చెప్పి బ్లాక్‌మెయిల్ చేయడం లేదని అమెరికా తెలుసుకోవాల్సిన అంశమని ఆయన స్పష్టంచేశారు. ఇది వాస్తవమని తెలిపారు.




విధ్వంసక ఆయుధాల ఉత్పత్తి కార్యక్రమాన్ని రెట్టింపు చేస్తామన్నారు. ఇదే అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను పెంచేస్తోంది.

మనం తొందరగా అణ్వాస్త్రాలు కలిగిన వార్ హెడ్స్‌నూ, బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసి, వాటివాటి స్థానాల్లో ఉంచాలని దేశాన్నుద్దేశించి చేసిన ప్రసంగంలో కిమ్ చెప్పారు. అణ్వాయుధ దేశంగా మారిన ఉత్తర కొరియా తన గమ్యాన్ని చేరుకుందని ప్రకటించారు. ఎక్కువ పరిధిగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను 2017 సంవత్సరం పొడుగునా తయారు చేస్తూనే ఉంది. పరీక్షిస్తూనే ఉంది. ఉత్తర కొరియా లక్ష్యం ఒక్కటే.. అమెరికా పీచమణచడం. మరొకవంక ట్రంప్ ఎప్పటికప్పుడు నార్త్ కొరియా పరీక్షలకు స్పందిస్తూనే ఉన్నారు. తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. పదేపదే ఎగతాళి చేస్తున్న కిమ్‌ను సమూలంగా నాశనం చేస్తానన్నారు. ఆయన ఒక ఆత్మహత్య కార్యక్రమంలో ఉన్నారని ట్రంప్ చెప్పారు. అసలు కిమ్ ఎందుకిలా తయారయ్యారు. అమెరికాపై ఇంత కసి దేనికి? ఎందుకింత పెద్ద ఎత్తున అణ్వాయుధాల తయారీకి పూనుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానంగా వేళ్ళన్నీ ట్రంప్‌వైపే చూపిస్తున్నాయి.

డోనాల్డ్ ట్రంప్ వాడుతున్న కఠిన పదజాలం, కొరియా ప్రాంతంలో సైనిక కార్యకలాపాలు కిమ్‌ను రెచ్చగొట్టాయి. సంయుక్త మిలటరీ విన్యాసాలు జంగ్‌ను జంగిల్‌లో కోతిలా తయారు చేశాయి. దండెత్తడానికి కిమ్ ఒక శకునంలా మారాడు. ఏతా వాతా చూసుకుంటే, ట్రంప్ కోరికోరి కోతితో కరిపించుకున్నట్లయ్యింది. నాయకుల మధ్య వైషమ్యాలు శాంతికి విఘ్నం కలిగేలా మారడం ఇదే ప్రథమం కాదు. పాకిస్థాన్-అమెరికా, భారత్-పాకిస్థాన్, ఇరాక్-అమెరికా, పాలస్తీనా-ఇజ్రాయిల్.. ఇలా ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ప్రపంచ యుద్ధాలుగా మారకుండా వాటిని నివారించుకోవడంలోనే మన నేర్పు కనిపిస్తుంది. నివారించుకోకుంటే మానవాళి మనుగడకే ముప్పులా మారుతుంది.

**• సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి**

# క్షమాశీలజలధి ద్రౌపది

## • రామ్‌మాధవ్‌వి నిందారోపణలే!

భారతీయ ద్వితీయ ఇతిహాసం మరో మారు అనివార్యంగా వివాదాస్పద రచ్చలోకి వచ్చింది. భారతీయ జనతా పార్టీచే నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర స్థానాన ఒక బలోపేతమైన ప్రభుత్వ స్థాపన జరిగిన 2014 నుండి ఆ పార్టీ ప్రజాప్రతినిధులూ, నాయకులూ, వీరాభిమానులూ పదే పదే పెదవిజారుతున్న వివాదాస్పద భాషణాపరంపరల కోణంలోనే ఈ దుమారాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. పనాజీ లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ మహాభారత కథానాయిక ద్రౌపది జీవనాడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్నే సృష్టించాయి. మహాభారతాన్ని మరోమారు ఆయన సంకల్పితంగానే చర్చలలోకి లాక్కొచ్చారు. కురుక్షేత్ర సంగ్రామానికి ద్రౌపది హేతువనీ, ఆమె యుద్ధ కాంక్ష వల్లే నాటి సమరంలో 18 లక్షలమంది విహతులయ్యారనీ, ఆమె పట్టుదలే లేకుంటే ఐదూళ్ళతో సమస్య పరిష్కారమయ్యేదనీ, పంచ భర్తృక ఐనా! ఐదుగురు భర్తలలో ఏ ఒక్కరి మాట కూడా వినేది కాదనీ, శ్రీకృష్ణుని సూచనలనే ఆమె అనుసరించిందనీ రామ్‌మాధవ్ ద్రౌపదీ మాతపై రామ్ మాధవ్ తీవ్రస్థాయిలో సంధించిన ఆరోపణాస్త్రాల సారాంశం. ఇదే కోవలో ఆయన ద్రౌపదిని ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి స్త్రీవాదిగా, దృఢ చిత్తురాలిగా ప్రశంసించారు కూడా.

ద్రౌపది వ్యక్తిత్వ వికాసంపై ఆయనకు బొత్తిగా అవగాహన లేదనుకుంటాను. ఊహాజనిత స్వీయ భావనలతోనే ఆయన ద్రౌపది నడవడిని గాయపరిచివుంటారు. రామ్ మాధవ్‌కి ప్రాథమికంగా మహాభారత ఇతివృత్తం లోతులపై స్పష్టత కావాలి. మహాభారత గాథ వాస్తవిక చరిత్రాంశమా! కాల్పనికమా! అనే పెద్ద మీమాంస నడుస్తున్న ఈ కాలంలో రామ్ ఆ కథనంపై మరింత కసరత్తు చేయాలి. ఏ యే అంశాల ప్రాతిపదికగా రామ్‌మాధవ్ ద్రౌపదిని స్త్రీవాదిగా పేర్కొన్నారో! ఆయా ప్రమాణాలను ఆయన వెదికి పట్టుకుని బహిర్గతం చేయాల్సింది. ద్రౌపది దృఢచిత్తురాలు అన్న ఒక్క సంగతి మాత్రమే ఆమె నడివడికి అన్వయం కుదురుతుంది. పలు సందర్భాల్లో ఆమె ఉపేక్షలు, క్షమా నిర్ణయాల ఈ సుగుణానికి నిరూపణగా దర్శనమిస్తాయి.

వాస్తవానికి ద్రౌపది జీవన గమనాన్ని మూల్యాంకనం చేస్తే ఆమెతో అనేక కోణాలు మనకు బోధపడతాయి. తొలుత తండ్రి నిరాదరణతో ప్రారంభమైన ఆమె ప్రయాణం విపరీత ఆచారానికి ఒంగిన శిరసు, మెడలో ఐదుగురితాళి, వీటితో అనుభవించిన ఎగతాళి, అవమానాలు, అఘాయిత్య ప్రయత్నాలు, కడుపుకోత, క్షమ, దయ, అమ్మదనం, విశాల ఆలోచన, మానవత్వం, గొప్ప సౌశీల్యం, బుద్ధికుశలత ఇత్యాది అంశాల కలబోతతో ఆమె కథాగమనమంతా నిండి ఉంటుంది.

18 అక్షౌహిణుల సైన్యాన్ని 18 లక్షలుగా చెపుతున్న రామ్ మాధవ్ మొత్తం మహాభారతంలోని కృష్ణ రాయభారం సందర్భంలో చోటు చేసుకున్న అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ద్రౌపదిపై ఈ నిందలు మోపి ఉంటారు. రాయభారం ప్రయత్నంలో కూడా ద్రౌపది తను అనుభవించిన క్షోభ, అమర్యాదలనూ వివరిస్తూ సంధి భావనను నిరసించి ఉండవచ్చు. అంతమాత్రం చేత యుద్ధానికి ఆమే కారణమని ధ్రువీకరించడానికి వీలులేదు. శ్రీకృష్ణుని ఎదుట అందరి మాదిరిగానే ద్రౌపదికూడా తన మనోభావాన్ని వ్యక్తం చేసింది. కృష్ణ రాయబారానికి పాండవులతోపాటు ఆమె కూడా ఏకాభిప్రాయానికి ఆమోదం తెలిపారు. కనీసం ఐదూళ్ళు కోరే అంశానికి కూడా అందరూ అంగీకరించడం మూలంగానే శ్రీకృష్ణుడు రాయబారానికి అడుగులు పడ్డాయి ఈ సందర్భంలో ద్రౌపది తనకు జరిగిన అవమానాలను పూర్వపరం చేసుకుని తనంత తానే మనసును కదుట పరుచుకుంది. స్వేచ్ఛగా దాపరికంలేని అభిప్రాయాలను బయల్పరచడాన్ని దోషంగా ఎంచలేము.

అనేక ఘట్టాల్లో ద్రౌపది సర్దుబాటుతోనే వ్యవహరించింది. మత్స్యయంత్రాన్ని ఛేదించిన అర్జునుని పెనిమిటిగా గౌరవాన్ని పొందవలసిన తరుణంలో కుంతీదేవి జారిన మాటను కీలకంగా చేసుకుని వ్యాసుడూ, శ్రీకృష్ణుడు కథనాలకు సంతృప్తి చెంది ఐదుగురినీ కట్టుకోవడానికి తలదించింది. ఇక్కడ ఆమె అబలత్వమే కనిపించింది.

మానమర్యాదలుండవనే పరుష పదాల తాకిడికి గురైంది. అంతేగానీ శ్రీకృష్ణుడు ద్రౌపదికి యుద్ధకాంక్షను ప్రేరేపించే మలుపు ఒక్కటీ మహాభారతంలో అగుపించదు. ఆగ్రహించిన సందర్భాలూ కూడా లేవు.

కురుక్షేత్ర మహాసంగ్రామానికి ద్రౌపది కారణమనే రామ్‌మాధవ్ ఆరోపణకు ఒక్క దృష్టాంతమూ మనకు లభించకపోగా, ఆమె క్షమా, దయాగుణాలను లోకానికి మధ్యాహ్న మార్తాండుని వెలుగులా కనిపించే దృష్టాంతాలు స్పష్టంగా



ఉన్నాయి. జూద గృహంలో వస్త్రాపహరణ రాక్షసక్రీడ చోటు చేసుకున్నపుడు పెద్దలను కొన్ని ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టే ప్రయత్నమే చేసింది గానీ, ఆగ్రహాన్ని వెలిబుచ్చలేదు.

ఉపపాండవులను తెగటార్చిన అశ్వత్థామను ఉపేక్షించిన దయాజలధి ద్రౌపది. మెత్తని మనసు కలిగిన ద్రౌపది మాతలోని యుద్ధ పిపాసను రామ్‌మాధవ్ ఏకోణం నుంచి గ్రహించాడో ఎవరికైనా అంతు చిక్కుతుందా?

ఒకవేళ ద్రౌపది యుద్ధాన్ని కోరుకున్నా, మనం తప్పుపట్టవలసిన అవసరమేమీ లేదు. ఆమె వల్లనే కురుక్షేత్ర మహాసంగ్రామం చోటు చేసుకున్నా దాన్ని మానవనైజంగానే పరిగణించాలి. ఎవరైనా సరే దెబ్బకు దెబ్బ, ప్రాణానికి ప్రాణం తీయాలని భావించరా? రాచరికాల్లో యుద్ధం అనివార్యం. దేశాన్ని, రాజ్యాన్ని రక్షించుకోవాలన్నా, విస్తరించాలన్నా యుద్ధంవలననే సాధ్యమనే విషయాన్ని రామ్‌మాధవ్ గుర్తించాలి. కాకతీయ సామ్రాజ్యం, గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యం, విజయనగర సామ్రాజ్యం, గుప్తసామ్రాజ్యం ఇట్లా సామ్రాజ్యాలు ఏర్పడిన పూర్వరంగాలను విశ్లేషించుకుంటే వీటి పునాదులన్నీ రణమూ, రక్తపాతమూ, నరమేధం తోనే నిండివుంటాయి. ఈ సామ్రాజ్యాధినేతలందరినీ మనం ఈనాటికీ కీర్తిస్తూనే ఉన్నాం కదా! వీరంతా శాంతిసామరస్యాలతో ఇతర రాజ్యాలను కబళించలేదనేది నిజం. ఇట్లా కాకపోతే ద్రౌపది మహిళ కనుక, మహిళలకు యుద్ధాపేక్ష వుండకూడదని రామ్‌మాధవ్ అభిప్రాయపడుతున్నారా! ఈదిశగా ఆలోచన చేస్తే కాకతి రుద్రమనూ, ఝాన్సీలక్ష్మీభాయినీ, చండీరాణినీ, వారి యుద్ధరీతులను కూడా అభిశంసించవలసి ఉంటుంది. అట్లా చేయగలమా! అని ఆలోచించాలి.

మహిళామణుల ప్రేరణ వలన భర్తలు లబ్ధిపొందిన విజయగాథలు వాస్తవం కాదా! ఈ యుద్ధాలలో ప్రాణనష్టం తప్పదు. అనివార్యమైన పరిణామాలను అడ్డుకోలేముకదా! శ్రీకృష్ణుని సలహాల వలన ద్రౌపది యుద్ధకాంక్షను నింపుకోలేదు. పాండవులే శ్రీకృష్ణునిచే యుద్ధ ప్రేరేపితులయ్యారు. యుద్ధాల గురించీ, యుద్ధాలలో కోల్పోయే లక్షల ప్రాణాల గురించీ రామ్‌మాధవ్ చాలానే చదవాల్సివుంది.

పురుషుని వలన యుద్ధం జరిగితే ఒక తీరుగానూ, స్త్రీవలన యుద్ధం సంభవిస్తే మరోతీరుగాను చూడటం మనకు ఏనాటినుండో అలవాటుగా మారింది. చరిత్రను పురుషులకు అనుకూలంగా మలుచుకోవడం కూడా ఎప్పటినుండో ఆచారంగా మలుచుకున్నాం. ఆ దురాచారం ఇంకా కొనసాగుతూనే ఉంది. వక్రీకరణలు మనకు వెన్నతో పెట్టిన విద్యకదా! రామ్‌మాధవ్ కూడా ఈ కోవలోనే నడిచాడని చెప్పడానికి ఎలాంటి సంశయమూ ఉండనవసరం లేదు. మహాభారత సంగ్రామానికి ఎవరైతే కారకులో వారిని వదలి ఏమాత్రం సంబంధంలేని ద్రౌపదిచుట్టూ యుద్ధోన్మాది అంటూ రామ్‌మాధవ్ ప్రదక్షిణలు చేశాడు. ధృతరాష్ట్రుడు, సుయోధనుడు, ధర్మరాజు కొంతమేరకే పాత్రధారులు. ప్రధానమైన దోషి భీష్ముడు. ఈయన జోలికిపోకుండా శూన్యంలో వెతికాడు రామ్‌మాధవ్.

నాటి ఆర్యావర్తంలో భీష్మునితో సమానమైన యోధుడు లేనేలేడు. భీష్ముని భుజబలాన్నీ, శౌర్యాన్ని నమ్ముకునే సుయోధనుడు రంగంలోకి దిగాడు. కురుక్షేత్ర సంగ్రామం 18 రోజులు జరిగితే, 10వ రోజు భీష్ముడు విగతుడయ్యాడు. తన మరణ రహస్యాన్ని దేబరించిన పాండవులకు విడమరిచి, అస్త్రసన్యాసం చేసి, దేహాన్ని అప్పగించి అర్జునుని శరాఘాతాలతో పడిపోయాడు. 10 రోజులలో భీష్ముని సైన్యాధిపతిగా నడిచిన యుద్ధంలో 5 అక్షౌహిణులు పాండవులు సైన్యం హతమయ్యింది. భీష్ముడే కలుగజేసుకుంటే మహాభారత సంగ్రామమే లేదు. పాండవుల రాజ్యం పాండవులకీయమని భీష్ముడే గనుక గట్టిగా నోరు చేసుకుంటే పాండవులకు రాజ్యం సులభంగా దక్కివుండేది. విదురుని మాదిరిగా, భీష్ముడు యుద్ధానికి దూరంగా ఉంటానని ప్రకటిస్తే భారత యుద్ధానికి తావే లేదు. భీష్ముని బలంతోనే సుయోధనుడు విర్రవీగాడు. భీష్ముడే కురురాజ్యానికి రక్షకుడు. ఆయనే ఆ రాజ్యానికి పెట్టనికోట. వికర్ణుడి పాటి జ్ఞానాన్ని ప్రదర్శించలేక పోయాడు. పెదవులు విప్పని భీష్ముని వైఖరిని తప్పుపట్టాల్సింది పోయి ద్రౌపదిని ఆడిపోసుకోవడం రామ్‌మాధవ్‌కు న్యాయంకాదు. యుద్ధానికి కారకులూ, ప్రేరకులూ అయిన దృతరాష్ట్రుడు, సుయోధనుడూ, కర్ణుడూ, శకుని మరోరకంగా మెత్తటి పులి ధర్మరాజూ, ఇందరిని వదలి ఏ పాపం ఎరుగని ద్రౌపదిపై నిందలు సరికాదు. ద్రౌపది వ్యక్తిత్వాన్ని ఉచిత రీతిలో అర్థం చేసుకుని వుంటే రామ్ మాధవ్ ఈవిధంగా వ్యాఖ్యానించి ఉండేవాడు కాదు.

**• వై.హెచ్.కె.మోహన్‌రావు, 9440154114**

# విద్యతో పాటు ఆరోగ్యం



విద్యార్థినులకు ఆరోగ్య భద్రత కిట్లు పంపిణీ చేస్తున్న కడియం శ్రీహరి

• దేశానికే ఆదర్శం మన గురుకులాలు • ఉప ముఖ్యమంత్రి కడియం


**వరంగల్, ప్రభ న్యూస్ బ్యూరో :** గురుకుల పాఠశాలల ఏర్పాటులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉప ముఖ్య మంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, మానవ వనరుల అభివృద్ధితోనే బంగారు తెలంగాణ సాధ్యమని, ఆ మానవ వనరులు విద్యవల్లే అభివృద్ధి అవుతాయని ఆయన అన్నారు. బుధవారం వరంగల్ రూరల్ జిల్లాలో పర్వతగిరి మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరిశుభ్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్, 475 కేజీబీవీలు 840 గురుకులాలు ఉన్నాయన్నారు. తెలంగాణలో రెసిడెన్షియల్ విధానంలో 1,450కు పైగా విద్యాలయాల్లో 8 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.

ఆడ పిల్లలకు వచ్చే ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వ పరంగా రూ.300 విలువ చేసే ఆరోగ్య హైజిన్ కలిగిన ఆరోగ్య పరిశుభ్రత కిట్స్ అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు, ఆరోగ్య భద్రత, పౌష్టిక ఆహారం, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రేపటి నుండి రాష్ట్రంలోని కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థులకు స్నానానికి వేడి నీళ్లు అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం, అన్నం నాణ్యమైన కూరలతో భోజన వసతి కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణకు 15 రకాల వస్తువులు కలిగిన కిట్‌ను అందిస్తున్నామని అన్నారు. కొత్త సంవత్సరం 2018 జనవరి నుండి నెలకు 4 సార్లు మటన్ రెండు సార్లు చికెన్, కోడిగుడ్లు, నెయ్యి, బోర్న్‌విటా, పాలు, స్నాక్స్, రాగి సంకటి మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నామని, ఈ సందర్భంగా కొత్త మెనూను విడుదల చేశారు. నేను పేదరికం నుండి వచ్చిన వాడినేనని పర్వతగిరితో తన అనుభవించిన గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. వారం రోజుల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు, టి.వి. మరో ఆర్‌వోఆర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ కావాలంటే మానవ వనరుల ఏర్పాటు కావాలని, అది విద్యార్థుల వల్లనే సాధ్యమవుతుందన్నారు. అందుకు విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు ఊరికి, పాఠశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.హరిత మాట్లాడారు. గతంలో కేజీబీవీ, మోడల్ గురుకుల పాఠశాలల్లో నాసిరకం కూరగాయల భోజనం ఉండేదని ఇప్పుడు నాణ్యమైన భోజనం, కూరలు విద్యార్థులకు వడ్డిస్తున్నారన్నారు. ఆరోగ్య పరిశుభ్రత కిట్స్‌లోని వస్తువుల పెంపుదల చేయాలని సూచించారు. మన ప్రభుత్వం విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపెడుతుందని, అందుకు విద్యార్థులు, ఇష్టంతో చదివి ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణులు కావాలన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థినులకు ఆరోగ్య భద్రత కిట్లు అందించడం చాలా సంతోషదాయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. విద్యా రంగం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రత్యేక శ్రద్ధ చూపెడుతున్నారని కొనియాడారు.

## దేశాభివృద్ధికి బలమైన ఆర్థిక వ్యవస్థే కీలకం

• రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** నల్లడబ్బు నియంత్రణకు నోట్ల రద్దు ఒక్కటే పరిష్కార మార్గం కాజాలదని భారతీయ రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు పునరుద్ఘాటించారు. కొన్ని వేల మంది ధనవంతులను కట్టడి చేయడానికి తీసుకొనే కీలక నిర్ణయాలు కోట్లాది మంది సామాన్యుల ప్రయోజనాలకు విఘాతం కారాదని పేర్కొన్నారు. ఒకసారి నల్లధనాన్ని నియంత్రించినంత మాత్రాన తిరిగి చలామణిలోకి రాదనే గ్యారంటీ లేదన్నారు. పెద్ద నోట్లను రద్దు చేసి 60 మాసాలు గడిచిపోయిప్పటికీ దాని ప్రభావం ఇంకా కొనసాగుతునే ఉందన్నారు. డబ్బు చెలామణిని నియంత్రించడం సహేతుకమైన ఆర్థిక విధానం కాదన్నారు. ఆర్థిక ప్రగతికి, ఉత్పాదకతకు, దైనందిన అవసరాలపైన దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. దీర్ఘ కాలిక ప్రయోజనాలను ఆశించి తీసుకొనే నిర్ణయాలతో స్వల్ప కాలిక ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడకూడదని వెల్లడించారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం దీర్ఘ కాలిక ప్రయోజనాలను ఆశించి తీసుకున్న దిశగానే భావించవలసి ఉంటుందన్నారు.

ఆర్‌బిఐ-రోజువారీ జీవితాలపై దాని ప్రభావం అనే అంశంపై జాతీయ గ్రామీణాభివృద్ధి - పంచాయతీరాజ్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పరిపుష్టిగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. డబ్బు ప్రజల దైనందీన జీవనంలో కీలక భూమిక పోషిస్తుందని సుబ్బారావు వివరించారు. డబ్బును ముద్రించడం, నియంత్రించడం, చలామణిలో ఉంచడంలో రిజర్వు బ్యాంకు పాత్ర అత్యంత కీలకమైందని వివరించారు. సుస్థిర ఆర్థికాభివృద్ధిలో ద్రవ్య నియంత్రణ కూడా ముఖ్యమైందన్నారు. ఆర్థిక సంస్కరణల ప్రభావం విస్మరించరానిదన్నారు. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావలసి ఉందన్నారు. నష్టదాయకమైన బ్యాంకులకు ప్రజాధనంతో ఊతమిచ్చే విధానాలపై చర్చ జరగవలసి ఉందన్నారు. సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను బ్యాంకులు పరిరక్షించవలసి ఉందన్నారు. నిరర్థక ఆస్తులు పెరగడం, మొండి బకాయిలు పేరుకుపోవడం లాంటి అంశాల వెనుక అనేక కారణాలు ఉంటాయన్నారు.

అభివృద్ధికి దోహదపడే రంగాలకు రుణాలు ఇవ్వడం తప్పు కాదని, పెట్టుబడులు, నిర్వహణ విధానాల్లో తప్పిదాల వల్ల కొన్ని సంస్థలు నిరర్థకంగా మారుతున్నాయన్నారు. ధరలను స్థిరీకరించడంలో ఉత్పన్నమవుతున్న సవాళ్లను కూడా పరిగణలోకి తీసుకొనవలసి ఉంటుందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ ప్రయోజనాలు, సామాన్యుల ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ వ్యాపారాలు, ఎగుమతి దిగుమతులు పరిగణలోకి తీసుకొని వ్యవస్థీకృత చర్యలను పర్యవేక్షించవలసి ఉంటుందన్నారు. కోట్లాదిమంది సామాన్యుల ప్రయోజనాలు పరిరక్షించే విధంగా రిజర్వు బ్యాంకు ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం, నియంత్రించడం జరుగుతుందన్నారు. సామాన్యులకు కూడా ఆర్థిక వ్యవహారాలపైన అవగాహన పెంపొందించడం ద్వారానే లావాదేవీల్లో నల్లడబ్బును నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికీ భారీ కొనుగోళ్లు, పెట్టుబడుల్లో కొంత మేరకు నల్లధనం ప్రభావం ఉందన్నారు. మధ్య తరగతి వర్గాల వారంతా అక్రమంగా సంపాదించే వారు కాదని, చట్ట పరిధిలో పెరిగే భారాలను తప్పించుకోవడానికి తీసుకుంటున్న జాగ్రత్తలుగానే పరిగణించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎన్ఐఆర్‌డి డైరెక్టర్ జనరల్ డబ్ల్యూ. ఆర్. రెడ్డి అధ్యక్షత వహించారు.

## ప్రతి నెలా 15 వరకు రేషన్ పంపిణీ

• పౌర సరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రతి నెల 1నుండి 15వ తేదీ వరకు చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సరకుల పంపిణీ కచ్చితంగా జరిగేలా పౌర సరఫరాల శాఖ కీలక మార్పులు చేపట్టింది. ఇందుకోసం సరుకుల రవాణా తేదీల్లో, క్లోసింగ్ బ్యాలెన్స్, రిలీజ్ ఆర్డర్‌లో కూడా మార్పులు చేసింది. ప్రతి నెల 1వ తేదీ నుండి లబ్దిదారులకు సరుకులు పంపిణీ జరిగేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నామని పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. ఈ - పాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ సరికొత్త విధానం తక్షణం అమలులోకి వస్తుందన్నారు. ప్రతి నెల 16వ తేదీన పౌరసరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుండి జిల్లాలకు సరుకుల కేటాయింపులు జరుపుతామని, ఇందుకోసం 16నుండి 18వ తేదీ వరకు డీలర్లు మీసేవా కేంద్రాల్లో డీడీలు కట్టడానికి తుది గడువు విధించారు. ఈ తేదీల్లో డీడీలు కట్టిన డీలర్లు రిలీజ్ ఆర్డర్లను స్థానిక ఏసీఎస్‌వో, ఎంఆర్‌వోలు సంబంధిత మండల స్థాయి నిల్వ కేంద్రానికి వెంటనే పంపించవలసి ఉంటుంది. రిలీజ్ ఆర్డర్లు అందుకున్న వెంటనే గోదాం ఇన్‌ఛార్జీలు సరుకుల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తారు. దీని ప్రకారం 16 నుండి 30వ తేదీలోపు స్టేజ్ -2 రవాణాదారులు మండల స్థాయి నిల్వ కేంద్రాల నుండి రేషన్ షాపులకు చేరవేస్తారు. స్టేజ్ -1 రవాణా కాంట్రాక్టర్లు పౌరసరఫరాల సంస్థ మండల స్థాయి గోదాములకు ప్రతి నెల 1నుండి 15వ తేదీలోపు సరకులను రవాణా చేస్తారు. ఈ నూతన విధానంపై జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆనంద్ కోరారు.

# దేశానికి దిక్సూచి తెలంగాణ

• మంత్రి జగదీష్‌రెడ్డి



**సూర్యాపేట, ప్రభ న్యూస్ :** అభివృద్ధిలో భారత దేశానికి దిక్సూచి తెలంగాణ రాష్ట్రం అని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరం ప్రారంభమైన మరుక్షణం నుండి రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ దేశం నలుమూలల నుండి అభినందనలు వస్తుంటే అభివృద్ధిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు, అనుబంధ జేఏసీ నాయకులు విషప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. రైతులు అవసరం ఉన్న మేరకే భూగర్భ జలాలను వాడుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల అధికారులు, నాయకులు నిరంతర విద్యుత్‌పై ఆరాతీస్తూ అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సరికాదన్నారు.

రానున్న 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని సవాల్ చేశారు. జిల్లాలో అన్ని స్థానాలను తెరాస పార్టీ గెలిచే విధంగా కార్యాచరణ రూపొందించి ఆచరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తమ్ కుమార్‌వీ ఉత్తర కుమార ప్రగల్భాలే అని ఎద్దేవా చేశారు. ప్రజలు ఊహించిన దానికంటే ముఖ్యమంత్రి కేసీఆర్ వెయ్యి కిలోమీటర్ల వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో బంగారు తెలంగాణ సాధనకు వేగం పెరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వస్తుందని నాయకులు పగటి కలలు కంటున్న వారిని ప్రజలు విశ్వసించరన్నారు. టెర్రరిస్టులు కూడా సిగ్గుపడేలా కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులను అడ్డుకోవడం అభివృద్ధి పథకాలపై విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. చైతన్యవంతమైన తెలంగాణ ప్రజల చరిత్ర తెలుసు అని వర్తమానాన్ని గమనించి భవిష్యత్‌ను నిర్ణయిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ గండూరి ప్రవళిక, తెరాస నాయకులు కట్కూరి గన్నారెడ్డి, బి. లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నోట్ల రద్దే పెద్ద కుంభకోణం


• సీపీఎం జిల్లా మహాసభలో తమ్మినేని వీరభద్రం



**భద్రాచలం టౌన్, ప్రభ న్యూస్ :** దేశంలో నోట్లు రద్దు చేసి పెద్ద కుంభకోణానికి పాల్పడినట్లు, దేశ ఆర్థిక రంగంలో మోడీ ఘోరంగా విఫలమయ్యాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బుధవారం భద్రాచలంలో సీపీఎం జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. పార్టీ సీనియర్ నాయకులు కుంజా బొజ్జి పతాకావిష్కరణ చేసి అమర వీరుల స్తూపానికి నివాళులర్పించారు. మహాసభల ప్రారంభోపన్యాసంలో తమ్మినేని మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక రంగం చిన్నాభిన్నం అయిందని, జీఎస్టీ తీసుకువచ్చి అన్ని వస్తువులకు 18 శాతం పన్ను విధించి మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏర్పాటు తరువాత భావ స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఏర్పడ్డ తెలంగాణ అభివృద్ధి కాకపోగా నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆశపడ్డ యువతకు నిరాశే మిగిలిందన్నారు. జనవరి 25న రాజకీయ ప్రజా సంఘాలతో బహుజన డెమొక్రటిక్ లెఫ్ట్ ఫ్రంట్ రాజకీయ పార్టీ అవతరించబోతున్నట్లు ప్రకటించారు. మహాసభలో సీపీఎం కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, బి.వెంకట్, నాయకులు రాజారామ్, సాయిబాబ, బండారు రవికుమార్, హైమవతి, నున్నా నాగేశ్వరరావు, సున్నం రాజయ్య, ఎం. రేణుక, కుక్కరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.

## మందకృష్ణకు 11 వరకు రిమాండ్

• రెండు వారాల్లో రెండుసార్లు జైలుకు!



కోర్టుకు హాజరవుతున్న మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఉద్యమం చేస్తున్న మంద కృష్ణమాదిగ ఈ రెండు వారాల వ్యవధిలోనే రెండు సార్లు జైలుకు వెళ్లారు. డిసెంబర్ 17న 11 గంటలకు ట్యాంక్‌బండ్ వద్దకు చేపట్టిన ర్యాలీ విషయంలో పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టగా.. వారం రోజుల తర్వాత విడుదలైన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ నాయకులు ప్రధాని మోడి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను వర్గీకరణ విషయంలో ఒప్పించాలని, పార్లమెంట్‌లో అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఉపవాస దీక్షకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. ఈ దీక్షకు అనుమతి లేదని అదే రోజు మంద కృష్ణ మాదిగను అరెస్టు చేసి వివిధ కేసులు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం సికింద్రాబాద్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా.. కృష్ణమాదిగకు బెయిల్ నిరాకరించిన న్యాయస్థానం ఈ నెల 11 వరకు రిమాండ్‌కు విధించింది.

**దొరలకో న్యాయం.. దళితులకో న్యాయమా..?**


అక్రమ కేసులూ.. జైల్లు కేవలం దళితులకేనా..? దొరలకు వర్తించవా? అంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. శాంతియుతంగా ఉపవాస దీక్ష చేస్తున్న తమను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టడం దేనికని ఆయన ప్రశ్నించారు. సికింద్రాబాద్ సివిల్‌కోర్టుకు హాజరైన ఆయన మీడియానుద్దేశించి మాట్లాడారు. మాదిగలపై తెలంగాణ ప్రభుత్వం కక్షపెంచుకున్నదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావుతో పాటు కేటీఆర్‌పైన 307 కేసులు నమోదైనాయని, వారు ఎన్నిసార్లు జైలుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**మంద కృష్ణ అరెస్టు నిరంకుశత్వమే : కోదండరామ్**

మంద కృష్ణమాదిగను పోలీసులు అరెస్టు విషయాన్ని చూస్తుంటే నిరంకుశత్వానికి అద్దంపట్టిన విధంగా ఉందని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ విమర్శించారు. తెలంగాణలో కనీసం నిరసనలకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# క్యాన్సర్ రోగులకు 'నీనారావు ట్రస్టు' చేయూత

• ఎంఎన్‌జేలో ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు





**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఎంఎన్‌జేలో చికిత్స కోసం వచ్చే క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు కష్టాలు తీర్చడానికి ఓ ట్రస్టు ముందుకొచ్చింది. రోగులు, వారి సంబంధీకులు సేద తీరడానికి నీనారావు ఛారిటబుల్ ట్రస్టు అనే సంస్థ భవనాన్ని నిర్మిస్తోంది. సుమారు 500-600 మంది ఇందులో తలదాచుకోవచ్చు. రోజులు తరబడి చికిత్స పొందే వారికి ఇది పూర్తిగా అనుకూలంగా ఉంటుంది. క్యాన్సర్ రోగుల బంధువుల కోసం నీనారావు ట్రస్టు ఎంఎన్‌జే ఆస్పత్రికి 5 అంతస్తుల భవనాన్ని నిర్మించడానికి ముందుకొచ్చింది. వారు మొదటగా రెండు అంతస్తులనే నిర్మిస్తామని ముందుకొచ్చారు. అనంతరం మరో మూడు అంతస్తులను నిర్మించడానికి నిధులు ఇచ్చి పనులను కూడా ప్రారంభించారు.

**వారాల తరబడి చికిత్స**

చాలామంది తెలిసీతెలియక క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ వ్యాధిన బారిన పడుతున్నారు. మగవారిలో ఎక్కువగా నోటి క్యాన్సర్ బారిన పడుతుండగా, మహిళలు గర్భాశయ ముఖ ద్వార తదితర క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. ఎంఎన్‌జే ఆస్పత్రికి రేడియోథెరఫీ, కీమోథెరఫీ చికిత్సల కోసం రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఓపీ విభాగానికి రోజుకు 600 మంది రోగులు వస్తుంటారు. ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు వ్యాధిగ్రస్తులకు నిరంతరాయంగా థెరఫీ చికిత్సను ఇక్కడి సిబ్బంది అందిస్తుంటారు. ప్రస్తుతం 100-150 మందికే ఇక్కడ వసతి సౌకర్యం కల్పించే విధంగా వసతులు ఉన్నాయి.

వీరిని దృష్టిలో పెట్టుకొని 850 గజాల విస్తీర్ణంలో ఈ భవన నిర్మాణం జరుగుతోంది. ఇందులో 500 మంది ఉండడానికి వారికి అవసరమైన సదుపాయాలను కూడా కల్పిస్తున్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ భవనం రోగులకు అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ఈ భవనానికి నీనారావు ఛారిటబుల్ ట్రస్టు నిధులను కేటాయిస్తోంది. ఈ భవన నిర్మాణాన్ని ట్రస్టు సభ్యులే పర్య వేక్షిస్తున్నారు.

**ట్రస్టు వ్యవస్థాపకుడు అమెరికాలో వైద్యనిపుణులు**

నీనారావు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పి. గోవింద సి.రావు అమెరికాలో పిల్లల వైద్యనిపుణులు. ఈయన హైదరాబాద్ నివాసి. ఆయన గతంలో నిలోఫర్ దవాఖానలో 14 పడకల అత్యవసర చికిత్స విభాగాన్ని, గ్రంథాలయాన్ని, సమావేశ గదిని నిర్మించి ఇచ్చారు. అలాగే ఉస్మానియా ఆస్పత్రిలో వార్డులకు మరమ్మతులు, సమావేశ గదిని ఆధునీకకరించడానికి నిధులు కేటాయించారు. మూడు అంతస్తుల్లోనూ నివాస గదులను రోగులకు ఉచితంగా అందిస్తారు. 4-5 అంతస్తుల్లోని మాత్రం కొంతమేర ఛార్జీలను వసూలు చేయాలని ట్రస్టు నిర్ణయించింది.

**వైద్యులు, సిబ్బంది కొరత**


ఈ ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది కొరత కూడా ప్రస్తుతం వేధిస్తోంది. కొత్త భవనం కూడా త్వరలో అందుబాటులోకి రానుండడంతో ప్రత్యేక శస్త్రచికిత్స థియేటర్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. 251 పోస్టులకు భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా ఆ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ ఇంకా విడుదల కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఎన్‌సీడీ వ్యాధుల నిర్ధారణలో భాగంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా స్క్రీనింగ్ టెస్టుల నిమిత్తం వస్తుండడంతో ఈ ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోతోంది.

**4 స్టేజీల్లో వైద్యం**

రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు 4 స్టేజీల్లో ఇక్కడ వైద్యం అందిస్తారు. మొదటి స్టేజీ ఆపరేషన్ ద్వారా, రెండోది రేడియా థెరఫీ, మూడు, నాలుగు స్టేజీల్లో అడ్వాన్సుడ్ చికిత్సను ఇక్కడ అందిస్తారు. ఈ వైద్యం మొత్తం పూర్తిగా ఉచితం. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై మహిళలపై పూర్తిగా అవగాహన లేనందునే ఈ వ్యాధి బారిన పడుతున్నట్టు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తొలిదశలోనే ఈ వ్యాధిని గుర్తించడం ద్వారా దానిని పూర్తిగా నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందిపై అదనపు భారం పడుతుందని వెంటనే సిబ్బంది, వైద్యుల ఖాళీలను పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### త్వరలో నియామకాలు

భవనం పూర్తయ్యేలోపు నియామకాలు పూర్తి చేస్తాం. నీనారావు ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వారి అమ్మ, సిస్టర్‌కు ఎంఎన్‌జే ఆస్పత్రిలోనే వైద్యం అందించాం. దీంతో ట్రస్టు వాళ్లు రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తామని తొలుత తెలిపారు. రెండతస్థులు తొందరగా నిర్మాణం జరుగుతుండడంతో మరో మూడు అంతస్థులు నిర్మించడానికి ట్రస్టు వారే ముందుకొచ్చారు. మొత్తం 5 అంతస్థులకు 2 కోట్ల రూపాయలకు పైగా వారు ఖర్చు చేస్తున్నారు. రేడియేషన్ ట్రీట్‌మెంట్ కోసం వచ్చే రోగులు, వారి బంధువులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్మాణాన్ని జరుపుతున్నాం. త్వరలో రోగులకు తగ్గట్టుగా సిబ్బందిని నియమించుకుంటాం. దీనికోసం ప్రభుత్వానికి లేఖ రాశాం.



**- ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత**

## సంక్రాంతికి 84 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సంక్రాంతి పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు 84 ప్రత్యేక రైళ్లను నడిపించబోతుంది. తిరుపతి-విశాఖపట్టణం-తిరుపతి మధ్య 16, కాచిగూడ - విశాఖ మధ్యన 4, విశాఖపట్టణం - తిరుపతి మధ్య 4, విజయవాడ, కాజీపేట మీదుగా తిరుపతి - కాచిగూడ మధ్య 4, హైదరాబాద్ - విశాఖపట్టణం హైదరాబాద్ మధ్య 4, సికింద్రాబాద్-దర్భాంగ్ మధ్య 34, హైదరాబాద్-రెక్సాల్-హైదరాబాద్ మధ్య 18 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైళ్లు వివిధ కేంద్రాల నుండి ఈ నెల 7న ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి నెలలో కూడా ప్రత్యేక రైళ్లు నడిపించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక రైళ్లు మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషనల్లో నిలుపుదల చేయడం జరుగుతుందని, స్పెషల్ ట్రైన్‌లలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తారని తెలిపారు.

## బంగారు తెలంగాణ కోసమే ప్రేయర్స్ డే: రాజేశ్వరరావు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యం నెరవేరాలని, భారత దేశం స్వచ్ఛ భారత్‌గా మార్చాలన్న కేంద్రం ప్రయత్నాలు సఫలమయ్యేందుకు 5న పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రేయర్ డేను నిర్వహిస్తున్నట్లు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ డి రాజేశ్వరరావు చెప్పారు. ఈ మహాప్రార్థనా దినోత్సవానికి ప్రపంచ అధ్యాత్మిక వేత్త డాక్టర్ బిల్లీ గ్రహం కూతురు అనీ గ్రహం లోజ్ హాజరు కావడం విశేషమన్నారు. బుధవారం ఇక్కడ జీహెచ్ఎంసీ కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ విద్యాస్రవంతి, క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ బిషప్ ఎంఎ డేనియల్, కోచైర్మన్ బిషప్ జాన్ గొల్లపల్లి, ప్రధా న కార్యదర్శి రెవరెండ్ వై మోహన్ బాబు, కోశాధికారి రెవరెండ్ కేఎం జాన్, తదితరులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 5వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రేయర్ డేకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటి, పురపాలక శాఖమంత్రి కె తారకరామారావు హాజరవుతున్నారని, ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు సహకారం ఉందని రాజేశ్వరరావు చెప్పారు.

# ప్రాంతీయ భాషల్లో ఐటీ అభివృద్ధి

• హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రోత్సాహకాలు • 'ఇండియా మైక్రో ప్రాసెసర్' కోసం పరిశోధనలు • లోక్‌సభలో ఎంపీ వినోద్‌కు మంత్రి జవాబు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని సామాన్యుల వరకు తీసుకెళ్లేందుకు భారతీయ భాషల్లో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసి ఉచితంగా అందరికీ అందుబాటులో ఉంచామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీ వినోద్ కుమార్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఐటీ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చేపట్టిన చర్యల గురించి కేంద్రం వివరించింది. ఆంగ్ల పరిజ్ఞానం ఉన్నవారికి మాత్రమే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఇకపై భారతీయులెవరైనా సరే సులభంగా వినియోగించుకునేలా సాఫ్ట్‌వేర్‌తో పాటు అనుబంధంగా టూల్స్, యుటిలిటీస్, ఫాంట్స్ సహా ప్రమాణాలను సైతం రూపొందించినట్టు వివరించింది.

మొత్తం 22 భాషల్లో ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్లు ఓపెన్ ఆఫీస్, లిబర్ ఆఫీస్, ఫైర్‌ఫాక్స్ వెబ్ బ్రౌజర్, థండర్‌బర్డ్ ఈ మెయిల్ క్లైంట్ ఉచితంగా ఉపయోగించుకునేలా అందరికీ అందుబాటులో ఉంచామని కేంద్రం తెలిపింది. మరోవైపు దేశంలో ఐటీ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు డిజిటల్ ఇండియా పేరుతో అనేక కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించింది. ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తున్నామని, అలాగే ఐటీ అనుబంధ రంగాలైన బీపీవో, ఐటీ ఆధారిత పరిశ్రమలను రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించి తద్వారా ఉపాధి, ఉద్యోగ కల్పనపైనా దృష్టి సారించామని వివరించింది. ప్రధానమంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షర్ అభియాన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు బీపీఓ, ఐటీ రంగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తున్నామని, తద్వారా ఆయా రంగాలకు అవసరమైన నిపుణులను అందిస్తున్నామని కేంద్రం జవాబులో పేర్కొంది. ఐటీ రంగంలో భారతదేశానికి గట్టి పోటీనిస్తూ సవాల్ విసురుతున్న దేశాల గురించి అడిగిన మరో ప్రశ్నకు బదులిస్తూ, ప్రస్తుతం చైనా, ఫిలిప్పీన్స్, మలేషియా, దక్షిణ ఆఫ్రికా, తూర్పు యూరప్ దేశాలు సహా మరికొన్ని దేశాలు ఈ జాబితాలో ఉన్నాయని వెల్లడించింది. తద్వారా హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీలో గుత్తాధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న చైనా నుంచి సాఫ్ట్‌వేర్ విషయంలోనూ పోటీ ఎదురవుతోందని స్పష్టం చేసింది. ఈ ప్రశ్నకు అనుబంధంగా అడిగి మరో ప్రశ్నకు జవాబిస్తూ దేశీయంగా ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ రంగంలో పెట్టుబడులు ఆకర్షించడం కోసం అనేక ప్రోత్సహకాలు, రాయితీలు ఇస్తున్నామని వెల్లడించింది. 'ఫేజ్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రోగ్రాం', 'మోడిఫైడ్ స్పెషల్ ఇన్సెంటివ్ ప్యాకేజీ స్కీం', 'ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్' వంటి పథకాల ద్వారా ఈ ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని తెలిపింది. అలాగే నానో, మైక్రో ఎలక్ట్రానిక్స్ అభివృద్ధితో పాటు 'చిప్ టూ సిస్టం', 'ఇండియా మైక్రోప్రాసెసర్' తయారీ కోసం పరిశోధనలు ప్రోత్సహిస్తున్నామని కూడా కేంద్రం ప్రభుత్వం పేర్కొంది.

## ఇక జనపనార సంచుల్లోనే ప్యాకింగ్

• కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** చక్కెర, ఆహార ధాన్యాలను జనపనార సంచుల్లోనే తప్పనిసరిగా ప్యాక్ చేయాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. 2017-18 సంవత్సరాన్ని జనపనార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్రమంత్రి వర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. చక్కెర, ఆహార ధాన్యాలను జనపనార సంచుల్లోనే తప్పనిసరిగా ప్యాక్ చేయాలని నిర్ణయంతో ఆ రంగానికి ప్రోత్సహం లభిస్తుందని, ఉపాధి అవకాశాలకు పెరుగుతాయని కేంద్రం అంచనా వేసింది. జులై 2017 నుంచి జూన్ 2018 వరకు కేంద్రం జనపనార సంవత్సరంగా పాటిస్తోంది. తాజా నిర్ణయంతో 90శాతం ఆహార ధాన్యాలన్నీ జనపనార సంచుల్లోనే ప్యాక్ చేయాల్సి ఉంది. అలాగే 20 శాతం చక్కెరను జుట్ బ్యాగుల్లోనే నింపాలి. ఆంధ్రప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలు, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్ రైతులకు దీని వల్ల లబ్ది చేకూరనుంది. ప్రభుత్వ సంస్థలే రూ. 5500 కోట్ల రూపాయల విలువైన జనపనార ఉత్పత్తులను అత్యధికంగా వీటిని కొనుగోలు చేస్తుంటాయి. దీంతో 40లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతుంది.





## డేటా సరాసరి వినియోగం 1.6 జీబీ

**న్యూఢిల్లీ :** టెలికం రంగంలో 4జీ ప్రవేశించడంతో డేటా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. గతేడాది సెప్టెంబర్‌లో వినియోగదారుడులు సరాసరి 1.6 జీబీ డేటా వినియోగించారు. ఇదే మూడు సంవత్సరాల క్రితం చూస్తే కేవలం 70 ఎంబీ మాత్రమే ఉండేది. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా మొబైల్ సబ్‌స్క్రైబర్లు విపరీతంగా పెరిగిపోయారని ఐటి టెలికం మంత్రి రవిశంకర్‌ప్రసాద్ లోకసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. డిజిటల్ చెల్లింపులతో పాటు ఎలక్ట్రానిక్ డెలివరీ సేవలు గణనీయంగా పెరిగాయని ప్రసాద్ తెలిపారు. ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రతి సరాసరి ప్రతి సబ్‌స్క్రైబర్ జూన్ 2014లో 70.10 ఎంబీ డేటా వినియోగిస్తే.. సెప్టెంబర్ 2017 నాటికి 1600 ఎంబీ వినియోగించారని తెలిపింది. ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల విషయానికి వస్తే జూన్ 2014లో 259.14 మిలియన్‌ల నుంచి సెప్టెంబర్2017 నాటికి 429.23 మిలియన్‌లకు చేరారని రవిశంకర్ ప్రసాద్ వివరించారు.



## పీఎస్‌యూ బ్యాంకులకు రూ. 7,577 కోట్ల మూలధనం



**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగానికి చెందిన ఆరు బలహీనమైన బ్యాంకులకు రూ.7,577 కోట్ల మూలధనం సమకూర్చడానికి ఆర్థికమంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. క్యాపిటల్ అడిక్వషియో రేషియో తగ్గడంతో ఈ బ్యాంకులకు మూలధనం సమకూర్చడం జరుగుతోంది. కేంద్రప్రభుత్వం ఇంద్రధనుస్సు పథకం కింది మార్చి 2019 నాటికి రూ.70వేల కోట్ల మూలధనం సమకూరుస్తామని ప్రకటించింది. ఈ పథకంలో భాగానే ప్రభుత్వం ఈ బ్యాంకులకు మూలధనం సమకూరుస్తోంది. దీనికి బదులుగా బ్యాంకులు ప్రభుత్వానికి ప్రిఫెరెన్షియల్ షేర్లను జారీ చేస్తాయి. వాటిలో బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంకు, యూకోబ్యాంకులున్నాయి. అయితే ఈ తంతు పూర్తి కావడానికి ముందు నియంత్రణా సంస్థలతో పాటు వాటాదారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. కోలకతా ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న యూకోబ్యాంకు బోర్డు బుధవారంనాడు ప్రభుత్వానికి ప్రిఫెరెన్షియల్ షేర్లను బదలీ చేసి రూ.1375 కోట్లు సేకరిస్తుంది. సెంట్రల్ బ్యాంకు 3.88 కోట్ల ప్రిఫెరెన్షియల్ షేర్ల బదలీ చేసి రూ.323 కోట్లు సేకరిస్తుంది. అలాగే బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.2,257 కోట్లు, ఐడీబీఐ బ్యాంకుకు రూ.2729 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రకు రూ.650 కోట్లు, దేనా బ్యాంకుకు రూ.243 కోట్ల వరకు మూలధనం సమకూర్చుకుంటాయి. ఇదిలా ఉండగా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులను బలోపేతం చేయడానికి రూ.2.11 లక్షల కోట్ల మూలధనం సమకూరుస్తామని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. పీఎస్‌యు బ్యాంకుల్లో పెరిగిపోతున్న మొండిబకాయిలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ బ్యాంకులకు మూలధనం సమకూర్చాలని నిర్ణయించింది.

## హెటిరో నుంచి అడాలిముమాబ్

Hetero pharmacy

**హైదరాబాద్ :** జెనెరిక్ ఫార్మాస్యూటికల్ కంపెనీ హెటిరో నాలుగవ బయోసిమిల్ ఔషధం అడాలిముమాబ్‌ను మాబురా బ్రాండ్ పేరుతో భారత్ మార్కెట్లో విక్రయిస్తుంది. మబురా అనేది మానవకణితిని నిర్జీవంగా మార్చేందుకు ఉపయోగించే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ జీవ ఔషధం (టీఎన్‌ఎఫ్) మబురాను రుమటాయిడ్ అర్థరైటీస్ మరియు ఆటో ఇమ్యూన్ వ్యాధులైనటువంటి సోరియాటిక్ అర్థరైటిస్, యాంకిలోజింగ్ స్పాండిలైటిస్, కోన్స్‌డీసీజ్, అల్సరేటివ్ కోలైటీస్ మొదలైనవారి చికిత్సకు ఉపయోగిస్తారు. 40 ఎంజీతో ముందుగా నింపిన సిరింజి (పీఎఫ్ఎస్)రూపంలో మబురాను చర్మం ద్వారా లోనికి పంపుతారు. ఈ ఔషధం హైదరాబాద్‌లోని అత్యాధునిక బయోలాజిక్స్ యూనిట్‌లో తయారు చేస్తారు.

# ఐటీ ఉద్యోగాలు గాల్లో దీపం!

### హెచ్-1బీ వీసా కఠిన నిబంధనలతో...






**న్యూఢిల్లీ:** గతేడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత్ ఐటి రంగంలో ప్రకంపనలు మొదలయ్యాయి. హెచ్-1బీ వీసాలపై ఉక్కుపాదం మోపుతారని అందరూ ఊహించినట్లుగానే అన్నంత పని అయ్యింది. తాజాగా ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై కాకుండా (హెచ్1బీ వీసాలపై అమెరికాలో మూడు సంవత్సరాల పాటు ఉండొచ్చు.) అటు తర్వాత మరో మూడేళ్ల పాటు వీసాలను పొడిగిస్తుంటారు. ఈ మధ్యలో ఉద్యోగి నైపుణ్యాన్ని బట్టి కంపెనీ గ్రీన్‌కార్డు ప్రాసెస్‌కు సిఫారసు చేస్తుంది. ఇక ఆ గ్రీన్‌కార్డు అనేది ఎప్పుడు వస్తుందో ఆ దేవుడికి తెలియాలి. ఎందుకంటే దానికి చాంతాడంత వెయిటింగ్ లిస్టు ఉంది. ఒకప్పుడు గ్రీన్‌కార్డు మూడు నుంచి నాలుగు సంవత్సరాల్లో వచ్చేది. ఐటి రంగం ఎప్పుడైతే జోరందుకుందో అప్పటి నుంచి భారత్‌కు చెందిన ఐటి కంపెనీలు భారత్ నుంచి తమ ఉద్యోగులను క్లయింట్ లోకేషన్‌కు పంపుతుంటాయి. అలా వెళ్లిన వారు ప్రస్తుతం కొన్ని లక్షల్లో ఉన్నారు. ఒకసారి హెచ్1బీ వీసా లబ్ధి దారుని గ్రీన్‌కార్డు ప్రాసెస్ అయితే వారిని దేశంలోనే పనిచేయడానికి అనుమతిస్తుంటారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం మాత్రం ఇలా గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌లో ఉన్న వారిని కూడా తిప్పి పంపాలనే ఆలోచనలో ఉంది.

(ఇక్కడో చిన్న ఉదాహరణకు కూడా చెప్పాలి.. అమెరికా పౌరసత్వం లభించిన వ్యక్తి ..వెంటనే తన కుటుంబసభ్యులు తల్లి, లేదా త్రండి, సోదరుడు, సోదరి ఇలా అందరికి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తుంటారు. దీని వల్ల గ్రీన్‌కార్డు వెయిటింగ్ లిస్టు పెరిగి ప్రాసెసింగ్ ఆలస్యం అవుతుందని మన భారతీయులే చెబుతుంటారు.)

తాజాగా ట్రంప్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చి హెచ్-1బీ వీసాల పొడిగింపు ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన నాస్కామ్ కూడా చెబుతోంది.

ఒక వేళ అమెరికా ప్రభుత్వం వీసాల పొడిగింపును నిలిపివేస్తే సుమారు ఒక మిలియన్ .. పది లక్షల మంది హెచ్1బీ వీసా లబ్దిదారులు మాతృదేశానికి తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. వారిలో చాలా మంది గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. ట్రంప్ నిర్ణయం కేవలం ఐటి పరిశ్రమే కాకుండా హెచ్1బీ వీసా వినియోగించుకునే భారతీయులందరికి ఇబ్బందే. అమెరికా ప్రభుత్వ నిర్ణయంతో అమెరికాలో కూడా స్టాప్‌వేర్ నిపుణుల కొరత ఏర్పడుతుంది. ఇది అమెరికాతో పాటు భారత్‌కు కూడా నష్టమేనని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ చెప్పారు.

తాజాగా యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ హెచ్1బీ వీసాలతో పొడిగింపుతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రీన్‌కార్డులను అనుమతులు నిరాకరించాలనే ఆలోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలపై ఆయనపై విధంగా స్పందించారు.

ఇదే కనుగ పక్కాగా అమలైతే.. అమెరికాలో పనిచేస్తున్న హెచ్1బీపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులతో పాటు గ్రీన్‌కార్డు దరఖాస్తులు ప్రాసెసింగ్‌లో ఉన్నా వారికి కష్టకాలం ముంచుకొచ్చినట్లేనని ఆయన అన్నారు.

డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో బై అమెరికన్, హైర్ అమెరికన్ (అమెరికా వస్తువులనే కొనుగోలు చేయండి.. అమెరికన్లనే ఉద్యోగాల్లో పెట్టుకోండి) అనే నినాదంతో ఎన్నికల్లో గెలిచారు. విదేశీయులు స్థానికుల ఉద్యోగాలను కబళిస్తున్నారని అమెరికన్ల ఆవేదన. అయితే గత ఏడాది నుంచి ఈ దిశగా అమెరికా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం తీసుకొనే చర్యల వల్ల ప్రతి భారతీయుడిపై ఎంతో కొంత ప్రభావం ఉంటుందని చంద్రశేఖర్ చెప్పారు.

భారీగా తగ్గిన వీసాల వినియోగం: అమెరికా ప్రతి ఏడాది భారత్‌కు 85వేల హెచ్1బీ వీసాలు మంజూరు చేసేవి.. భారతీయ ఐటి కంపెనీలు వీటిని ఇప్పటి వరకు చక్కగా వినియోగించుకున్నాయి. గత రెండేళ్ల నుంచి కొత్త నిబంధనలు తీసుకురావడంతో ఐటి కంపెనీలు కూడా స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చి వీసాలకు తగ్గించుకుంటున్నాయి. ప్రస్తుతం 10వేల కంటే కిందికి ఈ వీసాలు దిగివచ్చాయి. ప్రస్తుతం ఈ వీసాలు కూడా ఖరీదైన వ్యవహారంగా మారిపోవడంతో కంపెనీల లాభాల మార్జిన్‌పై ప్రభావం చూపుతోంది. వీసా రుసుము భారీగా పెంచేశారు. ఇదిలా ఉండగా ఒకవేళ ట్రంప్ అనుకున్నంత పనిచేస్తే.. దాని ప్రభావం భారత జీడీపీతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద దెబ్బే అని చంద్రశేఖర్ అన్నారు.

దీంతో పాటు భారతీయ ఐటి కంపెనీలకు మరో ఎదురుదెబ్బ తగలడానికి సిద్ధంగా ఉంది. అది ప్రొటెక్ట్ అండ్ గ్రో అమెరికన్ జాబ్స్ (హెచ్ఆర్170) దీని ద్వారా కొన్ని హెచ్1బీ వీసాలు దుర్వినియోగం కాకుండా కొన్ని ప్రతిపాదనలు చేస్తోంది. వీసాలపై ఆధారపడిన కంపెనీలపై మరిన్ని కఠిన నిబంధనలు అమలు చేయబోతోంది. వీసాలు దుర్వినియోగం కాకుండా నిబంధనల విషయానికి వస్తే కనీస వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. వీసాలపై ఆధారపడిన కంపెనీలు హెచ్1బీ వీసాల దారుడి వేతనాన్ని ప్రస్తుతం 60,000 డాలర్లనుంచి 90,000 డాలర్లకు పెంచాలనేది కొత్తగా ప్రతిపాదించనున్న బిల్లులో చేర్చనుంది. దీంతో పాటు క్లయింట్ ఆ ఉద్యోగిని 5-6 సంవత్సరాల పాటు కొనసాగించాలని పక్కా నిబంధన తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ బిల్లు హౌజ్ జ్యూడిషిరీ కమిటి ముందుఆమోదం పొందింది. అటు నుంచి అమెరికా సెనెట్‌లో ఆమోదం పొందాల్సిఉంటుంది. నాస్కామ్ అంచనా ప్రకారం ప్రస్తుతం ప్రతిపాదించే చట్టంలో నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయని, దీని బట్టి చూస్తే వీసాలు లభించడం చాలా కష్టమని, దీంతో పాటు ఈ వర్క్ పర్మిట్లని ఎలా వినియోగిస్తారో అర్థం కావడం లేదన్నారు.

### సంక్షోభంలో ఐదు లక్షల ఉద్యోగాలు

ఆనంద్ మహీంద్రా : ట్రంప్ ప్రభుత్వం వీసాల నిబంధనల్లో మార్పులు చేస్తే సుమారు ఐదు లక్షల నైపుణ్యం కలిగిన ఉద్యోగుల జీవితాలు గాల్లో దీపంలా తయారవుతాయని మహీంద్రాగ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా ట్విట్టర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక వేళ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలను పొడిగించకపోతే (శాశ్వతంగా పౌరసత్వం) కోసం దరఖాస్తు చేసుకున్న వారు (గ్రీన్‌కార్డు) దరఖాస్తు దారుడు మాతృదేశానికి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇదే కనుక వాస్తవ రూపం దాల్చితే.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు తాను స్వాగతం పలుకుతానని, ప్రస్తుతం భారత్ కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని.. మీరు కూడా ఒక చేయి వేసి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

## వృద్ధిరేటు 7 శాతం దిగువకే!

● ఆర్థిక నిపుణుల అంచనా




**న్యూఢిల్లీ :** పెద్దనోట్ల రద్దు, జీఎస్టిప్రభావం వల్ల ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతం లోపే నమోదువుతుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.1 శాతంగా నమోదుకాగా.. 2015-16లో 8 శాతంగా నమోద య్యింది. ఇదిలా ఉండగా కేంద్ర గణాంకాల కార్యాలయం 2017-18 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఆదాయం గణాంకాలను శుక్రవారం నాడు విడుదల చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతం దాటడం కష్టమేనని, అయితే మూడవ త్రైమాసికంలో కాస్తా ఫర్వాలేదని ఎస్‌బీఐ పరిశోధన ఆర్థికవేత్త సౌమ్యకాంతి ఘోష్ చెప్పారు. తన అంచనా ప్రకారం గతేడాది మాదిరిగానే జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చునని అన్నారు. దీనికి ఆయన వివరణ ఇస్తూ.. గతేడాది విస్తరణను డౌన్‌గ్రేడ్‌గా సవరించి ఉంటే వృద్ధిరేటు ఎక్కువగా ఉండేదన్నారు. మాజీ ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా కూడా ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.2 నుంచి 6.3 శాతం మధ్యలో ఉంటుందన్నారు. యాక్సిస్ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త సుగాతా భట్టాచార్య కూడా గ్రాస్ వాల్యూయాడెడ్ (జీవీఏ) ఈ ఆర్థికసంవత్సరం 6.6 శాతం నుంచి 6.8 శాతం మధ్యలో ఉంటుందన్నారు. పన్ను వసూళ్లను పరిగణనలోకి తీసుకోలేదని.. ఒక వేళ పన్ను వసూళ్లు జోరందుకుంటే దాంతో పాటు జీడీపీ వృద్ధిరేటు కూడా అధికంగా ఉంటుందని ఆయన అన్నారు. కేంద్ర గణాంకాల కార్యాలయం ఆర్థిక వ్యవస్థ కొలమానానికి కొత్తగా జీవీఏ పద్ధతిని తీసుకువచ్చింది. అయితే కొత్త జీవీఏ పద్ధతిలో సబ్సిడీలను తీసేసిన తర్వాత మాత్రమే అసలు జీడీపీని లెక్క తెలుస్తున్నారు. మాజీ ప్లానింగ్ కమిషన్ సభ్యుడు, సీనియర్ ఆర్థికవేత్త అభిజిత్ సేన్ మాట్లాడుతూ ఈ ఆర్థికసంవత్సరం జీడీపీవృద్ధిరేటు 6శాతం నుంచి 6.5 శాతం మధ్యలో ఉంటుందన్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత పన్ను వసూళ్లు బాగా తగ్గాయని ఆయన కారణాలు చెబుతున్నారు. తాజా పీఎంఐ గణాంకాలతో పాటు ఇతర గణాంకాలను చూపించి ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే అందకు భిన్నంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## కియా మోటార్స్ ఇండియా ఎండీగా కుక్యూన్ షిమ్

**హైదరాబాద్ :** కియా మోటార్స్ ఇండియా (కెఎంఐ) కుక్యూన్‌సిమ్‌ను భారత్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా నియమించింది. ఆయన భారత్ మార్కెట్లో కియోమోటార్స్ మొదటి తయారీప్లాంట్ నిర్మాణం బాధ్యతలు చేపడతారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో కియా మోటార్స్ 1.1 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతోంది. కాగా ఆయనకు ఆటో రంగంలో సుమారు 30 సంవత్సరాల అనుభవం ఉంది.

# రహస్యంగా ఎన్నికల బాండ్ల ముద్రణ


● బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ● పారదర్శకత కోసం కేంద్రం చర్యలు

● ఎస్‌బీఐలో మాత్రమే బాండ్ల విక్రయం నుంచి మాత్రమే కొనుగోళ్లు

**న్యూఢిల్లీ :** రాజకీయపార్టీలకు కంపెనీలు విరాళాలు ఇవ్వడం తరచూ జరిగే తంతే! సాధారణంగా రాజకీయపార్టీలకు కంపెనీలు నల్లధనం ఇస్తుంటాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి పెట్టడానికి ప్రభుత్వం సమాయత్తం అయ్యింది. ప్రభుత్వం కొత్తగా ఎన్నికల బాండ్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. రాజకీయపార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకునే వారు ఈ బాండ్లను ఇస్తే సరిపోతుంది.

అయితే ఈ ఎన్నికల బాండ్ల ముద్రణను ప్రభుత్వం కరెన్సీ నోట్ల ముద్రణ మాదిరగా రహస్యంగా ఉంచుతోంది. మార్కెట్లో నకిలీ బాండ్లు రాకుండా చూడ్డమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ బాండ్ల కాలపరిమితి కేవలం 15 రోజులు మాత్రమే ఉంటుంది. కొత్తగా రాత్రికి రాత్రి పుట్టుకొచ్చిన పార్టీలకు ఈ బాండ్లను విరాళంగా ఇవ్వడానికి వీల్లేదు. ఎందుకంటే ఆ పార్టీలు ఈ బాండ్లను సొమ్ము చేసుకొని మనీలాండరింగ్‌కు పాల్పడతారనే ఉద్దేశంతో కొత్త పార్టీలకు బాండ్ల విరాళాన్ని నిషేధిస్తున్నట్లు ఆర్థికమంత్రిత్వశాఖ వర్గాలు తెలియజేశాయి. ఎస్‌బీఐ ద్వారానే బాండ్ల అమ్మకాలు : ఈ బాండ్ల అమ్మకాల విషయానికి వస్తే కేవలం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన ఎంపిక చేసిన బ్రాంచీల్లోనే విక్రయిస్తారు. ఇవి కూడా ప్రధానంగా పెద్ద నగరాలకు చెందిన బ్రాంచీల్లోనే విక్రయిస్తారని ఆ వర్గాలు తెలియజేశాయి. ఎన్నికల్లో నల్లధనం రాకుండా నిరోధించడానికి కొత్తగా ఎన్నికల బాండ్లను తీసుకొస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం నాడు వివరాలు అందించారు. రాజకీయ పార్టీలకు నగదుకు బదులు బాండ్లను ఇవ్వాలనేది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. అయితే ఇక్కడ ఎవరైతే రాజకీయ పార్టీలకు బాండ్లు విరాళాలుగా ఇస్తారో వారి పేర్లు గోప్యంగా ఉంచుతారు. అలాగే ఈ బాండ్లను ఏ రాజకీయపార్టీకి విరాళంగా ఇచ్చారో ఆ పార్టీ ఖాతాలోనే జమ అవుతాయి. ఈ బాండ్ల ముద్రణను అతి గోప్యంగా ఉంచుతున్నారు. ముద్రించేసమయంలో సమాచారం బయటికి పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కరెన్సీ ముద్రణకు ఎలాంటి నియమనిబంధనలు పాటిస్తున్నారో అలాంటి నిబంధనలనే ఈ బాండ్లకు పాటిస్తున్నారు. ఈ బాండ్లను కేవలం ఎస్‌బీఐ ద్వారా జనవరిలో, ఏప్రిల్, జులై, అక్టోబర్‌లలో కేవలం 10 రోజులు మాత్రమే విక్రయిస్తారు. అది కూడా ఎస్‌బీఐకి చెందిన 8-10 బ్రాంచీల్లో మాత్రమే అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం రాజకీయపార్టీలకు వచ్చే విరాళాలు పారదర్శకంగా ఉండాలనేది.. కాగా గత బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మదిలో నుంచి వచ్చింది ఈ ఎన్నికల బాండ్‌ల ఐడియా. ఈ బాండ్ల కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చే వ్యక్తి పేరు రహస్యంగా ఉంచుతారు. అయితే బాండ్ల కొనుగోలుకు మాత్రం కెవైసీ నిబంధనలు అమలవుతాయి. రాజకీయపార్టీల విరాళాలు ఇవ్వాలనుకునే వారు ప్రతిపక్షపార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకుంటే ఎలాంటి భయాందోళనలు లేకుండా ఇవ్వవచ్చు. ఒక వేళ విరాళం ఇచ్చే వ్యక్తిని రహస్యంగా ఉంచకపోతే పెద్దెత్తున నగదు విరాళాలను ప్రోత్సహించినట్లవుతుందని, రాజకీయ వ్యవస్థలో అన్నీ పారదర్శకంగా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలుతెలియజేశాయి.

ఇక ఎన్నికల బాండ్ల విషయానికి వస్తే ఇవి కేవలం రిజిష్టర్డ్ రాజకీయ పార్టీలకు మాత్రమే ఇవ్వడానికి అనుమతిస్తారు. అలాగే చివరి ఎన్నికల్లో ఒక శాతం ఓట్లు సాధిస్తేనే విరాళాలకు అర్హత సాధించినట్లవుతుంది. దీంతో పాటు రాజకీయపార్టీ ఎన్నికల కమిషన్ వద్ద ఒక బ్యాంకు ఖాతా నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. విరాళంగా వచ్చిన బాండ్లను 15 రోజుల్లోగా నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం కొత్త రాజకీయ పార్టీలు బాండ్లను నగదుమార్చుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే ఈ బాండ్లను నగదుమార్చుకొని మనీలాండరింగ్‌కు పాల్పడే అవకాశాలున్నందు వల్ల కొత్త పార్టీలకు బాండ్ల విరాళాన్ని నిషేధించినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ అధికారులు వివరించాయి.



# మార్కెట్ జోరు తగ్గింది

### అందరి దృష్టి క్యూ3 ఫలితాలపైనే




**ముంబై :** స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు స్వల్పనష్టాలతో ముగిశాయి. కార్పొరేట్ ఫలితాల సీజన్ ఈ వారంలోనే మొదలుకాబోతుండటంతో మదుపరులు వేచి చూసే దోరణిలో ఉన్నారు. ఆటో, ఐటి, చమురు సహజవాయువు, టెక్, హెల్త్‌కేర్ రంగానికి చెందిన షేర్లపై లాభాలను ఆర్జించడంతో సూచి నష్టపోయింది. సెన్సెక్స్ 33,929.61 పాయింట్ల వద్ద మొదలై అటు తర్వాత 33,998.37 పాయింట్లకు ఎగబాకి 33,765.43 వద్ద స్థిరపడింది. అయితే చివరి గంటలో మదుపరులు పెద్దమొత్తంలో షేర్లు కొనుగోలు చేయడంతో సూచి కాస్తా కోలుకొని చివరకు 18.88 పాయింట్లు నష్టపోయి 33,998.73 వద్ద ముగిసింది.

గత రెండు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 244.57 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే కేవలం 1 పాయింట్ లాభపడి 10,443.20 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,503.60 నుంచి 10,429.55 వద్ద ఊగిసలాడింది. మార్కెట్లు ఉదయం లాభాలతోనే మొదలైనా.. తర్వాత మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలు లేకపోవడంతో సూచి కిందికి దిగి వచ్చింది. ముడి చమురు ధరలు పెరిగిపోవడంతో దాని ప్రభావం మార్కెట్లపై కనిపించింది. లోహ రంగానికి చెందిన కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాతో షేర్లు పుంజుకున్నాయి. ఆటో రంగానికి చెందిన షేర్లపై మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఇటీవల కాలంలో ఆటో షేర్లు జోరందుకున్నాయి. మదుపరులు క్యూ3 ఫలితాలపై ఎదురుచూస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మంగళవారం నాడు రూ.522.74 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.64.70 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయింది మాత్రం డాక్టర్ రెడ్డీస్ 2.97 శాతం వరకు క్షీణించింది. నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే విప్రో, ఒఎన్‌జీసీ, బజాజ్‌ఆటో, మారుతి సుజుకి, టాటామోటార్స్, హచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లు 2.73 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా లాభాలను ఆర్జించిన షేర్లు ఇలా ఉన్నాయి. అదానీ పోర్ట్స్ 2.78 శాతం, ఎల్ అండ్‌టి, ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్ బ్యాంకు, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటాస్టీల్ షేర్లు 2.75 శాతం లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీ 0.54 శాతం పుంజుకుంది. జామ్‌నగర్‌లో అతి పెద్ద రిఫైనరీ ఆఫ్ గ్రాస్ క్రాకర్‌ను ఏర్పాటు చేయడమే కారణం. హీరోమోటో కార్ప్ 0.17శాతం పెరిగింది.

డిసెంబర్ అమ్మకాల్లో 43 శాతం పెరగడమే దీనికి ప్రధాన కారణం. టైటాన్ 1.30 శాతం లాభపడింది. క్యూ3 ఫలితాలు తమ అంచనాలకు తగ్గట్టే ఉన్నాయని తెలిపింది. పంజాబ్‌సింధ్ బ్యాంకు 3.32 శాతం లాభపడింది. ఎరువుల షేర్లు మాత్రం జోరందకున్నాయి. నాగార్జున ఫెర్టిలైజర్స్ 19.91 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ 5.72 శాతం, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్ 2.49 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 4.08 శాతం, జువారి ఆగ్రో కెమికల్స్ 2.46 శాతం, మంగళూరు కెమికల్స్ 3.59 శాతం, చంబల్ ఫెర్టిలైజర్స్ 2.07 శాతం పెరిగిన వాటిలో ఉన్నాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లతో పాట ఐరోపా మార్కెట్లు లాభాలతో ముగిశాయి.

# స్కోడా అమ్మకాల్లో 30 % వృద్ధి

● కలిసొచ్చిన కొత్త మోడల్స్



**ముంబై:** ఫోక్స్‌వ్యాగెన్ గ్రూపునకు చెందిన కార్ల తయారీ కంపెనీ స్కోడా ఏప్రిల్ 2016 నుంచి అక్టోబర్ 2017 మధ్యలో కొత్తగా నాలుగు మోడల్స్‌ను దేశీయ మార్కెట్లకు పరిచయం చేసింది. సూపర్బ్, రాపిడ్, ఒక్టావియా ఆర్ 230తో పాటు కొత్తగా 7 సీటర్ల ఎస్‌యూవీ కొడియాక్‌ను భారతీయ మార్కెట్లో విడుదల చేసింది. దీంతో 2016తో పోల్చుకుంటే 2017లో తమ అమ్మకాలు 30 శాతం పెరిగి 17,438 యూనిట్లకు చేరాయని ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త మోడల్స్‌ను విడుదల చేయడంతో అమ్మకాలు పెంచుకోడానికి వీలైందని, అలాగే ఈ ఏడాది 2018లో కూడా కొత్త మోడల్స్‌ను మార్కెట్లకు పరిచయం చేస్తామని స్కోడా ఆటో ఇండియా సేల్స్, మార్కెటింగ్ అండ్ సర్వీసెస్ డైరెక్టర్ అశుతోష్ దీక్షిత్ చెప్పారు. గత ఏడాది అక్టోబర్‌లో కొత్త ఎస్‌యూవీ కొడియాక్ విశేష స్పందన లభించిందని.. దీంతో గ్రూపు చెందిన అమ్మకాలు భారీగా పెరిగాయని తెలిపింది. ఈ ఏడాది కొత్త కొత్త మోడల్స్‌ను తీసుకువస్తామని, ర్యాపిడ్ మోడల్ కారు అత్యధికంగా అమ్ముడవుతోందన్నారు. డిజెల్‌కార్లపై మోజు తగ్గింది : దేశీయ వినయోగదారుల్లో డిజిల్ కార్లపై మోజు తగ్గింది. గతంలో పెట్రోల్, డిజిల్ ధరలకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదార్లు డిజిల్ కార్లకొనుగోలుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం పెట్రోల - డిజిల్‌కు మధ్య వ్యత్యాసం తగ్గడంతో డిజిల్ కార్ల కొనుగోలుకు కస్టమర్లు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. 2012లో పెట్రోల్ - డిజిల్‌ల మధ్య వ్యత్యాసం రూ.27 వరకు ఉండేది. ప్రస్తుతం ఇది రూ.10కి దిగివచ్చింది. 2012-13లో డిజిల్, పెట్రోల్, డిజిల్ కార్ల మధ్య వ్యత్యాసం 50 శాతంగా ఉండేది ప్రస్తుతం ఇది 23 శాతానికి దిగివచ్చింది. ఆటో నిపుణుల అంచనా ప్రకారం రాబోయే రోజుల్లో డిజెల్ కార్ల అమ్మకాలు బాగా తగ్గిపోతాయని ప్రభుత్వం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట వేస్తోందని.. కాలుష్యానికి డిజిల్ కార్లు ప్రధాన కారణమని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఎస్‌యూవీ కార్లు మాత్రమే డిజిల్‌తో నడుస్తాయి.

# గజల్ శ్రీనివాస్ రాసలీలలు..



● 20 వీడియోలను బయట పెట్టిన బాధిత యువతి ● పనిమనిషి పార్వతి గాయబ్ ● ఆచూకీ కోసం పోలీసుల యత్నాలు ● చంచల్‌గూడలో ఖైదీనంబర్ 1327 కేటాయింపు ● ఆ వీడియోలన్నీ మార్ఫింగేనంటున్న గజల్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గజల్ శ్రీనివాస్ రాసలీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గజల్ శ్రీనివాస్ రాసలీలకుసంబంధించిన మరో 20 వీడియోలను బాధితురాలు పోలీసులకు అందజేసింది.తాను ఆధ్యాత్మిక వాదినని, యూట్యూబ్‌లలో సేవ్ టెంపుల్ ప్రోగ్రాం ఫాలో అయ్యేదాన్నని, ఈ క్రమంలోనే ఆకర్షితురాలినై ఆలయవాణి రేడియో జాకీగా జాయిన్ అయ్యానని బాధితురాలు పేర్కొంది. తాను 8 నెలలు వర్క్ చేశానని, రెండు నెలల క్రితం తమ ఛైర్మన్ అమెరికా వెళ్లారని, ఆయన గదిని గజల్ శ్రీనివాస్ బెడ్‌రూంగా చేసుకుని, తన కార్యకలాపాలు చేసుకుపోయారని ఆరోపించింది. ఆయన అవసరాల కోసమే మేం ఉన్నామన్న ట్లుగా వ్యవహరించేవాడన్నారు. ఇవన్నీ బాగాలేవని, తనకు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇస్తే వెళ్తానంటే.. బ్లాక్‌మెయిల్ చేసేవాడని తెలిపింది. తానంటే గజల్ శ్రీనివాస్‌కు ఇష్టమని పనిమనిషి పార్వతి కూడా చెబుతుండేదని, రెండు నెలలుగా ఇబ్బంది పడ్డానని, ఇది ఎవరికి చెప్పలేని పరిస్థితి అని బాధితురాలు వెల్లడించింది.. అందుకే ఆధారాలతో ఆయన బాగోతం బయటపెట్టాలని తాను భావించి, వీడియోలు సేకరించానని చెప్పింది.

### బాధితురాలికి నన్నపనేని బాసట

గజల్ శ్రీనివాస్ బాధితురాలికి ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ ధైర్యం చెప్పారు. గజల్ శ్రీనివాస్ ఘోరాన్ని బయటపెట్టిన బాధితురాలు భయపడాల్సిన పనిలేదని, పోలీసులు, న్యూస్ చానెల్స్, మహిళా కమిషన్లు అండగా ఉంటాయని ధైర్యం చెప్పారు. గజల్ శ్రీనివాస్ సంఘటనలో సాక్ష్యాధారాలు లేకపోతే నమ్మేవాళ్లం కాదని, సాక్ష్యాధారాలు ఉన్నాయి కనుక నమ్ముతున్నామని అన్నారు. అమ్మ, మహిళల మీద అద్భుతమైన గజల్స్ పాడే శ్రీనివాస్ ఇంత దారుణానికి ఒడిగట్టాడా? అని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

### భార్య, తల్లికి చెప్పినా పట్టించుకోలేదు..

గజల్ శ్రీనివాస్ వ్యవహారం గురించి ఆయన భార్య, తల్లి కూడా చెప్పినా వారు పెడచెవిన పెట్టారని బాధితురాలు ఆరోపించింది.. దీంతో ఎలాగైనా గజల్ శ్రీనివాస్ రాసలీలలను బయటపెట్టాలని నిర్ణయించుకున్నానని, ఆ క్రమంలోనే స్టింగ్ ఆపరేషన్ చేశామని తెలిపింది.శ్రీనివాస్ రాసలీలలన్నింటినీ కెమెరాల ద్వారా రికార్డు చేయడంతో ఆయన గుట్టురట్టయిందని తెలిపింది.

### బెయిల్ ఇవ్వొద్దు..బెదిరిస్తారు...

మహిళను లైంగికంగా వేధించిన కేసులో అడ్డంగా బుక్కయిన గజల్ శ్రీనివాస్ బెయిల్‌కు సంబంధించి బుధవారం నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. అంతకుముందు బెయిల్ ఇవ్వవద్దని పంజాగుట్ట పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. గజల్ శ్రీనివాస్ బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని పోలీసులు తమ కౌంటర్లో పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా పలువురిని విచారించాల్సి ఉందన్నారు. ఆయనకు సమాజంలో పలుకుబడి ఉందని, కేసులో బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేయాల్సి ఉందని చెప్పారు. గజల్ శ్రీనివాస్‌ను తమకు ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ వస్తుందా? పోలీసుల కస్టడీకి కోర్టు అనుమతిస్తుందా అనే ఆసక్తి నెలకొంది.



(ఫైల్)

### మసాజ్ కథేంటి..?



గజల్ శ్రీనివాస్‌కు యాక్సిడెంట్ అయింది కాబట్టే మసాజ్ చేశారని చెబుతున్నారు కదా అని అడగగా.. తాను అక్కడి ఆఫీసులో కంప్యూటర్ వర్క్ చేస్తా నని, అలాంటప్పుడు తనకు మసాజ్‌తో ఏం సంబంధమని బాధితురాలు వాపోయింది. మొదట నుంచి తాను గజల్ మాట వినలేదని, అందుకే తనపై కోపం పెంచుకున్నారని తెలిపింది. గజల్ శ్రీనివాస్ అప్పుడప్పుడు జూనియర్ ఆర్టిస్టులను కూడా ఆఫీసుకు రప్పించుకునే వారని, ఎవరైనా వచ్చినప్పుడు తన అవసరాల కోసం తమను వెళ్లిపొమ్మని చెప్పేవాడని తెలిపింది.. ఇవన్నీ భరించలేకే ఆధారాలతో సహా బయటపెట్టేందుకు తాను సిద్ధమయ్యానని చెప్పింది.

### లైంగిక వేధింపుల కేసుతో చిక్కులు.!
### ఎవరీ గజల్ శ్రీనివాస్?

లైంగిక వేధింపుల కేసులో అరెస్టు కావడంతో గజల్ శ్రీనివాస్ చిక్కుల్లో పడ్డారు. అయితే, ఆయనకు పేరుప్రఖ్యాతలు మెండుగానే ఉన్నాయి. ప్రస్తుత కేసుతో ఆయన వ్యక్తిత్వంపై మచ్చపడింది. గజల్ శ్రీనివాస్‌గా పేరు సంపాదించుకున్న ఆయనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సమైక్య ఉద్యమానికి బాసటగా నిలిచారు. సమైక్యాంధ్ర కోసం పాటలు కట్టి ప్రదర్శనలు ఇచ్చారు. గజల్ శ్రీనివాస్‌గా ప్రసిద్ధి చెందిన కేశిరాజు శ్రీనివాస్ తెలుగు గజల్ గాయకుడు. గజల్ శ్రీనివాస్ 125 ప్రపంచ భాషలలో గాంధేయవాదంపై గజల్స్ పాడారు. తద్వారా మూడు గిన్నీస్ ప్రపంచ రికార్డులను, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ నెలకొల్పాడు. శ్రీనివాస్ అమెరికాలో అనేకసార్లు పర్యటించి తెలుగుతోరణం అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహించారు. తాను సుమారు 60 గజళ్లను రాశానని, సినారే, డాక్టర్ తాటపర్తి రాజగోపబాలం, రెంటాల వెంకటేశ్వ రరావుల గజళ్లను గానం చేస్తుంటానని ఆయన చెబుతుంటారు. తాను పుట్టిన శ్రీకాకుళం జిల్లాలో గజల్ శ్రీనివాస్ ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా విస్తృతంగా వైద్యసేవలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు గజల్ శ్రీనివాస్ గతంలో చెప్పారు. ప్రపంచ ప్రసిద్ద లాజరస్ ఆసుపత్రికి సాంస్కృతిక రాయబారిగా తాను ఉన్నందున ఇచ్ఛాపురం, కవిటి వంటి ప్రాంతాలను దత్తత తీసుకొని ప్రముఖ వైద్య నిపుణులతో సేవలందిస్తానని తెలిపారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడిన పలు గ్రామాలను దత్తత తీసుకుని వైద్యసేవలందిస్తున్నట్లు కూడా తెలిపారు. గజల్ శ్రీనివాస్‌కు పురస్కారాలు దండిగానే వచ్చాయి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సేవా సమితి నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవన సాఫల్య పురస్కారం, విశాఖపట్నం కళావేదిక నుంచి ఉగాది పురస్కారం, రోటరీ ఇంటర్నేషనల్ నుంచి ఒకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం, లయన్స్ ఇంటర్నేషనల్ నుంచి ఒకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం, జేసీస్ క్లబ్ నుంచి అవుట్ స్టాండింగ్ యంగ్ పురస్కారం, తెలుగు విజ్ఞాన సమితి, బెంగళూరు నుంచి తెలుగు విజ్ఞాన సమితి పురస్కారం, తెలుగు ఇన్‌టాక్ మలేషియా నుంచి మలేషియా ఉగాది పురస్కారం, ఆస్ట్రేలియా సిడ్నీ తెలుగు అసోసియేషన్ నుంచి తెలుగు అసోసియేషన్ పురస్కారం, యూరోపియన్ తెలుగు అసోసియేషన్ నుంచి ఈటా పురస్కారం, తెలుగు కళాసమితి నుంచి అంతర్జాతీయ సద్భావనా పురస్కారంతో పాలు బిరుదులను సైతం గజల్ శ్రీని వాస్‌ను వరించాయి. బిరుదుల విషయానికొస్తే.. గజల్ మాస్ట్రో, గజల్ గానగంధర్వ, గజల్ గానప్రపూర్ణ, గజల్ గానవిశారద, గజల్ గానచిరంజీవి, గజల్ గానసమ్రాట్, గజల్ గానవిభూషణ, గజల్ మొఘల్, గజల్ గాయకపాదుషా, గజల్ గానబ్రహ్మ, గజల్ స్వరభూషణ, ప్రైడ్ ఆఫ్ ఇండియా వంటి బిరుదులు ఆయనకు వచ్చాయి. ఇలాంటి ప్రముఖ వ్యక్తిగా కీర్తించబడుతున్న గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో ఇరుక్కుని జైలు ఊచలు లెక్కపెడుతుండటం గమనార్హం.

### స్టింగ్ ఆపరేషన్ జరిగిందిలా...

శ్రీనివాస్ చీకటి కోణాన్ని బయటపెట్టేందుకు ముందుగానే కార్యాలయానికి వెళ్లేదాన్నని బాధితురాలు తెలిపింది. ఫ్లిప్ కార్ట్‌లో కెమెరా కొని..ఎక్కడ కెమెరాపెడితే వీడియో క్లియర్ గా వస్తుందో పరిశీలించి గజల్ రాసలీలలు రికార్డుచేశానని చెప్పింది. తనకు టైం దొరికినప్పుడు వీడియో తీశానని.. డిసెంబర్ నెలలోనే ఎక్కువ వీడియోలు తీశానని వెల్లడించింది.ఇదిలా ఉండగా, బాధిత యువతి స్టింగ్ ఆపరేషన్ ద్వారా తీసిందని చెబుతున్న వీడి యోలన్నీ మార్ఫింగ్‌వేనని గజల్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు చెబుతుండటం గమనార్హం. కాగా, చంచల్‌గూడ జైలులో ఉన్న గజల్ శ్రీనివాస్‌కు ఖైదీ నెంబర్ 1327ను కేటాయించారు.

### మరో షాక్..సేవ్ టెంపుల్ నుంచి సస్పెన్షన్

గజల్ శ్రీనివాస్‌కు మరో షాక్ తగిలింది. సేవ్ టెంపుల్‌కు గజల్ శ్రీనివాస్ ప్రచారకర్తగా ఉన్న ఆయనను సస్పెండ్ చెస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు ప్రకటించారు.తమ సంస్థల్లో పనిచేసే స్త్రీలనున దేవతల్లా గౌరవిస్తామని అన్నారు. సంస్థ పేరును అడ్డం పెట్టుకుని ఇటువంటి వికృత కార్యకలాపాలకు పాల్పడితే సహించబోమని తెలిపారు.

### గజల్‌ని వదలొద్దు.. కఠినంగా శిక్షించండి...

గజల్ శ్రీనివాస్ వికృత చేష్టలపై సామాజిక, మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. ఆధ్యాత్మిక ముసుగులో ఇలాంటి చేష్టలకు పాల్పడేవారని వదలొద్దని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆధ్మాత్మికతపై మక్కువతో అక్కడ జాయిన అయిన బాధితురాలిని లైంగిక వేధింపులకు గురిచేసిన కేసులో అరెస్టయిన శ్రీనివాస్‌కు కఠిన శిక్షపడాల్సిందేనని వారు కోరుతున్నారు.

### కావాలనే కుట్ర : ఏపీ మంత్రి మాణిక్యాలరావు

ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారంపై ఏపీ దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు స్పందించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి గజల్ శ్రీనివాస్ బాగా తెలుసని, అతను అలాంటి వాడు కాదని అన్నారు. అతను ఏ తప్పు చేయలేదని అనుకుంటున్నానని అతనిపై కావాలనే కుట్ర చేశారని భావిస్తున్నానని అన్నారు. పథకం ప్రకారం చేయకుంటే వీడియోలు బయటకు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మీడియా లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ మీతో నేను వాదించదల చుకోలేదు. నా అభిప్రాయం నేను చెప్పాను. ఏదైనా డిస్కషన్ ఉంటే బయట మాట్లాడతాను. మీకంటే గట్టిగా నేనూ మాట్లాడగలను. మీడియా ముందు మాట్లాడుతున్నాను కనుక సంప్రదాయకమైన భాషలో మీతో మాట్లాడాలి.. ఈ మైకు ఆన్‌లో ఉండగా చక్కగా మాట్లాడతా, అంతకుమించి వద్దు అని చెప్పుకొచ్చారు.



## కార్పొరేట్‌కు దీటుగా చిట్యాల ఆస్పత్రి

**చిట్యాల, ప్రభ న్యూస్ :** రాష్ట్రంలోనే మారుమూల ప్రాంతం జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని 30 పడకల హాస్పిటల్‌లో కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ప్రగతి నిద్రలో భాగంగా బుధవారం రాత్రి మండలకేంద్రంలోని సివిల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. 30 పడకల హాస్పిటల్ 50 పడకల ఆస్పత్రిగా స్పీకర్ చొరవతో నిర్మించారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్, నాయకులు కుంభం రవీందర్‌రెడ్డి, నవనీతరావు, సర్పంచ్ పుల్లూరి రమాదేవి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్‌శాఖ డైరీని ఆవిష్కరించిన మంత్రి పద్మారావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ కోసం ఎక్సైజ్ శాఖ ఉద్యోగస్తులు తమ ఉద్యోగాలనే పణంగా పెట్టారని ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు అన్నారు. రాష్ట్రంలో గుడుంబాను అరికట్టామని ఆయన తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల డైరీని మంత్రి పద్మారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలోని అన్ని యూనిట్లను ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సిబ్బందికి ప్రభుత్వ వాహనాలు ఇచ్చే విషయంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోయినట్లు, త్వరలోనే ఒక నిర్ణయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌బీసీఎల్ ఛైర్మన్ దేవి ప్రసాదరావు, ముఖ్య కార్యదర్శి సోమేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

## బీసీ మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 27 శాతం అవకాశమివ్వాలి

### తెలంగాణ బీసీ మహిళాసంఘం

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** బీసీ మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 27 శాతం అవకాశం కల్పించాలని తెలంగాణ బీసీ మహిళా సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలతోపాటు, మంత్రివర్గంలోనూ మహిళలకు 27 శాతం విధిగా కేటాయించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదా గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. సావిత్రీబాయి పూలే 187వ జయంతిని బుధవారం బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమ్య,



లక్ష్మి, వేల్పుల భిక్షపతి, జీవిత, అంజి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సమాజాన్ని విద్యారంగం వైపు నడిపించిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. సావిత్రీ బాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సావిత్రీబాయి పూలే 187వ జయంతిని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్క నవీన, వన్నాడి రమ్య, గుజ్జ కృష్ణ, ఎన్ భూపేష్ సాగర్, నందగోపాల్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్, అసెంబ్లీల్లో సావిత్రిబాయి విగ్రహం

సావిత్రీబాయి విగ్రహాన్ని పార్లమెంటులో, అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని బీసీ మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే 187వ జయంతిని తెలంగాణ మహిళా జాగృతి సమితి, బీసీ మహిళా ఐక్య వేదిక సంయుక్తంగా నిర్వహించాయి.

### ఏప్రిల్ 29న నిజాం కాలేజీలో పూలే- అంబేద్కర్ జాతర

పూలే- అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అందరూ అవలంభించాలని తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. సావిత్రీబాయి పూలే 187వ జయంతి సందర్భంగా పూలే- అంబేద్కర్ జాతరను ఆయన బుధవారం అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర ఏప్రిల్ 29న నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుతుందన్నారు.

### మహిళలకు సావిత్రి బాయి పూలే ఆదర్శం: పద్మావతి

సావిత్రీ బాయి పూలే మహిళా జీవితానికి ఆదర్శమని కస్తూర్బాగాంధీ ట్రస్ట్ తెలంగాణ ఇన్‌ఛార్జ్ పద్మావతి అన్నారు. ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. సావిత్రీబాయి పూలే 187వ జయంతిని విజ్ఞాన్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జయంతి కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ గౌరీ సతీష్ అధ్యక్షత వహించగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, సర్వోదయ కమిటీ జాతీయ కార్య దర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 500 మంది బాలికలు పాల్గొన్నారు.




## అనుమతి రద్దు చేయాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో క్రైస్తవ మత సమావేశాన్ని 5న నిర్వహించేందుకు తెలంగాణ శాసన సభ్యుడు డి.రాజేశ్వర్ రావుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసేలా ఢిల్లీలోని భారత రక్షణ మంత్రిత్వ శాఖను ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యాన్ని శివశక్తి సంస్థ ప్రధాన కార్యదర్శి సీహెచ్.కళ్యాణ్ దాఖలు చేశారు. ఈ సమావేశానికి హాజరు కావాలంటూ అమెరికాకు చెందిన డాక్టర్ బిల్లీ గ్రాహం కుమార్తె అన్నె గ్రాహం లోట్జ్‌ను భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆహ్వానించిందని తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులను తప్పుదోవ పట్టించి డి.రాజేశ్వర్ రావు ఈ అనుమతిని పొందినట్లు పేర్కొన్నారు. ఇది స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమమని బంగారు తెలంగాణ ఏర్పడేందుకు ప్రత్యేక ప్రార్థన అని పేర్కొంటూ తప్పుడు సమాచారంతో సాధించిన అనుమతి అని పిటిషనర్ వివరించారు. సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా పాల్గొంటారని భారీ ఎత్తున పబ్లిసిటీ చేశారని తెలిపారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు క్రైస్తవ మతంలోకి మారే ప్రమాదం ఉన్నందువల్ల అనుమతిని రద్దు చేసేలా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖను ఆదేశించాలని, తెలంగాణ రాష్ట్రంలో మతపరమైన సమావేశాలను నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థించారు.

## 'చాకలి ఎస్సీ సాధన' సమావేశానికి అనుమతివ్వాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** చాకలి కులాన్ని ఎస్సీ వర్గంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ చాకలి ఎస్సీ సాధన పేరుతో సమావేశాన్ని సరూర్‌నగర్ స్టేడియంలో 7న నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యాన్ని ఖమ్మం జిల్లా జూబిలిపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొత్తకొండ్ల శ్రీలక్ష్మి దాఖలు చేశారు. చాకలి కులాన్ని ఎస్సీ వర్గంలో చేర్చాలనే నినాదంతో చాకలి ఎస్సీ సాధన సమితి కన్వీనర్ కూడా అయిన పిటిషనర్ జులై 2, 2017 నుంచి 31 జిల్లాల్లో పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా 7న సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నిజాంకాలేజీ మైదానంలో సమావేశాన్ని నిర్వహించేందుకు అనుమతిని ఇచ్చేందుకు నగర పోలీస్ కమిషనర్ నిరాకరించినట్లు, మరో చోట నిర్వహించుకోవాలని సూచించినట్లు పిటిషనర్ తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియంలో సమావేశం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలంటూ రంగారెడ్డి కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించినప్పటికీ ఇంత వరకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. అందువల్ల చాకలి ఎస్సీ సాధన సమావేశానికి అనుమతిని ఇచ్చేలా రంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



**అశ్వాపురం, ప్రభన్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట గ్రామసమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొరైచెరువుపేట గ్రామానికి చెందిన శివరాత్రి గోపయ్య అలియాస్ పోతురాజు(50), జంగారెడ్డిగూడెం మండలం డాంగీనగర్‌కు చెందిన సన్యాసిపేట కనకరాజు(43), గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం యలమందల గ్రామానికి చెందిన తొడేటి భాగ్యరావు(23) మృతి చెందారు. మృతుడి తొడేటి భాగ్యరావు డీసీఎం వ్యాన్ డ్రైవర్ కమ్ ఓనర్ కాగా... మిగతా ఇద్దరు బీఎస్ఎన్ఎల్ కేబుల్ పనులు నిర్వహిస్తున్న రోజు వారీ కూలీలు. డీసీఎం వ్యాన్ నుండి బీఎస్ఎన్ఎల్ కేబుల్‌పైపులు దింపుతున్న క్రమంలో ఓ బొగ్గు టిప్పర్ ఢీకొనడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. సంఘటన స్థలాన్ని అశ్వాపురం సీఐ అల్లం నరేందర్, ఎస్సై రాంజీనాయక్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పనులు జోరు.. బిల్లులు బేజారు

### లబోదిబోమంటున్న గుత్తేదారులు



**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు పుష్కలంగా ఉండ డంతో ఆ శాఖలో పనులు వేగంగా సాగుతున్నాయి. అదే సందర్భంగా కొన్ని శాఖలకు అంతంత మాత్రం గానే నిధుల విడుదలవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలు పేరుకుపోతుండడంతో అటు లబ్దిదారులు మరోవైపు గుత్తేదారులు లబోదిబోమంటున్నారు. డిసెంబర్ 31వరకు పని చేసిన పనులు, లేదా లబ్దిదారులకు అందాల్సిన నిధులు దాదాపు 3 వేల కోట్లకు పైగా అందకపోవడంతో లబ్దిదారులు, గుత్తెదారులు పే అండ్ అకౌంట్స్ కార్యా లయాల చుట్టు తిరుగుతున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి రూ. 1,49,646.00 కోట్లను ఆర్థిక శాఖ ప్రతి పాదిం చిన విషయం తెలిసిందే. అన్ని వర్గాల సంక్షే మమే లక్ష్యంగా ప్రభుత్వం వేలకోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. సంక్షేమానికి నిధుల విడుదలలో ఏ మాత్రం జాప్యం చేయవద్దని సీఎం కేసీ ఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, కొన్ని శాఖలకు సంబంధించి మాత్రం రకరకాల కార ణాలతో నిధుల విడుదలలో జాప్యం జరుగు తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఆర్థిక సహకార సంస్థలకు సకాలంలో సబ్సిడీలు మంజూరు చేయ కపోవడంతో లబ్దిదారులు ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. అధికార వర్గాల కథనం ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖ బకాయిలు రూ. 300 కోట్లు, గ్రామీణ పంచాయతి రోడ్లకు రూ. 500 కోట్లు, పర్యాటక శాఖకు రూ. 50 కోట్లు, బీసీ కార్పోరేషన్‌కు రూ. 102.8 కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ. 400 కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 500కోట్లు నిధులు విడుదల కాకపోవడంతో ప్రభుత్వ కార్యాల యాల చుట్టూ గుత్తెదార్లు, లబ్దిదారులు తిరుగుతు న్నారు. చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల విడుదలకై ఇంజినీరింగ్ శాఖాధికారులు గుత్తెదార్లకు టోకెన్లు ఇస్తారు. సంబంధిత శాఖలకు నిధులు విడుదలైన తర్వాత సీరియల్ నంబర్ ప్రకారం టోకెన్లకు నిధులు మంజూరు చేస్తారు. నవంబర్‌లో తీసుకున్న టోకెన్లకు కూడా డిసెంబర్ ఆఖరు వరకు నిధులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీబీసీ, మైనారిటీ ఆర్థిక సహకార సంస్థల అధికారులైతే జవాబు చెప్పలేని పరిస్థితి ఉందని సంబంధిత అధి కారులు చెప్పారు. సబ్సిడీల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ కింది స్థాయి అధికారుల జాప్యంతోనే ఆలస్యమవుతున్నాయని వారంటు న్నారు. నిధుల విడుదలలో జాప్యంతో ప్రభుత్వం అను కున్న లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవు తున్నా మని అధికారులు స్వయంగా అంగీకరిస్తున్నారు. కొత్త సంవత్సరంలోనైనా నిధుల విడుదల వేగం పుంజుకుంటుందని వారు ఆశాభావంతో ఉన్నారు.

# పడని వేలిముద్ర!

● ఆధార్‌తో సరిపోలని చిరునామాలు
● రద్దవుతున్న పింఛన్లు
● మళ్లీ వస్తున్న దరఖాస్తులు
● వయోవృద్ధుల అగచాట్లు
● నిబంధనలను మార్చాలి
● ప్రభుత్వమే ఆదుకోవాలి



**అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐదో విడత జన్మభూమి గ్రామసభల్లో పెద్దెత్తున దరఖాస్తుల్లో అత్యధికంగా పింఛన్లకోసమే ఉంటున్నాయి. ఇందులో సగానికిపైగా రద్దయిన పింఛన్ల పునరుద్దరణ కోసమే అందుతున్నాయి. ఇది ప్రజాప్రతినిధుల్ని, ప్రభుత్వాన్ని కూడా తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పథకం క్రింది పింఛన్లను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. 60ఏళ్ళుదాటిన వృద్దులకు వెయ్యి రూపాయల చొప్పున నెలనెలా చెల్లిస్తోంది. అలాగే వికలాంగులకు 1500, వితంతువులకు వెయ్యి రూపాయల చొప్పున పింఛన్లు ఇస్తోంది. అయితే పింఛన్ల చెల్లింపుల్లో తరచూ అనేక సాంకేతిక అవరోధాలేర్పడుతున్నాయి. లబ్ధిదార్లు తప్పనిసరిగా తమ వేలిముద్రను అధికారుల వద్దనున్న ట్యాబ్‌పై వేయాలి. ఆధార్‌కు అనుసంధానించిన వేలిముద్రతో ఇరి సరిపోలాలి. అప్పుడే పింఛన్ ఇవ్వొచ్చన్న సంకేతం ట్యాబ్ ద్వారా వెలువడుతుంది. లేనిపక్షంలో పింఛన్ చెల్లింపునకు అవకాశముండదు. అయితే వయసు రీత్యా 65ఏళ్ళుదాటిన వృద్దుల్లో అనేక శారీరక మార్పులు ప్రకృతి రీత్యా సహజం. వారి చర్మం సాగడం లేదా ముడతలు పడ్డం జరుగుతుంది. అలాగే తీర్ఘకాలంగా కష్టించి పనిచేయడం వల్ల చేతులపైనున్న చర్మం అరిగిపోతుంది. ఈ కారణంగా ట్యాబ్‌పై వేలిముద్ర సరిగా అతకడంలేదు. దీంతో చెల్లింపులు జరగడంలేదు. అలాగే ఆధార్ కార్డులో ఉన్న చిరునామాకు ప్రస్తుతమున్న చిరునామాకు మధ్య సరిపోలని సందర్భాల్లో కూడా ఈ పింఛన్ల చెల్లింపును నిలిపేస్తున్నారు. అసలు ఈ పింఛన్లకు దరఖాస్తులు చేసేదే పేదలు. వారిలో అత్యధికులకు సొంతి ళ్ళుండవు. పరిస్థితుల్ని బట్టి ఇళ్ళు మారుతుంటారు. ఆధార్ కార్డు నమోదు సమయంలో వారు అప్పటికి నివసిస్తున్న ఇంటి చిరునామానే ఇస్తారు. ఆ తర్వాత ఇల్లు మారడంతో కొత్త చిరునామా నమోదు చేస్తారు. ఈ రెండింటికి సరిపోలడంలేదు. ఇలాంటి పింఛన్లు రద్దవుతున్నాయి.

ఈసారి ప్రభుత్వం గ్రామసభల్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అర్హులందరికీ పింఛన్లు ఇతర ప్రభుత్వ పథకాల్ని రాజకీయాలకతీతంగా అందజేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో కార్యకర్తల ప్రమేయాన్ని పక్కనపెట్టాలని కూడా సూచించింది. నేరుగా అర్హతలాధారంగా అధికారులే లబ్ధిదార్లను ఎంపిక చేయాలని పేర్కొంది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఎక్కువ సేపు దీనిపైనే వివరణివ్వడం కూడా జరిగింది. పైగా కొత్తగా వచ్చే దరఖాస్తులకు గరిష్టపరిమితి లేకుండా అర్హులందరికీ పింఛన్లు ఇమ్మంటూ కూడా ఆయన సూచించారు. అయితే ఇప్పుడు వస్తున్న దరఖాస్తుల్లో సగానికి పైగా రద్దయిన పింఛన్లను పునరుద్ధరించమనే. అయినప్పటికీ ఇందుకు సాంకేతిక అవరోదాలెదురౌతున్నాయి. తిరిగి చిరునామా, వేలిముద్రల సమస్యలు తప్పవు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వమే నిర్దేశించాలి. ఇలాంటి సాంకేతిక అవరోధాల్ని పక్కనపెట్టి ఒకసారి మంజూరైన పింఛన్‌ను జీవితాంతం కొనసాగించేలా నిబంధనలు రూపొందించాలి. అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుంది. పేద కుటుంబాలకు చెందిన లబ్ధిదార్లు తరచూ ప్రభుత్వాధికారుల చుట్టూ తిరిగి ప్రాదేయపడాల్సిన దుస్థితి తప్పుతుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

# భారత్ లక్ష్యంగా డ్రాగన్ కుట్ర

- రహస్యంగా హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్స్ పరీక్ష • అమెరికా, జపాన్, భారత్ దేశాల రక్షణ వ్యవస్థకు సవాళ్లు • క్షిపణి వివరాలను బట్టబయలు చేసిన సౌత్ మార్నింగ్ పోస్ట్
- హెచ్‌జీవీ అత్యంత శక్తివంతమైనదంటున్న నిపుణులు
- అమెరికా యాంటీ మిస్సైల్‌నూ నాశనం చేయగలదని హెచ్చరికలు



**బీజింగ్:** భారత్ లక్ష్యంగా చైనా కుట్రలు మరోసారి బహిర్గతమయ్యాయి. డ్రాగన్ తయారు చేసిన కొత్త హైపర్ సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్ అమెరికా భద్రతా వ్యవస్థకు సవాల్ విసరడమే మాత్రమే కాకుండా జపాన్, భారత్ దేశాలను కూడా లక్ష్యంగా చేసుకుని రూపొందింటినట్లు తాజా నివేదికలో ద్వారా వెల్లడైంది.. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక ఈ మిస్సైల్ కు సంబంధించిన కీలక విషయాలను బయటపెట్టింది. చైనా రాకెట్ బలాగాలు గతేడాది హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికిల్ (హెచ్‌జివి) సంబంధించిన రెండు పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. హెచ్‌జివికి డీఎఫ్ - 17 అని కూడా నామకరణం చేశారని స్పష్టం చేసింది. అమెరికా నిఘావర్గాల ప్రకారం గతేడాది నవంబర్ 1న ఒక పరీక్ష , వారంరోజుల తర్వాత మరో మిస్సైల్ టెస్ట్ చేసినట్లు టోక్యోమ్యాగజైన్ గతనెల వెల్లడించింది.ఈ రెండు పరీక్షలు విజయవంతం కావడంతో డీఎఫ్-17 కార్యకలాపాలు 2020 నుంచి అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికిల్ కు ఇంకా పేరును ఖరారు చేయకపోయినప్పటికీ ఈ మిస్సైల్ ను వివిధ రకాలుగా వినియోగించవచ్చని పేర్కొంది. హెచ్‌జీవో అస్త్రాలు చాలావేగంగా దూసుకుపోవడంతో పాటు, తక్కువ సామర్థ్యం, అతితక్కువ ట్రాక్ చేయగలవని స్పష్టం చేసింది. యుద్ధ క్షేత్రంలో అతితక్కువ సమయంలో వీటిని ప్రయో గించేలా రూపొందించినట్లు తెలిపింది. డీఎఫ్ -17 క్షిపణులు మంగోలియా అంతర్గత ప్రాంతమైన జూక్వాన్ లాంచింగ్ సెంటర్ నుంచి పరీక్షించినట్లు తెలుస్తోంది. ప్రయోగించిన సమయంలో ఇవి దాదాపు1400 కిలోమీటర్ల దూరపు లక్ష్యాన్ని ఛేధించినట్లు సమాచారం. హెచ్‌జివి టెక్నాలజీ గురించి చైనా మీడియా గతేడాది అక్టోబర్ లో తెలిపింది.

హెచ్‌జీవీ టెక్నాలజీ అణు వ్యూహాలలో భాగమని బీజింగ్ కు చెందిన మిలిటరీ విశ్లేషకుడు తెలిపారు. ఇది ప్రపంచలో అతిపెద్ద అణు శక్తి కలిగిన చైనా,అమెరికా, రష్యా దేశాల్లోనే ఈవ్యూహాలు అమలు చేయవచ్చన్నారు.చైనా రూపొందించిహైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్ వల్ల భారత్, జపాన్ దేశాల్లో ఆందోళన కనిపిస్తోందనిసౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తెలిపింది. అత్యంత వేగంగా, ఖచ్చితంగా లక్ష్యాన్ని ఛేధించగల ఈ క్షిపణుల వల్ల భద్రతాపరమైన సవాళ్లు ఎదురౌతాయని ఆయా దేశాలు ఆందోళన చెందుతున్నట్లుపేర్కొంది. జపాన్ లోని మిలిటరీ బేస్ లను కానీ.. భారత్ లోని అణు రియాక్టర్లను లక్ష్యం చేయడం హెచ్‌జీవీ టెక్నాలజీ మిస్సైల్‌కు సాధ్యమౌతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది.

### వివరాల వెల్లడికి చైనా విదేశాంగ శాఖ విముఖత

చైనా రూపొందించిన నూతన క్షిపణులకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ షుహాంగ్ నిరాకరించారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రికలో వచ్చిన వార్తలను ఖండించిన ఆయన..రక్షణ శాఖకు చెందిన వివరాలను ఆ శాఖ అధికారులకే తెలుసని వ్యాఖ్యానించారు. క్షిపణికి సంబంధించిన పూర్తి సమాచారం తమవద్ద లేదని ఆయన తెలిపారు. రక్షణ వ్యవస్థ కార్యకలాపాలు వెల్లడించడలేమని చెప్పుకొచ్చారు.

### అమెరికా థాడ్‌ను నాశనం చేయగల క్షిపణి

డీఎఫ్ -17 అనేది చైనా మిలిటరీ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పునరుత్పాదనలో ఒకటని చైనా మిలిటరీ నిపుణుడు సాంగ్ జాంగ్ పింగ్ తెలిపారు. చైనా ఆర్మీలో సెకండ్ ఆర్టిలరీగా సేవలందించిన జాంగ్ పింగ్...తాజా క్షిపణి డీఎఫ్-17 , డీఎఫ్ - జెడ్‌ఎఫ్ మోడల్ అని తెలిపారు. హెచ్‌జీవీ సిస్టమ్ ను వివిధ రకాల ఖండాతర క్షిపణులతో వినియోగించవచ్చన్నారు. కనీసం 5,500 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేధించగల ఖండాతర క్షిపణులతో కూడా దీన్ని ఉపయోగించవచ్చని తెలిపారు. హెచ్‌డివీని 12వేల కిలోమీటర్ల లక్ష్యం ఛేధించగల డీఎఫ్ -41 ద్వారా కూడా ఉపయోగించవచ్చన్నారు. అమెరికాకు చెందిన యాంటీ మిస్సైల్ వ్యవస్థ - థాడ్ ను కూడా నాశనం చేయగల శక్తి హెచ్‌డివీకి ఉందని మెకావు మిలిటరీ నిపుణుడు ఆంటోని వాంగ్ డాంగ్ తెలిపారు.

## పొగమంచుకు కొద్ది రైళ్ళే ఆలస్యం



**న్యూఢిల్లీ:** పొగమంచువల్ల రైళ్ళ ఆలస్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలిస్తున్నాయనీ, కొద్ది రైళ్ళే ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే మంత్రి పియూష్ గోయెల్ బుధవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. రైళ్ళ కన్నా ఆలస్యంగా నడిచే విమానాలే ఎక్కువని ఆయన వివరించారు. రైల్వేల నిర్వహణలో చాలా మార్పులు జరుగుతున్నాయనీ, సిగ్నలింగ్ వ్యవస్థను కంప్యుటీకరించడంవల్ల ప్రమాదాలనే కాకుండా,ఆలస్యాన్ని అరికట్టగలు గుతు న్నామని ఆయన అన్నారు.రైల్వేల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అనీ,తగినన్ని నిధు లకేటాయింపే అసలు సమస్య అని ఆయన అన్నారు. ప్రయాణీకుల భద్రతకూ, సకాలంలో రైళ్ళను నడపడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రైల్వేల అభివృద్ధికి ఈ ఏడాది 1,20 కోట్లను వెచ్చిస్తున్నామనీ,వచ్చే ఏడాది ఇంకా ఎక్కువ కేటాయిస్తామని చెప్పారు.2022 నాటికి రైల్వేలకు కొత్త రూపు తెచ్చేందుకుతీవ్రంగా కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు.

## సబ్సిడీలకు ఆధార్ తప్పనిసరి

- బిల్లుకు కర్నాటక ఆమోదం

**బెంగళూరు:** సబ్సిడీ పథకాలకు ఆధార్‌ని తప్పని సరన్నకేంద్ర చట్టాన్ని రాష్ట్రంలో అమలు జేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు కర్నాటకమంత్రివర్గం మంగళవారం ఆమోదం తెలిపింది.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతనజరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన ఈ బిల్లును ఫిబ్రవరి 16 నుంచి 28వరకూ జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతారు.సబ్సిడీ ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకు అందించడమే ఈ బిల్లు ముఖ్యోద్దేశ్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పారదర్శకమైన, సుపరిపాలనను అందించేందుకు ప్రభుత్వం నిజాయితీతో,చిత్తశుద్ధితో కృషి చేస్తోందని న్యాయశాఖ మంత్రి టిబి జయచంద్ర తెలిపారు. ఆధార్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇంతకముందే కేంద్రం రూపొందించిన శాసనాన్నే అమలుజేయాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. సిద్ధరామయ్య నేతృత్వంలో తమ ప్రభుత్వం దళితులు, ఇతర వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఇప్పటికే అనేక పథకాలను అమలు జేస్తోందని ఆయన చెప్పారు.ఎన్నికల దృష్టితో కాకుండా, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం మొదటినుంచిఅట్టడుగువర్గాల కోసం కృషి చేస్తోందని అన్నారు.

## పాక్‌పై మరిన్ని ఆంక్షలు



**వాషింగ్టన్:** ఉగ్రవాదంపై పోరుకు పాకిస్థాన్ చర్యలు తీసుకోకపోతే మరో 48 గంటల్లో పాకిస్థాన్‌పై అమెరికా మరిన్ని చర్యలు తీసుకుంటుందని వైట్ హౌస్ వెల్లడించింది. ఇప్పటికే ట్రంప్ పాకిస్థాన్‌ని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలతో రూ.1700 కోట్ల నిధులను నిలిపి వేస్తున్నట్లు అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా వైట్‌హౌస్ ప్రతినిధి సారా శాండర్స్ మాట్లాడుతూ, 'ఉగ్రవాదాన్ని ఆపే శక్తి పాకిస్థాన్‌కు ఉంది. ఆ పని పాక్ చేయాలి. పాక్ నుంచి మేమూ అదే ఆశిస్తున్నాం. మరో 24 నుంచి 48 గంటల్లో పాక్‌పై మేము మరిన్ని చర్యలు తీసుకోబోతున్నాం.' అని తెలిపారు. పాకిస్థాన్ అమెరికాతో డబుల్ గేమ్ ఆడుతోంది అని ఐఖ్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలి వ్యాఖ్యానించిన కొద్దిసేపటికే శాండర్స్ పై విధంగా స్పందించారు. మరోపక్క ట్రంప్ చేసిన వ్యాఖ్యలను పాక్ ఖండిస్తూ ఉగ్రవాదంపై పోరుకు అమెరికాకు అన్ని విధాలా సహకరిస్తున్నామని తమ భూభాగాన్ని, గగనతలాన్ని, సమాచార వ్యవస్థలను, సైనిక స్థావరాలను అగ్రరాజ్యానికి అందుబాటులో ఉంచామని పాక్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## న్యాయం నావైపే నవాజ్ షరీఫ్

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడునవాజ్ షరీఫ్ చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. పనామా పత్రాల కుంభకోణంలో పీకల్లోతుకు కూరుకుపోయిన షరీఫ్ కుటుంబం గట్టెక్కే సూచనలు కనిపించడంలేదు. నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మార్యం నవాజ్ బుధవారం అకౌంటబులిటీ కోర్టు ముందు హాజరయ్యారు. మార్యం భర్త రిటైర్ట్ కెప్టెన్ మహ్మద్ సఫ్దార్ కూడా న్యాయస్థానానికి హాజరైనట్లు స్థానిక మీడియా డాన్ వెల్లడించింది. విచారణలో భాగంగా న్యాయమూర్తి మహ్మద్ బషీర్ ఇద్దరు సాక్షుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. కోర్టు విచారణ తర్వాత షరీఫ్ మాట్లాడుతూ.. న్యాయస్థానంపై తనకు నమ్మకం ఉందని.. న్యాయం తమవైపే ఉందని వ్యాఖ్యానించారు. నవాజ్ షరీఫ్‌పై గతేడాది సెప్టెంబర్ లో మూడు అవినీతి కేసులు నమోదయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పుతో షరీఫ్ ప్రధాన మంత్రి పదవీచ్యుత్యుడయ్యారు. షరీఫ్, అతని కుటుంబీకుల అవినీతిపై జాతీయ జవాబుదారి బ్యూరో(నాబ్) తో విచారణ జరిపించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. బుధవారం కోర్టులో నాబ్ ఇద్దరు సాక్షులను హాజరుపరిచింది. సాక్షుల వాంగ్మూలం రికార్డుతో పాటు షరీఫ్, అతని కుటుంబీకులను డిఫెన్స్ లాయర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అక్రమాస్తులు కూడబెట్టి బ్రిటన్‌లో బినామీ పేర్లతో ఆస్తులు కలిగిఉన్న షరీఫ్ కుటుంబం మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. లండన్ లో నవాజ్ షరీఫ్ కుటుంబానికి చెందిన నాలుగు అపార్ట్ మెంట్లపై కేసు నమోదైంది. దీనిపై నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 1999లోనే విచారణ ప్రారంభించింది.

## విశాఖ స్టీల్ ఫ్యాక్టరీలో పెట్టుబడుల ఉపసంహరణకు గతంలోనే ఆమోదం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడుల ఉపసంహ రణ ప్రతిపాదనకు 2012లోనే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్ర ప్రాయంగా ఆమోదం తెలిపిందని ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణుదేవ సాయి వెల్లడించారు. అద్భుతమైన పనితీరుతో ప్రభుత్వ రంగంలో నవరత్నగా ప్రసిద్ధి చెందిన విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలో పెట్టుబడుల ఉపసంహరణకు కారణాలేంటని రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని అనుసరించి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వంద శాతం వాటాలో 10 శాతాన్ని పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించడం జరుగుతుందని విష్ణుదేవ అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో నష్టాలకు ప్రతికూల మార్కెటింగ్ పరిస్థితులు, ఉక్కు ఉత్పాదనల అమ్మకాలలో క్షీణత, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన బొగ్గు ధరలు, అంతర్జాతీయంగా ఉక్కు పరిశ్రమల్లో ఏర్పడిన మాంధ్యం ప్రధాన కారణాలలో కొన్ని అని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో దేశీయ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ విధించడం, ఉక్కు దిగుమతులకు కనీస ధరను నిర్ణయించడం, క్వాలిటీ కంట్రోల్ చర్యల ద్వారా ఉక్కు ఉత్పాదనలు, ప్రభుత్వ వినియోగం కోసం కొనుగోలు చేసే ఉక్కు ఉత్పాదనలన్నిటినీ తప్పనిసరిగా దేశీయ ఉక్కు పరిశ్రమల నుంచి మాత్రమే సేకరించే విధానాన్ని ప్రకటించడం వంటి పలు చర్యలను కేంద్రం చేపడుతున్నట్టు విష్ణుదేవ సాయి తెలిపారు.

## చేంజ్-4 ప్రయోగానికి చైనా సన్నాహం

**బీజింగ్:** అమెరికా, రష్యాలకు సాధ్యం కాని అరుదైన సాహస కార్యాన్ని సాధించేందుకు చైనా సిద్ధమవుతోంది. ఆ రెండు దేశాలు చంద్రుడిపై ఉన్న ఒక భాగంపైకే తమ స్పేస్‌క్రాఫ్ట్‌లను పంపించాయి. మనం భూమి మీది నుంచి ఎప్పుడూ చంద్రుడిలోని ఒకే భాగాన్ని చూస్తుంటాం. దానిపైకే అమెరికా, రష్యాలు తమ వ్యోమనౌకలను పంపాయి. కానీ చైనా మాత్రం ఇప్పటివరకు మనకు కనిపించని ఆ మరో భాగంపై తన రోవర్‌ను దించేందుకు సిద్ధమవుతున్నది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను గతంలోనే, 2016, డిసెంబర్‌లో చైనా వెల్లడించింది. 2018లో ఈ మిషన్‌ను లాంచ్ చేస్తామని తెలిపింది. చేంజ్ 4 ప్రాజెక్ట్‌లో భాగంగా చంద్రుడిపై ఉన్న మనకు కనిపించని భాగంపై తమ రోవర్‌ను దింపనున్నది. జూన్ 2018లో ఈ మిషన్‌కు సంబంధించిన తొలి ఘట్టం మొదలవుతుంది. చేంజ్ 4లో భాగంగా ఓ రిలే శాటిలైట్‌ను చంద్రుని వెనుక భాగంలో 60 వేల కిలోమీటర్ల దూరంలో ఉంచనున్నారు. ఆ కనిపించని భాగం గురించిన సమాచారాన్ని ఈ శాటిలైట్ భూమికి చేరవేస్తుంది.

## నా దగ్గరా అణు స్విచ్ ఉంది...

- కిమ్ వ్యాఖ్యలకు ట్రంప్ కౌంటర్
- కిమ్‌ను ఆకలికేకల పాలకుడిగా అభివర్ణన



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియాకు మరోసారి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. ఉత్తర కొరియా కంటే అతిపెద్దది, శక్తివంతమైన న్యూక్లియర్ బటన్ తన వద్ద ఉందని వ్యాఖ్యానించారు. అమెరికాను నాశనం చేయగల అత్యంత శక్తివంతమైన న్యూక్లియర్ బటన్ ఎల్లప్పుడు తన టేబుల్ పై ఉంటుందని.. ఒక్కసారి ఆ మీట నొక్కితే అమెరికా సర్వనాశనం అవుతుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఇటీవల వ్యాఖ్యానించడంపై ట్రంప్ స్పందిస్తూ.. ఉత్తరకొరియా నాయకుడు కిమ్ తన టేబుల్ పై ఎల్లప్పుడు న్యూక్లియర్ బటన్ ఉంటుందన్నారు. ఉత్తర కొరియాను క్షీణింపజేస్తూ.. ఆకలికేకల పాలన చేస్తున్న కిమ్ కు చెప్పండి నా దగ్గర అంత కంటే పెద్దది, శక్తివంతమైన న్యూక్లియర్ బటన్ ఉంది. అది కూడా పనిచేస్తుంది. అని హెచ్చరిస్తూ ట్వీట్ చేశారు. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఉత్తర కొరియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యాల నేపథ్యంలో ట్రంప్ దీటుగా బదులిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతూ ఉత్తర కొరియా దేశాన్ని పూర్తిగా నాశనం చేయడం తప్ప ..తమవద్ద మరే అవకాశం లేదని అన్నారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ట్రంప్ హెచ్చరికలపై ఉత్తరకొరియా దీటుగానే బదులిస్తోంది. గతేడాది నవంబర్ లో తమ దేశం అత్యంత శక్తివంతమైన ఖండాంతర క్షిపణిని ప్రయోగించిందని..

ఆ ప్రయోగం విజయవంతం కావడంతో అమెరికా మొత్తం తమ లక్ష్యం పరిధిలోకి వచ్చిందని కిమ్ వ్యాఖ్యానించారు. 2018 లోనూ తమ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండదని.. క్షిపణి ప్రయోగాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అణు యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరకొరియాతో చర్చలు జరిపేందుకు దక్షిణ కొరియా సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఐక్యరాజ్యసమితిలోని అమెరికా ప్రతినిధి నిక్కీహేలీ ఉత్తర కొరియాతో చర్చలు జరపబోమని ఇప్పటికే ప్రకటించారు. ఉత్తర కొరియా అణు పరీక్షలపై నిషేదం విధించేంతవరకు ఏ అంశాన్ని సీరియస్ గా తీసుకోమన్నారు. అమెరికా-ఉత్తరకొరియా మధ్య అణు ప్రయోగాల విషయంలో అనేక సార్లు రెండు దేశాధినేతలు వాగ్వాదానికి దిగారు. ఇటీవల అమెరికా మిలిటరీమాజీ చీఫ్ ఉత్తర కొరియాను హెచ్చరిస్తూ అమెరికా యుద్ధానికి సిద్ధమౌతోందని వ్యాఖ్యానించారు.

## కొత్త ఏడాది విశిష్ట కవలలు



**న్యూయార్క్:** ఒకే కాన్పులో, కొద్ది నిముషాల వ్యవధిలో జన్మించిన శిశువులను కవలలుగా పేర్కొంటాం. వీరికి పుట్టినరోజు, వారం, యేడాది ఒకేలా ఉంటుంది. కానీ, అమెరికాలో అరుదైన సంఘటన జరిగింది. వేర్వేరు సంవత్సరాలు, తేదీల్లో జన్మించిన శిశువులు విశిష్ట కవలలుగా గుర్తింపు పొందారు. 2017 చివరలో, 2018 ప్రారంభంలో జన్మించడం ద్వారా అరుదైన ఘనత దక్కించుకున్నారు. ఆ కవలల పేర్లు జొవాక్విన్, ఐటానా ఓంటివెరస్. నిజానికి వీళ్లు ఈ నెల 27న జన్మించాల్సి ఉంది. అయితే ఆ తల్లికి ముందుగానే నొప్పులు వచ్చాయి. సరిగ్గా డిసెంబర్ 31 రాత్రి నొప్పులు మొదలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్తే.. 20 నిమిషాల తేడాలో కవలలు జన్మించారు. జొవాక్విన్ డిసెంబర్ 31, 2017 రాత్రి 11:58కి జన్మించగా.. అతని చెల్లెలు జనవరి 1, 2018 12:16 గంటలకు జన్మించింది. ప్రతి వెయ్యి జననాల్లో కేవలం నాలుగింట్లో మాత్రమే ఇలా ఒకేలా ఉండే కవలలు జన్మిస్తారు. అందులోనూ ఇలా రోజులు, సంవత్సరాలు వేరు కావడం మరింత అరుదు.

## తమిళనాడులో రజనీ కమల్ మధ్య పోటీ



- పార్టీ పేరు, గుర్తుపై ఇంకా ఆలోచించలేదు: రజనీకాంత్
- ఎంజీఆర్- శివాజీ మధ్య పోటీని తలపిస్తుంది
- ద్రావిడియన్ స్కాలర్, రచయిత ఆర్ కన్నన్ విశ్లేషణ

**న్యూఢిల్లీ:** తమిళనాడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన రాజకీయ పార్టీకి పెట్టబోయే పేరు, పార్టీ గుర్తు పట్ల మళ్లీ సస్పెన్స్‌కు తెరలేపారు. నేను ఇప్పటివరకు ఏపేరును అనుకోలేదని రజనీ చెప్పారు. రజనీకాంత్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త పార్టీకి ఏ పేరు పెడుతున్నారని విలేకరులు ప్రశ్నించినప్పుడు పేరును ఏమీ అనుకోలేదు. పార్టీ ప్రారంభించినప్పడే పేరును కూడా ప్రకటిస్తామని తెలిపారు. ఎప్పటినుంచో రజనీ రాజకీయ ప్రవేశంపై దేశ వ్యాప్తంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో అందరి ఊహాగానాలకు తెరదించుతూ కొత్త సంవత్సరం తొలిరోజు తన రాజకీయ ప్రవేశంపై ప్రకటన చేశారు. ' నా విధి నిర్వహణను నేను పూర్తిచేస్తాను. వ్యవస్థను మార్చేందుకు ఇదే సరైన సమయం' అని రజనీ అన్నారు. రజనీ రాజకీయ ప్రవేశం ఖాయం కావడం ఆయన అశేష అభిమానుల్లో సంతోషాన్ని నింపింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అన్నిస్థానాలకు పోటీచేస్తుందని రజనీ ప్రకటించారు. సోమవారం పార్టీకోసం సభ్యుల నమోదుకోసం ఒక వెబ్‌సైట్‌ను రజనీకాంత్ ప్రారంభించారు. పార్టీ స్థాపనకు ముందే ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేపడతారా అన్న విలేకరుల ప్రశ్నకు రజనీ సమాధానమిస్తూ.. అది వచ్చే కాలానికి వదలివేస్తున్నానని చెప్పారు. 'ఒకేసారి అన్ని విషయాలను చెప్పడం సాధ్యం కాదు' అని రజనీ అన్నారు. జయలలిత మరణానంతరం రాష్ట్రంలో ముఖ్యంగా అధికార ఎఐఎడిఎంకెలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఇది రాష్ట్రానికి సిగ్గుచేటు ఇప్పుడు నేను నిర్ణయాన్ని తీసుకోకపోతే, ప్రజలను అవమానించినట్లవుతుంది. ఈ పాపం నన్ను వెంటాడుతుంది. ఈ నేపథ్యంలోనే నేను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించాను అని రజనీ వివరించారు.

### రజనీ- కమల్ మధ్య స్టార్స్ వార్

రజనీకాంత్ రాజకీయ ప్రవేశాన్ని కాంగ్రెస్, బీజేపీలు స్వాగతించాయి. మరోవైపు తమిళ సినీరంగంలో సుప్రసిద్ధ నటుడు కమల్ హాసన్ కూడా రాజకీయ ప్రవేశం చేస్తానని ప్రకటించాడు. ఈ పరిస్థితి నాలుగు దశాబ్దాల క్రితం తమిళనాడులో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటు న్నారు. అప్పటి కాలంలో ఎంజి రామచంద్రన్, శివాజి గణేషన్‌లకు భారీగా అభిమానుల ఫాలో యింగ్ ఉండేది. అయితే రాజకీయ రేసులో శివాజి చతికిల పడ్డాడు. ప్రస్తుతం ఇదే స్థాయి పోటీ వాతావరణం ఇద్దరు సూపర్ స్టార్ల మధ్య తలెత్తుతోంది. ఎంజిఆర్ సంక్షేమ పనులు ఆయనకు నిజాయతీ ఉన్న అభిమానులను సంపాదించిపెట్టా యి. శివాజీ ఈ దిశలో విఫలమయ్యాడని చెప్పుకో వచ్చు. శివాజీని తెరపై హీరోగా చూడడానికే అభిమానులు కోరుకున్నారు కాని రాజకీయ నేతగా ఒప్పుకోలేదు. రజనీ-కమల్ రాజకీయ ప్రవేశం కూడా ఇదేరీతిలో జరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంజీఆర్‌గా రజనీకాంత్- శివాజీగా కమల్‌హాసన్ రాజకీయ పాత్రలలోకి ప్రవేశిస్తారని విశ్లేషకుడు ఆర్ కన్నన్ చెప్పారు. కాగా కమల్ హాసన్ తెలివైన నిజాయతీగల వ్యక్తిత్వంతో అంతే అభిమానులను కలిగివున్నప్పటికి, రాజకీయాల్లో ఆయనకు కష్టమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ద్రావిడియన్ స్కాలర్, రచయిత ఆర్ కన్నన్ అంచనా.



### కరుణానిధితో రజనీ భేటీ

**చెన్నయ్:** దేశంలో అత్యంత ప్రముఖ రాజకీయ నాయకుడైన కరుణానిధి ఆశీస్సులు అందుకున్నానని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలిపారు. డీఎంకే అధినేత ఎం.కరుణానిధిని బుధవారం ఇక్కడి ఆయన నివాసంలో రజనీకాంత్ కలుసుకున్నారు. ఇరువురి భేటీలో కరుణానిధి కుమారుడు స్టాలిన్ కూడా పాలుపంచుకున్నారు. కుర్చీలో కూర్చొని ఉన్న కరుణానిధిని తమిళ తలైవా నవ్వుతూ పలకరించారు. సమావేశానంతరం రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూ కరుణానిధి ఆశీస్సులకోసం ఆయన్ను కలిసినట్టు తెలిపారు. తాను తాజాగా చేసిన రాజకీయ ప్రకటనను ఆయనకు వివరించానని, దేశంలో రాజకీయ పరిస్థితులపై ఇరువురం చర్చించుకున్నామని చెప్పారు. కలైజ్ఞర్‌తో భేటీ తనకు ఎంతో ఆనందకరంగా సాగిందని రజనీకాంత్ తెలిపారు.

## స్వచ్ఛతా యాప్‌కు ప్రతినెలా 2.30 లక్షల ఫిర్యాదులు

**న్యూఢిల్లీ:** స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతం కోసం 2016 ఆగస్టులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన యాప్‌కు సగటున ప్రతి నెలా 2.30 లక్షల ఫిర్యాదులు వస్తున్నాయనీ,2.10 లక్షల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి బుధవారం నాడు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు. పారిశుధ్యంపై ప్రజల్లో స్పృహను పెంచేందుకు ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసిందని ఆయన చెప్పారు.స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై ప్రధానమంత్రి మోడీఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని ఆయన చెప్పారు.

## రక్తదానం చేస్తే వేతనంతో కూడిన సెలవు

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ:** రక్తదానం చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయనున్నట్టు కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటివరకు పూర్తిగా రక్తదానం చేసిన వారికి సెలవు మంజూరు చేస్తుండగా ఇకపై రక్తంలోని కణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు వంటి వాటిని ఇచ్చే వారికి కూడా వేతన సెలవును వర్తింప జేయనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. గుర్తింపు పొందిన రక్తనిధి కేంద్రాల్లో పనిదినాల్లో దానం చేసే వారికి ఈ సెలవు (ఏడాదికి గరిష్టంగా 4రోజులు) వర్తిస్తాయని తెలిపింది.

## రన్‌వేను దాటి పక్కకు దూసుకుపోయిన విమానం

- గోవా విమానాశ్రయంలో ఘటన



**పనాజీ:** భారత నేవీకి చెందిన మిగ్-29కె విమానం గోవాలోని డాబోలిమ్ విమానాశ్రయంలో టేకాఫ్ అవుతుండగా అదుపుతప్పి రన్‌వేపై నుంచి పక్కకు ఒరిగింది. ఈ ఘటనతో విమానంలో భారీగా మంటలు వ్యాపించాయి. విమానం టేకాఫ్ అవుతుండగా ప్రమాదాన్ని ముందే ఊహించిన పైలట్ వెంటనే విమానం నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఇతర విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. ప్రస్తుతం విమానాశ్రయాన్ని మూసివేశారు.

## కాక్‌పిట్‌లో పైలెట్లు కొట్టుకున్నారు

**న్యూఢిల్లీ:** విమానం కాక్‌పిట్‌లో కొట్టుకున్న ఇద్దరు పైలెట్లను విధుల నుంచి తొలగించినట్టు జెట్ ఎయిర్‌వేస్ బుధవారం తెలిపింది. ఈ నెల ఒకటవ తేదీన లండన్ నుంచి ముంబై బయలుదేరాల్సిన విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మరికొద్ది సేపట్లో విమానం బయలుదేరుతుందనగా కాక్‌పిట్‌లో ఉన్న ఇద్దరు పైలెట్లు పరస్పరం భౌతిక దాడికి పాల్పడ్డారు. అయితే అపార్థం చోటు చేసుకున్న కారణంగా వారిద్దరూ గొడవపడ్డారు. ఆ తర్వాత పైలెట్లు సామర స్యపూర్వకంగా రాజీపడటంతో విమానం యధావిధిగా ముంబైకి బయలుదేరింది. అనంతరం ఆ వ్యవహారం జెట్ ఎయిర్‌వేస్ మేనేజ్‌మెంట్ దృష్టికి రావడంతో ఇద్దరు సీనియర్ పైలెట్లను విధుల నుంచి తొలగించారు. ఆ సంఘటనను పౌరవిమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ)కు నివేదించడం జరిగింది. సంబంధిత సిబ్బందిని విధుల నుంచి తొలగించడం జరిగింది. అంతర్గత దర్యాప్తు కొనసాగుతోందని జెట్ ఎయిర్‌వేస్ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఇండియా-ఇజ్రాయెల్ రక్షణ ఒప్పందం రద్దు

**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెహన్యాత్యూ మనదేశంలో పర్యటించనున్న వేళ భారత్- ఇజ్రాయెల్ కు గట్టి షాక్ ఇచ్చింది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేయాలనుకున్న 500మిలియన్ డాలర్ల విలువైన 1600 స్పైక్ యాంటీ ట్యాంక్ గైడ్ మిస్సైల్స్ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. ఈ మిస్సైల్స్ కు సంబంధించి నపూర్తిస్థాయి టెక్నాలజీ పంచుకునేందుకు ఇజ్రాయెల్ ఒప్పుకోకపోవడం వల్లే ఒప్పందం రద్దయినట్లు తెలుస్తోంది.అదే సమయంలో 70 మిలియన్ డాలర్ల విలువైన 131 ఉపరితలం- గగనతలానికి ప్రయోగించగల బరాక్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసింది. భారత్ తో ఒప్పందం రద్దుపై ఇజ్రాయెల్ రక్షణ సంస్థ రాఫెల్ విచారం వ్యక్తం చేసింది. ఒప్పందం రద్దయినప్పటికీ తమదేశ రక్షణ వ్యవస్థ నుంచి భారత్ కు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొంది. భారత్ కొనుగోలు చేయదలిచిన స్పైక్ యాంటీ ట్యాంక్ గైడ్ మిస్సైల్స్ కదులుతున్న లక్ష్యాన్ని కూడా ఛేధించగలవు. అయితే ఒక్క మిస్సైల్‌ను ఒక్కసారి మాత్రమే ప్రయోగించగలము..దీంతో టెక్నాలజీని పంచుకోవాలని భారత్ ఇజ్రాయెల్ ను కోరింది. మిస్సైల్ టెక్నాలజీ పంచుకునేందుకు ఇజ్రాయెల్ ససేమిరా అనడంతో ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. భారత రక్షణ సంస్థ డీఆర్‌డీవో నాలుగేళ్లలో ప్రపంచ స్థాయి క్షిపణులను అందిస్తామని హామీ ఇవ్వడం కూడా ఒప్పంద రద్దుకు ఓ కారణంగా అధికారులు చెబుతున్నారు. స్పైక్ మిస్సైల్ కు సంబంధించిన చర్చలు పూర్తవడంతో ఇజ్రాయెల్ సంస్థ రాఫెల్ హైదరాబాద్ సమీపంలో కళ్యాణి గ్రూప్ సహకారంతో జాయింట్ వెంచర్ మిస్సైల్ తయారీకేంద్రాన్ని నిర్మించింది.

# తలాక్.. బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. అయితే పార్లమెంటు రబ్బర్ స్టాంప్ కాదని, తమ పార్టీ వైఖరిని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ సమర్థించుకున్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపాదనకు 17 పార్టీల మద్దతు ఉందని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. అన్నాడీంకే, బీజేడీ, టీడీపీ సైతం ఈ డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని చెప్పారు. అయినా ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదని విమర్శించారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో స్పష్టత లేదని, దీనిని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందేనని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో అడ్డుపడడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ముస్లిం మహిళలకు న్యాయం చేసేందుకు వచ్చిన సువర్ణ అవకాశాన్ని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని బట్టే కాంగ్రెస్ పార్టీ ట్రిపుల్ తలాక్ బిల్లుకు వ్యతిరేకమని తేలిపోయిందని చెప్పారు. ఇప్పటికీ దేశంలో ట్రిపుల్ తలాక్ కేసులు నమోదవుతూనే ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. దీనిపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగాలేదని విమర్శించారు. బిల్లును పెండింగ్‌లో పెట్టేందుకు, కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. ముస్లిం మహిళలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని న్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు మహిళల గౌరవ ప్రతిష్టలను పెంచేదని అన్నారు. సుప్రీంకోర్టు సైతం ట్రిపుల్ తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధమని తేల్చిందని, దీనిపై చట్టం చేయాలని సూచించిందని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం సూచనమేరకే తాము బిల్లును తయారు చేశామని అన్నారు. ఈ బిల్లుకు అడ్డుపడడం సరైన చర్య కాదన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కాంగ్రెస్ పార్టీ అంటోంది. అయితే అందులోని కొన్ని అంశాలపై అభ్యంతరాలున్నాయని, అందుకే విస్తతంగా చర్చించేందుకు సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతున్నామని అంటోంది.

వివాహం అనేది సివిల్ అంశమని, దానిని క్రిమినల్ అంశంగా మార్చడం సబబు కాదని చెపుతోంది. అలాగే తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష వేయాలని ప్రతిపాదించడం కూడా సరైంది కాదని అంటోంది. భర్త జైలుకు వెళితే, భార్య, పిల్లల పోషణ భారం ఎవరు చూస్తారని ప్రశ్నిస్తోంది. కోరెగావ్ అల్లర్ల అంశం లేవనెత్తి ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

అధికార, విపక్షాలు ఎవరూ పట్టువీడక పోవడంతో రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న నోటీసుపై ఓటింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అదే సమయంలో న్యాయశాఖ మంత్రి మాట్లాడేందుకు ప్రయత్నించడంతో ఇరుపక్షాలు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దాంతో డిప్యూటీ చైర్మన్ కురియన్ సభను గురువారానికి వాయిదా వేశారు. పార్లమెంటు సమావేశాలు శుక్రవారం ముగియనుండడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ బిల్లు పాస్ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## సెలెక్ట్ కమిటీకి నివేదించాలి



ముస్లిం మహిళలకు న్యాయం జరగాలంటే ట్రిపుల్ తలాఖ్ బిల్లును సెలక్ట్‌కమిటి లేదా పార్లమెంట్ స్టాండింగ్ కమిటికి నివేదించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ముఖ్దూమ్‌భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ట్రిపుల్ తలాఖ్ బిల్లు మంచిదే అయిన ప్పటికి ప్రమాదకరమైన నిబంధనల వల్ల ఉద్దేశ్యం నేరవేరదని, ఒక మతం పట్ల వివక్షగానే చూడబడుతోందని పేర్కొన్నారు. ట్రిపుల్ తలాఖ్ బిల్లును తమ పార్టీ ఎన్నడూ కూడా వ్యతిరేకించలేదన్నారు. ఒకే దేశం ఒకే పౌర సత్వం అంటున్న బీజేపీ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్ విషయంలో మూడేళ్ల శిక్ష అనడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మహారాష్ట్రలో దళితులు ఆందోళనకు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన మెడికల్ బిల్లు వైద్య వృత్తిని, మెడికల్ ఆసోసియేషన్ విధ్వంసం చేసి సంఘపరివారితో నింపాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మంద కృష్ణమాదిగపై అక్రమ కేసులు పెట్టడం దళితులను అణిచివేడయంలో భాగమేనని సురవరం తెలిపారు. పార్లమెంట్‌లో చట్టసవరణ చేయాలని, కృష్ణమాదిగ ను వెంటనే విడుదల చేయాలని ఆయన డివూండ్ చేశారు. తెలంగణ కోసం దళితులు త్యాగం చేసిన విషయం మర్చిపోవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి అన్నారు.

## రాజ్యసభలోనూ ఆమోదం పొందుతుంది: బీజేపీ



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధానాల వల్ల దేశం ప్రగతి దిశగా అడుగులు వేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ వర్గీయ అన్నారు. ప్రపంచ దేశాల్లో పాకిస్తాన్‌ను ఒంటరిగా చేశామని, ఇప్పుడు ఆదేశానికి మద్దతుగా ఎవరూ కూడు ముందుకు వచ్చే సాహం చేయడం లేదన్నారు. ట్రిపుల్ తలాఖ్ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందుతుందనే నమ్మకం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు వల్ల దేశంలోని 8 కోట్ల మంది మహిళల ఆత్మగౌరం పెరిగిందన్నారు. బుధవారం ఆయన బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎల్పీ నేత కిషన్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 2019 లోనూ తెలంగాణాలోనూ అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రనాయకత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మతం ఆధారంగా ఇచ్చేరిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేక మన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడిపై వచ్చిన ఆరోపణలు కోర్టులో ఉన్నాయని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. బయటి వ్యక్తుల వల్లే మహారాష్ట్రలో హింస జరిగిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పడ్నవిస్ చెప్పారని విజయ వర్గీయ తెలిపారు. మంద కృష్ణను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదాకాలు ఇవ్వడమే అవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఉద్యమం మరింత ఉధృతం అవుతుందనే విషయం సీఎం కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. ఎబీసీడీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

## హైకోర్టు విభజనకు
# కసరత్తు ముమ్మరం
### ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల సమావేశం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఉమ్మడి హైకోర్టు విభజనకు సమయం ఆసన్నమైంది. అమరావతిలో ఏపీ హైకోర్టును తాత్కాలికభవనంలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి హైకోర్టులో విభజన వాదం మొదలయ్యింది. ఉమ్మడి హైకోర్టు తాత్కా లిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో న్యాయమూర్తుల (ఫుల్ కోర్టు) సమావేశం బుధ వారం గంట పాటు జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా హైకోర్టులు వచ్చే జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అమరా వతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకోసం అవసరమైన భవనాలను పరిశీలించేందుకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ త్వరలో న్యాయమూర్తులతో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. న్యాయమూర్తుల కమిటీ ఏపీకి వెళ్లి అక్కడి భవనాలను పరిశీలించి హైకోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాన్ని పరిశీలించి ఎంపిక చేసి తుది నిర్ణయాన్నిజనవరి చివరి వారంలోగా తెలియజేస్తే జూన్‌లో హైకోర్టు ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేసుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ లేఖను ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కి గత శనివారం అందజేశారు. ఏపీ ప్రభుత్వం గుర్తించిన కొన్ని భవనాలను జడ్జీల కమిటీ పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, మార్పులు చేర్పులు చేసేందుకు తగు సూచనలు చేస్తుంది. జడ్జీల కమిటీ సూచనలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం భవనాన్నిఏప్రిల్, చివరి వారంలో సిద్ధం చేసేందుకు, వేసవి సెలవుల్లో ఫైళ్లు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ఏపీ హైకోర్టుకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న హైకోర్టుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి కక్షిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏపీ హైకోర్టును అమరావతి ప్రాంతంలోని తాత్కాలిక భవనంలో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం హైకోర్టు అవసరాలకే కాకుండా న్యాయమూర్తులు, సిబ్బంది నివాసాలకు కూడా తగిన భవనాలు అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి హైకోర్టు విభజనపై తెలంగాణ ప్రభుత్వం , న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి. అయితే అప్పట్లో ఏపీ అంతగా సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం, భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఆలస్యమైంది. అయితే తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ప్రత్యేక హైకోర్టు చేసేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. ఇటు తెలంగాణ హైకోర్టు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌ను కలిసి హైకోర్టు విభజనపై చర్చించినట్లు తెలిసింది.

# ఫేస్‌బుక్ 'చేయూత'

• ఆపదలో చేయిచేయి కలిపి సహాయం




**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఓ మహిళ ఎమ్ఎమ్‌టీఎస్ రైలెక్కారు. మార్గమధ్యంలో ఓ స్టేషన్ దగ్గర ఆమె రైలు నుంచి జారి పడి పోయారు. తలకు తీవ్రమైన గాయాల య్యాయి. వెంటనే అక్కడి వారు స్పందించి, ఆమెను యశోదా ఆస్పత్రికి చేరారు. ఈ విషయం ఎలాగో ఆమె భర్త ఫేస్‌బుక్ ఫ్రెండ్‌కు తెలిసింది. వెంటనే ఆయన విషయాన్ని తెలుపుతూ పోస్టింగ్ పెట్టారు. అంతే ఆ వార్త ఫేస్‌బుక్‌లో దావాన లంలా వ్యాపిం చింది. ఒకరి వెంట ఒకరు చకచకా తమకు తెలు సున్న వారికి తెలియ జేస్తూ ఆమె భర్త ఎక్కడున్నారో కను క్కోవడంలో నిమ గ్న మయ్యా రు. ఆఖరుకు తెలిసింది. భర్త ఆమెను చేర్చిన ఆస్పత్రికి చేరుకున్నారని. ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌లో చేయూత అనే స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్న పద్మ ఎమ్వీఎస్‌కు ఈ సంగతి తెలిసింది. ఆమె తమ సంస్థ సభ్యులను అప్రమత్తం చేశారు. కార్యదర్శిని ఆస్పత్రికి పంపారు. ఈ అప్రమత్తతో ఆ సంస్థ సభ్యులు అనేకమంది ఆస్పత్రికి చేరుకున్నారు. ఐసీయూలో ఉన్న ఆమెను చూసేం దుకు ప్రయత్నించారు. భర్తతో వూట్లాడారు. చేయూత జాయింట్ సెక్రటరీ సునీత దగ్గరుండి వారికి కావాల్సిన సౌకర్యాలను సమకూర్చారు. ప్రముఖ జ్యోతిశ్శా స్త్రవేత్త గుమ్మా రామ లింగస్వామి కూడా తన టైంలైన్‌పై ఈ అంశాలను షేర్ చేస్తూ వచ్చారు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుపుతూ పద్మ పోస్టులు పెడుతూ వారి స్నేహితులకు సమాచారాన్ని అందజేశారు. చికిత్స పొందుతున్న మహిళ కోలుకుంటున్నారు. ప్రమాద కర పరిస్థితి నుంచి బయట పడ్డారని వైద్యులు తెలపడంతో స్నేహితులంతా సంతో షంలో మునిగితేలారు. ఆ మహిళ పేరు సరస్వతి. ఆమె భర్త పేరు భాస్కరానంద. శ్రీకాళహస్తిలో ఉంటారు.

ఏదో పని పై హైదరాబాద్ వచ్చి, ప్రమా దంలో చిక్కు కున్నారు. ఫేస్‌బుక్ స్నేహితుల సాయంతో స్వాంతన పొందారు. సాధారణంగా ఫేస్‌బుక్ ఆవేశకావేషాలకు, అసభ్య దూషణలకూ, ఎత్తి పొడుపులకూ, వ్యక్తిగత కోపతా పాలను తీర్చుకోవడానికి వేది కవుతూ వస్తోంది. పై సంఘటన తెలిసిన తరవాత, ఫేస్‌బుక్ స్నేహితులు ఆపత్కాలంలో ఎంత వేగంగా స్పందిస్తారో తెలియ జేసింది. మానవీయ కోణాన్ని ఆవిష్కరించింది. ఈ క్రతువులో వెంపటి సతీష్, జయంతి ప్రసాద్ తమ వంతు కృషి చేశారు. ప్రమాదం సంగతి తెలియగానే ఆయన మిత్రులు స్పందించిన తీరు అపూర్వం. ప్రతి ఒక్కరూ అన్ని సందర్భాలలో ఇలాగే స్పందిస్తే సగం సమస్యలు వాటంతటవే పరిష్కారమవుతాయి.

# సీమ ఇక సస్యశ్యామలం

• హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నాం • కరవులేని కడపగా చేస్తా
• 42 టీఎంసీల సాగునీరిస్తున్నాం • రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు • డ్వాక్రా మహిళలు నా మానస పుత్రికలు • పులివెందుల జన్మభూమిలో చంద్రబాబు

**కడప, ప్రభన్యూస్ బ్యూరో:** కడప జిల్లాలో ఇకపై కరువు అనేదే ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన జన్మభూమి - మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గండికోట నుంచి జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సుమారు 42 టీఎంసీల నీటిని అందిస్తున్నామని చెప్పారు. అందులోభాగంగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వా యర్‌కు 5 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. కడప జిల్లాలో ఒక చరిత్ర సృష్టించామని , భవిష్యత్‌లో సాగునీటితో అత్యధికంగా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఉంటుందన్నారు. లింగాలలో నాణ్యమైన అరటి పంట సాగు ఉందని చెప్పారు. రాయలసీమ ప్రపంచంలోనే ఒక హార్టికల్చర్‌హబ్‌గా మారనుందని పేర్కొన్నారు. రాయలసీమ తిరుగులేని ఆర్థికశక్తిగా ఎదగనుందని తద్వారా ఒక మణిహారంగా నిలువ నుందని చెప్పారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.50వేల కోట్లను ఖర్చు చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గోదావరి , పెన్నా నదుల అనుసంధానంతో సోమశిలను నింపవచ్చన్నారు. దీంతో కడప జిల్లాలో పూర్తిగా కరువు ఛాయలను పారదోలవచ్చని చెప్పారు. జన్మ భూమి - మా ఊరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని పిలుపు నిచ్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా హామీ ఇచ్చిన మేరకు రూ.24వేల కోట్లతో రైతులను రుణవిముక్తి చేయడం జరిగిందన్నారు. మూడో విడత రుణ మాఫీకి సంబంధించి నాలుగు రోజుల్లో పూర్తిగా జమ చేయడం జరుగుతుందని చెప్పారు. డ్వాక్రా సంఘాలు తానే ఏర్పాటు చేశానని , ఈ సంఘాలు తన మానసపుత్రిక అని సీఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.6 వేలు పెట్టుబడి నిధిని అందించామని త్వరలోనే మిగిలిన రూ.4 వేలు కూడా అందజేస్తామన్నారు. ప్రజలకు సమస్యలు పరిష్కారం కానప్పుడు 1100 కు ఫోన్ కాల్ చేసి తెలియజేవచ్చన్నారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా 10 అంశాలను ఒక్కొక్క రోజు ఒక అంశాన్ని చర్చించడం జరుగుతోందని చెప్పారు. రెండవ రోజు ఆరోగ్యం-ఆనందం అనే అంశాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే చేసే పనిలో ఫలితం ఉంటుందన్నారు. తాను చేసే పనిలో ఆనందం పొందడం వల్లే విసుగు,




విరామం ఉండదని చెప్పారు. ప్రతి ఒక్కరూ మంచి పనులు చేయాలన్నారు. ఈ ప్రభుత్వం ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. 2022కు దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒక్కటిగా , 2029కి దేశంలోనే నెంబర్1 రాష్ట్రంగా, 2050కి ప్రపంచంలోనే ఒక అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతామన్నారు. 30,35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రను నియమించడం జరుగుతోందని , ఈ మిత్రలకు పేదలకు సేవ చేసే అవకాశం దక్కిందన్నారు.

జన్మభూమి - మా ఊరు గ్రామసభలో వచ్చే సమస్యలను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ వారికి ఇంటి పట్టాలులేవని, అలాంటి వారికి 50 వేల వరకు పట్టాలుఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పలువురు భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ వారికి భూమి పట్టాలు లేవని అలాంటి వారికి 20 లక్షల ఎకరాల వరకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ జన్మ భూమిలో 4 లక్షలకు పైగా ఫించ న్లు, 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నా మన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత 2.50 లక్షల గృహ ప్రవేశాలు చేయడం జరుగు తుందని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 15 వేల కిలో మీటర్ల సీసీ రోడ్లను నిర్మించడం జరిగిం దని, 9 లక్షల ఫారంపాండ్లు పూర్తి చేశామని తెలిపారు. మార్చిలోపు ఈ -ఆఫీసు ప్రవేశపెడుతున్నామని ఎక్కడా ఏ ఫైల్ పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరిం చారు. 5 వేల వర్చువల్ క్లాస్ రూమ్‌లు ప్రవేశపెడు తున్నామని చెప్పారు. దీని ద్వారా నాణ్య మైన విద్యను అందించడం జరుగుతుందన్నారు.

పులివెందుల నియోజక వర్గంలో మొత్తంఇప్పటి వరకు 27 వేల ఫించన్లు అందిస్తున్నామని ప్రకటించారు. ఈ జన్మభూమిలో మరో 2 వేల ఫించన్లు మంజూరు అయ్యాయనిచెప్పారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ ఎస్‌వి సతీష్‌రెడ్డి మరో 1600 ఫించన్లు మంజూరు చేస్తే ఈ ప్రాంతంలో వందశాతం ఫించన్లు అందించిన వారం అవుతామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన సీఎం అక్కడికక్కడే మంజూరు చేస్తున్న ప్రకటించారు. పులివెందుల అభివృద్ధి పనుల కోసం వివిధ కార్యక్రమాల కింద సుమారు రూ.47 కోట్లను అప్పటి కప్పుడు మంజూరు చేస్తున్నట్లు సీఎం సభాముఖంగా ప్రకటించారు. హిజ్రాలకు రుణాలను మంజూరు చేశారు.

## టీఎస్-ఐపాస్ పనితీరు అద్భుతం
### కేటీఆర్‌కు సందేశం పంపిన పారిశ్రామికవేత్త

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పారిశ్రామిక వర్గాల నుంచి ప్రభుత్వ విధానాలపై వచ్చే సానుకూల అభిప్రాయాలు పనిచేసేందుకు స్ఫూర్తినిస్తుందని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంవైపు పనిచేందుకు ఇది దోహద పడుతుందని అన్నారు. టిఎస్-ఐపాస్ పనితీరుపై కేటీఆర్‌కు డెల్ ఎక్సెల్ ఫార్మా సీఈవో రఘుపతి కందారపు మంత్రికి ఒక సందేశం పంపారు. గతంలో వివిధ కంపెనీల్లో పనిచేసిన రఘుపతి సొంతగా పరిశ్రమను ఏర్పాటుకు చేసిన ప్రయత్నాల్లో ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలతో తన అనుభవాన్ని మంత్రితో బుధవారం పంచుకున్నారు. తాను గతంలో 15 ఏళ్ళపాటు అనేక కంపెనీల్లో ఫార్మా రీసెర్చ్ విభాగానికి అధినేతగా పనిచేశానని, తనకు ఇంతటి సులభమైన, పారదర్శక అనుభవం ఎప్పుడూ కలగలేదన్నారు. 2016, జూన్‌లో టిఎస్-ఐపాస్ ద్వారా అనుమతులు అందుకున్న తాను తన ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేసి, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులను డ్రగ్ లైసెన్స్ కోసం కలిసినట్టు తెలిపారు. గతంతో పోల్చితే ఈ డ్రగ్ లైసెన్సింగ్ విధానం అత్యంత సులువుగా, పారదర్శకంగా ఉందన్నారు. డ్రగ్ లైసెన్సింగ్ విధానం నిజానికి క్లిష్టమైన ప్రక్రియ అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ ప్రక్రియ అత్యంత సులభంగా ఉందన్నారు. తాను కేవలం వారం రోజుల్లో తనకు లైసెన్స్ రావడంపట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఇంతటి సులభమైన విధానంలో, పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇచ్చిన అధికారులకు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి రఘుపతి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కేటీ రామారావు వల్లే ఇది సాధ్యమవుతుందని, ఆయన పనితీరే తమకు స్ఫూర్తిగా నిలుస్తుందని అధికారులు తనకు తెలిపారని, ఇంతటి స్ఫూర్తివంతమైన నాయకత్వానికి రఘుపతి పంపిన సందేశంలో మంత్రికి అభినందలు పేర్కొన్నారు. ఈ మార్పునకు కారణమైన ప్రభుత్వం ఇదే తీరుతో ముందుకు సాగాలని రఘుపతి ఆకాంక్షించారు. కంపెనీ సీఈవో రఘుపతి పంపిన సందేశానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమ స్థాపన, ఉద్యోగాల కల్పన చేయాలన్న తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఫీడ్‌బ్యాక్ స్ఫూర్తినిస్తుందని మంత్రి అన్నారు.

## మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా కమరుద్దీన్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. కమిషన్ చైర్మన్‌గా మహ్మద్ కమ రుద్దీన్, వైస్ చైర్మన్‌గా రాజారాపు ప్రతాప్‌ను నియమించింది. సభ్యులు గా మహ్మద్ హర్షాద్ అలీ ఖాన్, డాక్టర్ విద్యా శ్రవంతి, గుస్టీ నోరియా, బొమ్మల కట్టయ్య, సురేందర్‌సింగ్‌లు నియమితులయ్యారు. కమిటీ మూడేళ్ల పాటు పని చేయనుంది. ఈ కమిషన్ మైనార్టీల ఆర్థిక, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయనుంది.



## గిరిజన కుంభమేళాకు రండి
### ఉపరాష్ట్రపతికి తెలంగాణ సర్కార్ ఆహ్వానం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సమాయత్తంగా ఉందని తెలంగాణా దేవాదాయ శాఖా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాం నాయక్, నగేష్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి బుధవారం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుణ్ని మర్యాదపూర్వకంగా కలిశారు. జాతరకు తప్పకుండా రావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. శరవేగంగా జరుగుతున్న జాతర ఏర్పాట్లను వెంకయ్యకు వివరించారు. అనంతరం ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణా భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో మీట్ ది ప్రెస్‌లో పాల్గొన్నారు. 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే జాతరకు ఉప రాష్ట్రపతిని ఆహ్వానించినట్టు పాత్రికేయులకు తెలిపారు. గిరిజన బిడ్డలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించేందు కు కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని ఉపరాష్ట్రపతిని కోరినట్లు ఇంద్రకరణ్ చెప్పారు. జాతరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఆ ప్రాంతానికి నాలుగు లైన్ల రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినట్టు ఇంద్రకరణ్ అన్నారు. జాతర ప్రాంతంలో ప్రత్యేకంగా ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీవీఐపీలు రోడ్డు మార్గంలో రావడం వల్ల భక్తులకు ఇబ్బం దులు తలెత్తుతుండడంతో వారి కోసం రెండు హెలిప్యాడ్లను సిద్ధం చేశామని చెప్పారు. ఫ్రీ వైఫై, మంచినీరు, స్వచ్ఛతను ప్రధానాంశాలుగా పరిగణిస్తు న్నామ ని ఇంద్రకరణ్ అన్నారు. సమ్మక్క సారలమ్మలకు ప్రీతి పాత్రమైన బెల్లం ప్రసాదం కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణ అభివృద్ధికి చేయూతివ్వండి

### కేంద్రమంత్రులకు మంత్రి జోగురామన్న విజ్ఞప్తి





**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** తెలంగాణ అభివృద్ధిలో కీలకమైన పలు ప్రాజెక్టులు, నిధుల విడుదలకు సంబంధించి తాము చేసిన విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖా మంత్రి జోగు రామన్న తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, పార్లమెంట్ సభ్యులు నగేష్, సీతారాం నాయక్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. తెలంగాణాకు సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులపై వారితో చర్చించారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని గురజాడ సమావేశ మందిరంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర మంత్రి మహేశ్ శర్మను కలిసి ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాలపై చర్చించామని అన్నారు. ఇందు కోసం రూ.185 కోట్ల నిధులు అవసరమంటూ కేంద్రానికి తెలంగాణా సర్కార్ ప్రతిపాదనలు సమర్పించిందని, కేంద్ర వాటా రూ.125 కోట్లను త్వరగా విడుదల చేయాలని కోరినట్టు మంత్రి తెలిపారు. మిగిలిన వాటాలో రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు, అంకుశ్ స్వచ్ఛంద సంస్థ ఇచ్చే రూ.20 కోట్ల నిధులతో ప్రాజెక్ట్ పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు.

కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లో క్యాటగిరి వన్ విభాగంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామని జోగు రామన్న తెలిపారు. రాష్ట్ర విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మహేశ్ శర్మ ఫిబ్రవరి 6న హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ అంశాలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.

అనంతరం సామాజిక, న్యాయ శాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్‌తో బీసీ వర్గాల సమస్యలు, స్కాలర్ షిప్‌లపై చర్చించినట్లు మీడియాకు చెప్పారు. కొత్తగా 15 బీసీ హాస్టళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు గతంలోనే కేంద్రానికి పంపామని, అందుకు సంబంధించిన నిధులు, అనుమతులు త్వరగా విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లను త్వరగా కేటాయించాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశామని జోగు రామన్న వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 113 బీసీ కులాలు ఉన్నాయని, ఇందులో కేవలం 85 కులాలను మాత్రమే ఓబీసీగా గుర్తించారని, మిగిలిన కులాలను ఓబీసీలుగా గుర్తించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి అన్యాయం జరుగుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఆయన అన్నారు. అయితే ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ త్వరలోనే ఓబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారని వివరించారు.

ఓబీసీ కమిషన్ ఏర్పాటుతో ఓబీసీల సమస్య పరిష్కారమవుతుందని థావర్ చంద్ హామీ ఇచ్చారని జోగు రామన్న తెలిపారు. అనంతరం రాష్ట్ర పర్యాటక అభివృద్ధిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ఆల్ఫాన్స్‌తో చర్చించామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని... జాతీయ, అంతర్జాతీయ సందర్శకులను ఆకర్షించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా కుంటాల, పొచ్చెర జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించి అభివృద్ధి చేయడానికి సంబంధించిన రూ.141 కోట్లతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి గతంలో పంపామని మంత్రి గుర్తు చేశారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్ గీతేతో రాష్ట్రంలోని భారీ పరిశ్రమల అభివృద్ధి అంశాలపై చర్చించామని వివరించారు. రామగుండం ఫెర్టిలైజర్, సీసీఐ ఏర్పాటుపై చర్చించామని, ఈ రెండు అంశాలను త్వరలోనే పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని జోగు రామన్న వెల్లడించారు.

# నేర రహిత తెలంగాణే లక్ష్యం

**● డిసెంబర్‌లోగా కమాండ్ కంట్రోల్ సెంటర్ పూర్తి ● హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ ప్రారంభంలో డీజీపీ మహేందర్‌రెడ్డి**



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ మహేందర్ రెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ క్రమంలో 99.9 శాతం నేర నివారణే లక్ష్యంలో భాగంగా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యా లయంలో టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్‌ని డీజీపీ మహేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టెక్నాలజీ ఓ ఫోర్స్‌మల్టీప్లేయర్

99.9 శాతం నేర నివారణే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టెక్నాలజీని వినియోగించడం ద్వారా సమయం కూడా ఆదా అవుతుందన్నారు. గతంలో ఏదైనా నేరం జరిగితే ఆ నేరం ఎవరు చేశారు? ఇత్యాది విషయాల కోసం పోలీస్ స్టేషన్‌కు పరుగులు పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి ఉండదు. ఆయా ప్రాంత పరిధిలో ప్రతి సిబ్బంది చేతిలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన నేర సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. దీంతో చాలా తేలికగా వారు స్పాట్‌కు చేరు

### టెక్నాలజీతో సమయం ఆదా

కునేలోపే అందుకు తగిన సమాచారం పొందుతారు. అదీగాక ఇన్‌టైమ్‌లో స్పాట్‌కు చేరుకుంటారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా కష్టపడాలని, టెక్నాలజీ పరంగా ఉన్న ప్రతి విషయాన్ని ఆకళింపు చేసుకోవడంలో సిబ్బంది పరిణతి సాధించాలన్నారు. 20 అంతస్తుల కమాండ్ కంట్రోల్ సెంటర్ పూర్తయి ఫంక్షనింగ్‌కు వచ్చేలోగా సిబ్బంది టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో పూర్తిస్థాయి నైపుణ్యతను కలిగి ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరగలదన్నారు. శాంతిభద్రతలు సజావుగా వున్నప్పుడే పెట్టుబడిదారులు తరలివస్తారని, హైదరాబాద్‌లోనే కాక మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా పెట్టుబడులు వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు.

పనిచేస్తుందన్నారు. ఈ టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్‌లో వీడియో సర్వైలెన్స్ సెక్యూరిటీ కమాండ్ సెంటర్, ట్రాఫిక్ కమాండ్ సెంటర్, ఫేసియల్ రికగ్నిషన్, ఎనలటిక్స్ అండ్ వీడియో ఎన్‌హాన్స్‌మెంట్ యూనిట్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ యూనిట్ (డయల్ 100/112), సోషల్ మానిటరింగ్ యూనిట్, ట్రాఫిక్ సిగ్నల్ మేనేజ్‌మెంట్ యూనిట్, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్‌లు మిళితమే ఉంటాయన్నారు. ఆయా విభాగాలలో అందుకు సంబం ధించిన డేటా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఎక్కడా ఎలాంటి ఘటన జరిగినా క్షణాల్లో అక్కడికి చేరుకునే విధంగా ఫీల్డ్ ఆఫీసర్‌లకు సమాచా రాన్నందించడం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, మిగతా పోలీస్ కమిషనరేట్ల పరిధిలోనూ.. జిల్లా హెడ్ క్వార్టర్స్ లో ఈ టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ లను నెలకొల్పడం జరుగుతుం దన్నారు. ఈ ఏడాది డిసెంబర్ లో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని 20 అంతస్తుల కమాండ్ కంట్రోల్ సెంటర్ ఈ ఏడాది డిసెంబర్‌కల్లా పూర్తవుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో నేను సైతం ప్రాజెక్టు ద్వారా పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం గా పెట్టుకున్నామన్నారు. హైదరాబా ద్‌లో అమలయ్యే సంస్కరణలన్నింటినీ జిల్లాల కు విస్తరించడంతో పాటు నేను సైతం ప్రాజెక్టు ద్వారా ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పా టు సాధన దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది టెక్నాలజీ ఇయర్‌గా ప్రకటిం చుకున్నా మని, అందులో భాగంగా ఇటీవల హైదరాబాద్ కాప్ సక్సెస్ దరిమిలా రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ కాప్‌ని విస్తరించామన్నారు. 54 సర్వీసులతో ఈ టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్ ప్రారంభించుకున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పూర్త య్యేలోగా టెక్నాలజీ పరంగా సిబ్బందిని ఆ దిశగా తీర్చిదిద్దడం జరుగుతుందని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభమైన వెంటనే ఈ టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్లన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం కానున్నాయి. ఈ లోగా సిబ్బందిని ఆ దిశగా కార్యోన్ముఖులను చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభమైన వెంటనే పనిచేసే విధంగా చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఒక సీసీ కెమెరా వందమంది కానిస్టేబుళ్లతో సమానమని ఆయన పునరుద్ఘాటించారు. ట్రాఫిక్ విషయానికొస్తే ఆ పని మరింత సులభమవుతుందన్నారు. టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ రెగ్యులరైజేషన్‌తో పాటు ఎన్‌ఫో ర్స్‌మెంట్ కూడా చేప ట్టవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సిబ్బందికి తమ తమ పరిధిలో ఉన్న వాటిపై అవగాహన ఏర్పడగల దన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సిబ్బందికి వారి వారి పరిధిలో అవస రమైన సర్వీసులను అందించడం ద్వారా త్వరితగతి న నేరాల నిరోధ న సాధ్యపడగలదని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపా రు. అదే విధంగా టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని అప్‌డే ట్ చేయడం ద్వారా సమస్త విషయాలు నిక్షిప్తమై ఉంటాయన్నారు. కమాండ్ కంట్రోల్ సెంట ర్ పూర్త య్యేనాటికి మొత్తంగా వీటన్నింటినీ దానికి అనుసంధానం చేయడం ద్వారా అక్కడ్నుంచి పూర్తిస్థాయిలో మాని టరింగ్ చేయ వచ్చన్నారు. ఇందు కను గుణం గా సిబ్బందిని తీర్చిదిద్దు తున్నామన్నారు.



# నేటి నుంచి తెదేపా శిక్షణా తరగతులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలుగు దేశం పార్టీ తెలంగాణ కార్యకర్తలకు నేటినుంచి శిక్షణా తరగతులు నిర్వహించనుంది. రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతుల్లో పది అంశాలపై లోతైన అధ్యయనంతో శ్రేణులకు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, రైతులు, యువకులు, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి కేంద్రీకరించి ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. మొదటిరోజు బుధవారం తెలంగాణ పునర్నిర్మాణంలో తెలుగుదేశం 35 ఏళ్ళ సామాజిక ఉద్యమం, తెలంగాణ రైతాంగ దుస్థితి, కరవు, పంట రుణాలు, రైతు ఆత్మహత్యలు, నకిలీ విత్తనాలు, పంటనష్టం, నిరుద్యోగ సమస్య - నోటిఫికేషన్లు, అసంఘటిత రంగాల నిర్లక్ష్యం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం పేరిట పేదల ఆశలతో పాలకుల ఆట, పెండింగ్ ప్రాజెక్టులు - రీడిజైన్, మిషన్ కాకతీయ - భగీరథతో పాటు వ్యక్తిత్వ వికాస అంశాలపై ఈ శిక్షణా తరగతుల్లో చర్చిస్తారు. రెండవ రోజు సోషల్ మీడియాపట్ల అవగాహన, తెరాస హామీలు - వైఫల్యాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమం, రిజర్వేషన్లపై అస్పష్ట వైఖరి, జాతీయ రాజకీయాలు - తెదేపా తదితర అంశాలపై ఈ తరగతుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని, న్యాయమైన వర్గీకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. 20 ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న ఎబిసిడి వర్గీకరణ కోసం ఉద్యమం చేస్తున్న మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. మందకృష్ణను వెంటనే విడుదలచేసి ఆయనపై పెట్టిన అక్రమ కేసును రద్దుచేయాలని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కనిపిస్తే జైలులో పెడుతున్నారని, గంటసేపు నిరసన చెప్పేందుకు ప్రయత్నిస్తే తనను కూడా జైలులో పెట్టారని ఆయన గుర్తుచేశారు. తెరాస ఎల్లకాలం అధికారంలో ఉండదని, ప్రభుత్వ కుట్రను అమలు కానివ్వబోమని ఆయన హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం వర్గీకరణపై శాసనసభలో తీర్మానం చేయడంతో ఈ సమస్య త్వరగా పరిష్కార మవుతుందన్న అభిప్రాయాన్ని కలిగించారని ఆయన అన్నారు. అయితే ఈ తీర్మాన కాగితం ఎక్కడుందో ఎవరికీ తెలియదని, వర్గీకరణ ఉద్యమం ప్రాధాన్యతను, తీవ్రతను ముఖ్యమంత్రి అర్థం చేసుకున్నారని అందరూ భావించా రని అన్నారు.

# మిగులు విద్యుత్ కాంగ్రెస్ ఘనతే

**● పవర్‌పై కాంగ్రెస్ ప్రజెంటేషన్**
**● చత్తీస్‌గఢ్‌తో పవర్ ఒప్పందం పెద్ద కుంభకోణం**
**● టెలిస్కోప్ విధానంతో ప్రజలపై అధిక చార్జీల భారం**
**● టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో మిగులు విద్యుత్ గత యూపీఏ లోని కాంగ్రెస్ ప్రభుత్వాల ఘనతేనని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఒక యూనిట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయలేదని వారు పునరుద్ఘాటించారు. అయితే సీఎం చంద్రశేఖర్‌రావు మాత్రం మిగులు విద్యుత్ తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. కేసీఆర్ అబద్ధాలు- విద్యుత్ వాస్తవాల పేరుతో బుధవారం టీ పీసీసీ ఆధ్వర్యంలో మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, టీ పీసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్‌కుమార్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఒక యూనిట్టైనా ఉత్పత్తి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లి, జైపూర్, జూరాల, పులిచింతల, సింగరేణి జెన్‌కో ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించినవేనని ఆయన వివరించారు. కమిషన్ల కోసమే ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం చేసుకుని విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చత్తీష్‌ఘడ్ పవర్ ఒప్పందమే పెద్ద కుంభకోణమని ఆయన ఆరోపించారు. జెన్‌కో సంస్థను కావాలనే నిర్వీర్యం చేశారని ఉత్తమ్ ఆరోపించారు. కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీని ఎందుకు ఎంచుకున్నారో కేసీఆర్ సమాధానం చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో తట్టెడు మట్టిని కూడా తీయలేదని ఆయన తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా పేరుతో ప్రకటనల రూపంలో రూ. కోట్లు ఖర్చు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం జెన్‌కో సంస్థ రూ. 13 వేల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ మాట్లాడుతూ విద్యుత్‌పై సీఎం కేసీఆర్ చెప్పేవన్ని అవాస్తవాలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన ప్రాజెక్టులతోనే ఇప్పుడు మిగులు విద్యుత్ సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసమర్ధత వల్లే సీలేరు ప్రాజెక్టు ఏపీకి వెళ్లిందన్నారు.



### అధిక కొనుగోలు ధరతో రాష్ట్రంపై భారం



చౌకగా వచ్చే విద్యుత్‌ను చత్తీస్‌గఢ్ నుంచి అధిక ధర చెల్లించి ఎందుకు కొనుగోలు చేస్తున్నారో కేసీఆర్ చెప్పాలని దాసోజ్ శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. చత్తీస్‌గఢ్ నుంచి యూనిట్‌కు రూ. 3.50 ఉండగా రూ. 5లతో కొనుగోలు చేయడం లో ఆంతర్యమేమి టిన నిలదీశారు. ఈ ఒప్పందం సరికాదని సూచించి నందుకే ఐఏఎస్ అరవింద్‌కు మార్‌ను ఆ శాఖ నుంచి తప్పించింది నిజం కాదా..? అని ఆయన ప్రశ్నించారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ ఉన్న దన్నారు. ఈ కార్యక్రమంలో సీఎల్పీ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీలు హనుమంతరావు, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, సునితాలక్ష్మారెడ్డి, కిసాన్‌సెల్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు.

## తాంత్రిక తతంగంపై
# ఈవోకు ఉచ్చు



**● సీఎంతో మంత్రి మాణిక్యాలరావు భేటీ**
**● ప్రాథమిక నివేదిక ఇచ్చిన సీపీ సవాంగ్**
**● రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక**
**● ఆ తర్వాతే చర్యలు తీసుకుంటాం: మంత్రి**
**● ఆంధ్రప్రభ వెలుగులోకి తెచ్చాకే నాకు తెలిసింది: ఈవో సూర్యకుమారి**

**అమరావతి, ఆంధ్రప్రభ:** తప్పులు మీద తప్పులు చేసుకుంటూ వెళుతున్న దుర్గ గుడి ఈవో సూర్యకుమారిపై వేటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందంటున్నారు. తాజాగా గుడి అంతరాలయంలో క్షుద్రపూజల ఘటన వెనుక ఈవో హస్తం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడికావడంలో ఆమెపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. గతంలో ఓ వ్యవహారంలో హైకోర్టు కూడా ఆమెకు జరిమానా విధించింది. ఆ సందర్భంలోనూ ఆమె సారీ చెప్పారు. ధర్మకర్తల మండలి సమావేశంలోనూ సభ్యులకు సారీ చెప్పడం జరిగింది. తాజాగా అర్ధరాత్రి పూట అంతరాలయ తలుపులు తెరిచేందుకు కనీస సమాచారాన్ని పాలకమండలి సభ్యులకు ఇవ్వకపోవడం వారి ఆగ్రహం తెప్పించింది. గతంలో టెండర్లు లేకుండానే కోట్ల రూపాయిల సరకులు కొనుగోలు చేసి, ఆరోపణలు మూటకట్టుకున్నారు. కాగా అంతరాలయంలో అర్ధరాత్రి పూజల వ్యవహారాన్ని ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఈవో సీఎం ఆగ్రహానికి గురికాకతప్పలేదంటున్నారు. దీంతో ఈవో సూర్యకుమారిని బదలీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఆమె స్థానంలో సింహాచలం ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ దుర్గగుడి ఈవోగా రానున్నట్లు ప్రచారం ఊపందుకున్నది. ఇంకో వైపు ఈవో బదలీ అయ్యారని కూడా అంటున్నారు. కాగా ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయని ధర్మకర్తల మండలి ఛైర్మన్ యల మంచలి గౌరంగబాబు స్పష్టం చేశారు. ఈవో బదిలీ అయినట్లు ప్రచారం జరగడంతో సిబ్బంది హడావిడిగా కొన్ని దస్త్రాల మీద సంతకాలు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే మంగళవారం అర్ధరాత్రి నవమి గడియాల్లో అంతరాలయంలోకి వెళ్లిన వారు మహిషాసురమర్దని దేవిగా అమ్మవారిని అలంకరించినట్టు పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఈవో మాత్రం కేవలం ఆలయం లో శుద్ధి మాత్రమే అర్చకులు నిర్వహించారని బుధవారం విలేకరులకు వెల్లడించారు.

**పూజలకు ఆస్కారమే లేదు: మంత్రి మాణిక్యాలరావు**

అర్ధరాత్రి పూజలు జరిగే ఆస్కారమే లేదని మంత్రి మాణిక్యాలరావు కొట్టిపారేస్తున్నారు. ఆరోజు కేవలం అంతరాలయం శుద్ధి మాత్రమే చేసి, అలంకరణ చేశారని చెప్పారు. రాష్ట్రపతి భార్య వస్తున్నారని అమ్మవారిని సుందరంగా అలంకరించేందుకు బయట నుంచి వ్యక్తులను బద్రీనాథ్ తీసుకొచ్చారని అన్నారు.

# వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

**● ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలం**
**● డైరీ ఆవిష్కరణలో మంత్రి పోచారం శ్రీనివాస్**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఏడాది నుంచి రాష్ట్రంలో వ్యవసా యానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే వ్యవసా యం, అనుబంధ రంగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక బడ్జెట్‌పై విస్తృతస్థాయి కసరత్తు కొనసాగుతోందన్నారు. అత్యంత ప్రాధాన్యత గల వ్యవసాయ రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే రైతుల సంక్షేమం పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్నామని పేర్కొన్నారు. ఇంకా ఉద్యోగుల సమస్యలేమైనా ఉంటే వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని బుధవారం వ్యవసాయ కమిషనర్ కార్యాల యంలో పోచారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతుల అవసరాలను తెలుసుకుని ఎప్పటిక ప్పుడు ప్రభుత్వానికి తెలియజేయా ల్సిన బాధ్యత అధికారు లపై ఉందన్నారు. అగ్రి డాక్టర్ల సంఘం నాయకులు ఈ సందర్భంగా కొన్ని ప్రధాన డిమాండ్లను మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ముందుంచారు. వ్యవసాయశాఖ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారిని కొనసాగిస్తూనే ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సీనియర్ ఉన్నతాధికారిని డైరెక్టర్ గా నియమించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ స్థానంలో వ్యవసాయ శాఖలో అదనపు డైరెక్టర్ స్థాయిలో ఉన్న ఉన్నతాధికారికి నియమించాలన్నారు. మండల స్థాయి వ్యవసాయాధికారి కేడర్ పోస్టును స్టేట్ కేడర్‌గా గుర్తించాలన్నారు.

### విజ్ఞానంతోనే అభివృద్ధి

ఉన్నత చదువులు అభ్యసించిన ఉద్యోగులు, అధికారులు, శాస్త్రవేత్తల తమ మేధోశక్తికి మరింతగా పెంచుకుని దాన్ని సమాజాభివృద్ధికి ఉపయోగించాలని ప్రముఖ కవి, రచయిత గోరేటి వెంకన్న అన్నారు. కుల, మతాలకు అతీతంగా మనం పూర్వ మానవులం కావాలని పిలుపునిచ్చారు. తలుచుకుంటే మనిషికి డాక్టర్ల అవసరం లేకుండా చేసే గొప్పోళ్ళు అగ్రి డాక్టర్లని అభిప్రాయపడ్డారు.



# గొర్రెల పథకంలో అధికారుల కృషి భేష్

**డైరీ ఆవిష్కరణలో మంత్రి తలసాని**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రతిష్టాత్మకమైన గొర్రెల పంపిణీ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో పశు సంవర్ధకశాఖ అధికారుల కృషి ప్రశంసనీయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పర్యటించి, ఎంతో శ్రమతో గొర్రెలను సమీకరించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తున్న ఘనత ఈ శాఖలో పనిచేస్తున్న వివిధ స్థాయి అధికారులందరికీ దక్కుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ కుల వృత్తులను ప్రోత్సహించడం ద్వారా సంపద సృష్టించాలన్న సీఎం కేసీఆర్ కలను సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి సిద్ధంగా ఉందని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పశు సంవర్ధకశాఖలో నూతన నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయన్నారు. నిబద్ధతతో పదోన్న తులను కూడా చేపట్టిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అదేవిధంగా పశు వైద్యసేవలను మెరుగుపరచడం, ఆసుపత్రులలో మౌలిక వసతులను కల్పించడం లాంటి అనేక కార్యక్రమాలను మొదలుపెట్టామన్నారు. మీ అందరి కృషితో, అనేక సంక్షేమ కార్యక్రమాల అమలుతో పశు సంవర్ధకశాఖ ఉన్నతమైన గుర్తింపును సాధించిందన్నారు.

# నీళ్లను వృథా చేయొద్దు

**ఆర్థిక మంత్రి ఈటలరాజేందర్**



**కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో :** కరీంనగర్ దిగువ మానేరు నుంచి వదలిన ప్రతి నీటి బొట్టును వృథా కాకుండా రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా దిగువ మానేరు నుంచి ఎస్సారెస్పీ నీటిని దిగువ కాలువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌లో రైతాంగానికి సాగుకు నీరందించడానికి కట్టుదిట్టమైన ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాకు తాగునీటికి, కరీంనగర్ జిల్లాకు సాగునీటికి ఈ నీళ్లు ఉపయో గపడుతాయన్నారు. వర్షాలు లేకపోయినా ఎల్ఎండీకి నీరు రాకపో యినా, ఎస్సా రెస్పీకి నీళ్లు సరిపోక పోయినా కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు అందరూ సీఎం కేసీఆర్‌ను కోరడంతో మంజీర, సింగూరు నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టుమీదుగా నీళ్లను మొదటిసారిగా ఎస్సారెస్పీకి వదలినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంన గర్ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్‌కమార్, మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ సంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎస్సారెస్పీ, ఎల్ఎండీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా స్వీట్‌కైట్ ఫెస్టివల్స్




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అంతర్జాతీయ పతంగుల పండుగకు అనుబంధంగా స్వీట్ ఫెస్టివల్‌ను కూడా అదే స్థాయిలో నిర్వహించనున్నామని, రెండు అంతర్జాతీయ పండుగల నిర్వహణతో పర్యాటకులు భారీగా హాజరుకానున్నారని రాష్ట్ర పర్యాటక, గిరిజన సంక్షేమశాఖా మంత్రి ఆజ్మీరా చందూలాల్ తెలిపారు. బుధవారం సచివాలయంలోని డి-బ్లాక్ సమామేశమందిరంలో కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించిన ఆయన ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 11దేశాల నుండి కైట్ ఫెస్టివల్‌కు ప్రతినిధులు, ఫ్లయింగ్‌క్లబ్‌లు రానున్నాయన్నారు. స్వీట్ ఫెస్టివల్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఒకే దగ్గర వేయిరకాల స్వీట్లను ప్రదర్శనకు ఉంచుతారన్నారు. దేశంలోని 25రాష్ట్రాలకు చెందిన రుచులతో పాటు కొరియా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి 14దేశాలకు చెందిన వంటకాలు ఇందులో ప్రదర్శనకు ఉంటాయన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ వేర్వేరు రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారి రుచులు.. వంటకాలు ఉంటాయన్నారు. తొలిసారి సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్‌లో దీనిని నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ భగత్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

# ఆర్టీసీ పరిపుష్టానికి చర్యలు

**ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ ఆర్ధిక స్థితి మెరుగు కోసం ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నామని సంస్థ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ తెలిపారు. సంస్థ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి పాత్ర దాగి ఉందన్నారు. ఆర్టీసీ ఆర్ధిక పరిపుష్టికి మరింతగా కృషి చేయవలసి ఉందని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంస్థ అభ్యున్నతిపై సంబంధిత సీనియర్ అధికారులతో చర్చించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత పురోభివృద్ధికి తగిన చర్యలు తీసుకొనవలసి ఉందని సూచించారు. ఇప్పటికే కొన్ని డిపోలు లాభాల్లోకి రావడం, కొన్ని డిపోలు నష్టాలను అధిగమించడం హర్షనీయ పరిణామం అన్నారు. ఈ సంవత్సరం అన్ని డిపోలు లాభాల బాట పట్టేందుకు ప్రణాళికా బద్దంగా కృషి జరగవలసి ఉందన్నారు.

# జగన్‌కు ఈడీ ఝలక్

**అక్రమాస్తుల కేసులో రూ.117.74 కోట్ల ఆస్తులు సీజ్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి ఝులక్ ఇచ్చింది. అక్రమాస్తుల కేసులో ఇప్పటి వరకు దాదాపు రూ. 1900కోట్ల ఆస్తులను సీజ్ చేసిన ఈడి తాజా గా మరో రూ.117.74 కోట్ల ఆస్తులను సీజ్ చేసింది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ అక్రమాస్తులను కూడగట్టాడన్న అభియోగంపై దర్యాప్తు జరిపిన సిబిఐ ఆయనపై 10 చార్జీషీట్‌లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. సిబిఐ కోర్టుకు సమర్పించిన చార్జీషీట్‌లోని దర్యాప్తు అంశాలను ఆధారంగా చేసుకున్న ఈడి కేసులను నమోదు చేసింది. సిబిఐ అంశశాల వారిగా చార్జీషీ ట్‌లను దాఖలుచేయగా, వాటిలోని ఆధారాలమేరకు ఈడీ చర్యలు తీసుకుంటోంది. బెంగళూరులోని నివాసంతో పాటు పలు చోట్ల ఉన్న ఆస్తులను ఇప్పటికే ఈడి సీజ్ చేయగా, తాజాగా గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన చార్జీషీట్‌లోని ఆస్తులు, ఇందు ప్రాజెక్టు అధినేత శ్యాంప్రసాద్‌రెడ్డికి సంబంధించిన స్థిర ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జితేంద్ర విర్వాణీకి చెందిన ఎంబసీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ ఆస్తులు, వివి కృష్ణప్రసాద్‌కు చెందిన వసంత ప్రాజెక్టు ఆస్తులను ఈడీ సీజ్ చేసింది.

# కోరెగావ్ అల్లర్లపై అట్టుడికిన పార్లమెంట్

● ఉభయసభల్లో ప్రతిపక్షాల నిరసన ● బీజేపీ దళిత వ్యతిరేకి: కాంగ్రెస్ ● కాంగ్రెస్ పార్టీ విద్వేషాలను రెచ్చగొడుతోందన్న బీజేపీ



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** భీమా కోరెగావ్ అల్లర్లపై పార్లమెంటు ఉభయసభలు బుధవారం అట్టుడికాయి. ఈ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చింది. అయితే దానిని తిరస్కరించడంతో విపక్షాలు గందరగోళం సృష్టించాయి. దాంతో సభ పదేపదే వాయిదా పడింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆరోపించారు. బీజేపీ దళిత వ్యతిరేకి అని, సమాజాన్ని ముక్కలు చేయాలని చూస్తోందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో బీజేపీ ప్రజలను విడదీస్తోందన్నారు. ప్రతి రోజూ దేశంలో ఏదో ఒక మూలన దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ అంశాలను పార్లమెంటులోపల, బయటా చర్చించేందుకు ప్రభుత్వం ఇష్టపడడం లేదని అన్నారు. ఇటు లోక్‌సభలోనూ కోరెగావ్ అల్లర్ల అంశంపై సభలో గందరగోళం చెలరేగింది. దళితులను అణిచివేసేందుకు మతతత్వ శక్తుల ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామరస్యపూర్వకంగా, ఆత్మగౌరవంతో జీవించాలని దళితులు ప్రయత్నిస్తుంటే ఆ ప్రయత్నాలను నీరుగారుస్తున్నారని విమర్శించారు. భీమా కోరెగావ్‌లో అల్లర్లకు ఇదే ప్రధాన కారణమని అన్నారు. అనేక సంవత్సరాలుగా కోరెగావ్ ఉత్సవాలు జరుపుతుంటే, ఇప్పుడెందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీని వెను ఆర్ఎస్ఎస్ లాంటి శక్తులు ఉన్నాయని అన్నారు. దళితులను అడుగడుగునా అణగదొక్కుతున్నారని విమర్శించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లోని ఉనా, రాజస్థాన్‌లోనూ ఎక్కడా బీజేపీ ప్రభుత్వాలున్నా అక్కడ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని అందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ విమర్శలకు బీజేపీ ధీటుగా బదులిచ్చింది. అన్ని రాష్ట్రాలలో ఓడిపోతున్న కాంగ్రెస్ పార్టీ దళితుల అంశంతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ అన్నారు. తాము శాంతి, సామరస్యం కోసం ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ పార్టీ వారిని గొడవలకు పురికొల్పుతోందని అన్నారు.మహారాష్ట్రలో జరిగిన ఘటనలను పార్లమెంటులో చర్చ జరపాలనడం సరికాదని, అక్కడి ప్రభుత్వం గొడవలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. మధ్యాహ్నం తర్వాత లోక్‌సభలో ఓబిసి కమిషన్ కు రాజ్యాంగ హెూదా కల్పించే 123వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ ఈ బిల్లును సభలో ప్రతిపాదించారు. అయితే గతంలోనే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో నూతనంగా కొన్ని సవరణలు చేర్చడంతో తిరిగి లోక్‌సభ ఆమోదానికి తీసుకువచ్చారు. అయితే రాష్ట్రాలను సంప్రదించకుండా ఈ బిల్లును రూపొందించారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు విమర్శించడంతో గందరగోళం చెలరేగింది. దాంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

## సుష్మా-థరూర్ మధ్య వాగ్వాదం

ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తరుపున హిందీని అధికార భాషగా చేసే ప్రయత్నాలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తమిళనాడు నుంచిగానీ, పశ్చిమబెంగాల్ నుంచి ప్రధానమంత్రి అయితే వారిని హిందీలోనే ప్రసంగించాలని ఎలా ఒత్తిడి చేయగలమని ప్రశ్నించారు. హిందీ జాతీయ భాషకాదని, కేవలం ఇంగ్లీష్ లాగానే, హిందీ కూడా వర్కింగ్ లాంగ్వేజ్ అని గుర్తు చేశారు. అయితే హిందీని అధికారభాషగా చేసేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని, ఇందుకు ఇతర దేశాల మద్దతు తీసుకుంటామని కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు.





# 'మహా' బంద్ ఉద్రిక్తం

**భీమా-కోరెగావ్ విజయ స్థూపం వద్ద విజయోత్సవాలకు వ్యతిరేకంగా పూనెలో చోటు చేసుకున్న హింసలో ఒకరు మరణించిన కొద్ది గంటల్లోనే... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ నేతృత్వంలోని భారిప బహుజన్ మహాసంఘ్.. అందుకు వ్యతిరేకంగా ఇచ్చిన బంద్ పిలుపు బుధవారం యావత్ మహా రాష్ట్రలో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. బంద్ పిలుపునకు మద్దతుగా దళితులు పెద్ద సంఖ్యలో రోడ్ల మీదకు వచ్చారు. వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. రైళ్ళ రాక పోకలను ఆపివేశారు. నాందేడ్‌లో 16 సంవత్సరాల విద్యార్థి మరణించాడు. అయితే పోలీసులు జరిపిన లాఠీ చార్జీ కారణంగా అతడు మరణించాడని బంధువులు ఆరోపించారు. పదుల సంఖ్యలో విమానాలు ముంబై విమానాశ్రయంలో నిలిచిపోయాయి. అంతే సంఖ్యలో విమానాలు ఆలస్యంగా నడిచాయి. ముంబైలో స్థానిక రైలు, బస్సు రవాణాపై బంద్ పెను ప్రభావం చూపింది. డబ్బావాలాలు సైతం వారి కార్యకలా పాలను నిలిపివేశారు. నిత్యం షూటింగులతో కళకళలాడుతుంటే బాలీవుడ్, టీవీ పరిశ్రమలు వెలవెలబోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంద్ సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై ప్రభుత్వం దర్యాప్తు చేపడుతుందని మహా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. సాయంత్రానికి బంద్ ప్రశాంతంగా జరిగిందని భారిప బహుజన్ మహా సంఘ్ నేత ప్రకాష్ అంబేద్కర్ తెలిపారు.**

● అట్టుడికిన మహారాష్ట్ర ● విద్యార్థి మృతి ● ధర్నాలు, హింసాత్మక ఘటనలు ● నిలిచిపోయిన బస్సులు, రైళ్ళు, విమానాలు ● మేము సైతం అంటూ డబ్బావాలాలు ● బాలీవుడ్, టీవీ పరిశ్రమలపై పెను ప్రభావం ● బంద్ ప్రశాంతం అని అంబేద్కర్ మనుమడు ప్రకటన ● హింసాత్మక ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు

**ముంబై:** పూనెలో చోటు చేసుకున్న హింసకు వ్యతిరేకంగా భారిప బహుజన్ మహా సంఘ్ ఇచ్చిన బంద్ పిలుపును పురస్కరించుకొని మహారాష్ట్ర అంతటా పోలీసులు బుధవారం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముంబై మహానగరంలో చెంబూర్ నాక, వర్లీ నాకా లాంటి అనేక ప్రాంతాల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో కనిపించారు. మంగళవారం నాటి హింసాత్మక ఘటనలకు హిందూ ఏక్తా అఘాడీ కారణమని ప్రకాష్ అంబేద్కర్ ఆరోపించారు. తాము ఇచ్చిన బంద్ పిలుపునకు మహారాష్ట్ర డెమొక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్ సహా 250 సంఘాలు మద్దతు తెలిపాయని ఆయన అన్నారు. బంద్ సందర్భంగా థానే, పాల్‌ఘడ్ జిల్లాల్లో జెండాలు చేబూనిన దళిత



కార్యకర్తలు రైలు పట్టాలపైకి ఎక్కారు. పలు రైల్వే స్టేషన్లలో రైళ్ళ రాకపోకలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అయితే అక్కడే ఉన్న భద్రతా బలగాలు వారిని తరిమికొట్టారు. ముంబై మహానగరంలోకి ప్రవేశించేందుకు కీలక కేంద్రంగా భావించే దహిసర్ చెక్‌పోస్ట్ వద్దకు నిరసనకారులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాస్తారోకో చేపట్టారు. రెండు వైపులా వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

ముంబైలోని గోరెగావ్, జోగేశ్వరి, పొవాయి, భండప్, చెంబూర్, గోవండి, నవీ ముంబైకి చెందిన కొన్ని ప్రాంతాల్లో వాహనాలపై రాళ్ళు రువ్విన ఘటనలు చోటు చేసుకున్నాయి. కనీసం 40 బెస్ట్ బస్సులు ధ్వంసమయ్యాయి. ముంబైలో పాఠశాలలు, కళాశాలలు తెరిచి ఉన్నప్పటికీ విద్యార్థుల్లో అత్యధికులు గైర్హాజరయ్యారు.

### పరీక్షలు వాయిదా

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు రాలేకపోతున్న కారణంగా ఔరంగబాద్ విశ్వవిద్యాలయం పరీక్షలు రీషెడ్యూల్ చేసింది. అంతర్జాతీయంగా పేరొందిన పర్యాటక కేంద్రంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ముంబై విశ్వవిద్యాలయం తొమ్మిది పరీక్షలను రీషెడ్యూల్ చేసింది.

### అంతంతమాత్రంగా లోకల్ ఏసీ రైళ్ళు

అనేక ట్యాక్సీ-ఆటో రిక్షా యూనియన్లు బంద్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ ముంబై సబర్బన్ రైళ్ళు, బెస్ట్ బస్సులు అత్యంత ప్రయాస తో రాకపోకలు సాగించాయి. హింసాత్మక ఘటనలకు తోడు రైలు పట్టాలపైకి ఆందోళనకారులు రావడంతో సబర్బన్ రైళ్ళ రాకపోకలకు తరచుగా అంతరాయం ఏర్పడింది. కొత్తగా ప్రవేశపెట్టిన 12 లోకల్ ఏసీ రైళ్ళలో కేవలం నాలుగు మాత్రమే బుధవారం నడిచాయి.

### విమానాలు రద్దు

ముంబై విమానాశ్రయం కార్యకలాపాపై బంద్ పెను ప్రభావం చూపింది. 12 విమానాలు రద్దు అయ్యాయి. 235 విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి.

### నగరాల్లో పాక్షికం.. ఇతర చోట్ల సంపూర్ణం

డబ్బావాలాలు సైతం వారి సేవలను రద్దు చేసుకున్నారు. ముంబై మహానగరంలో ఉదయం తెరుచుకున్న అనేక దుకాణాలు, వాణిజ్య సంస్థలు బంద్ మొదలైన కొద్దిసేపటికే మూతపడ్డాయి. థానే, నాగ్‌పూర్, పూనే, ఇతర నగరాలు లాంటి పట్టణ ప్రాంతాలతో పోలిస్తే మొఫుస్సిల్ ప్రాంతాల్లో బంద్ పిలుపునకు మంచి స్పందన వచ్చింది. కోస్టల్ కొంకణ్ ప్రాంతంలో బంద్ సంపూర్ణమైంది. అలాగే దళితులకు పెట్టని కోటల్లాంటి బీడ్, లాతూరు, సోలాపూర్, జలగావ్, ధూలే, అహ్మద్‌నగర్, నాసిక్, పాల్‌ఘడ్‌లలో బంద్ విజయవంతమైంది.

బంద్ కారణంగా ముంబై-పూనె హైవేపైన దాదాపు గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం నాటి హింసాత్మక ఘటనల్లో 187 బస్సులు ధ్వంసమైపోవడంతో మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఎంఎస్ఆర్టీసీ) సమస్యాత్మక జిల్లాలకు బస్సు సర్వీసులను నిలిపివేసింది.

### విద్యార్థి దుర్మరణం

నాందేడ్ జిల్లాలో నిరసనకారులు రాస్తారోకో జరిపిన సందర్భంగా 16 సంవత్సరాల యోగేశ్ ప్రహ్లాద్ జాదవ్ అనే విద్యార్థి మరణించాడు. అస్తి గ్రామం సమీపంలో రాస్తారోకో తొలగించడం కోసం పోలీసులు లాఠీచార్జి జరపడంతో జాదవ్ తీవ్రమైన గాయాలతో మరణించాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే మరణం వెనుక కారణం తెలుసుకునేందుకు మృతదేహాన్ని శవపరీక్షకు పంపించినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.

### సీసీటీవీల ద్వారా దర్యాప్తు

రాష్ట్రంలో బుధవారం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై దర్యాప్తు జరిపిస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. హింసకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్టు ఆయన చెప్పారు.



**అది 1818 సంవత్సరం జనవరి ఒకటవ తేదీ. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నేతృత్వంలో దాదాపు 900 మంది సైనికులతో కూడిన పటాలం మహారాష్ట్రలోని శిరూర్ నుంచి పూనేకు బయలుదేరింది. బాజీరావు-2 నేతృత్వంలోని 20 వేల మంది సైనికులతో కదం తొక్కుతున్న సైన్యాన్ని ఎదుర్కొవడానికి వారు సమర క్షేత్రానికి చేరుకున్నారు. అతి తక్కువ సమయంలోనే సమరం ముగిసిపోయింది. ఫలితంగా ఆంగ్లేయుల వైపు 200 మందికిపైగా సైనికులు, పీష్వాల వైపు 500 మందికిపైగా సైనికులు మరణించారు. యుద్ధం జరిగిన రెండు రోజుల తర్వాత సమర క్షేత్రాన్ని సందర్శించిన స్కాట్లాండ్ రాజనీతిజ్ఞుడు, చరిత్రకారుడు మౌంట్‌స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ ఇలా రాసుకొచ్చారు.. ఇండ్లు తగలపడిపోయాయి. పురుషులు, గుర్రాల మృతదేహాలతో వీధులు నిండిపోయాయి. కోరెగావ్ సమరం ఇరు పక్షాల్లో ఏ ఒక్కర్ని విజేతగా స్పష్టం చేయకపోయినప్పటికీ కడకు ఆంగ్లేయులు విజేతలైనారు. గెలుపునకు నిదర్శనంగా కోరెగావ్ వద్ద విజయ స్థూపాన్ని నిర్మించారు.**

# మహర్ల శౌర్యానికి ప్రతీక

● కోరెగావ్ విజయస్థూపం.. పీష్వాలపై మహర్ల గెలుపునకు నిదర్శనం ● శివాజీ హయంలో వారికి క్షత్రియ హోదా ● పీష్వాల ఏలుబడిలో అంటరానివారు ● అక్కున చేర్చుకున్న ఈస్టిండియా కంపెనీ ● సైనిక నియామాకల్లో మహర్లకు పెద్ద పీట ● విజయస్థూపంపై మహర్ల పేర్లు

**న్యూఢిల్లీ:** రెండు శతాబ్దాల తర్వాత మహా రాష్ట్రలో మహర్ సామాజిక వర్గీయులు ప్రతి యేటా వేడుక చేసుకొనే ఒక వేదికగా కోరెగావ్ విజయ స్థూపం ఇప్పటికీ నిలిచింది. వాస్తవానికి యుద్ధంలో గెలిచింది ఆంగ్లేయులైనప్పటికీ విజయోత్సవాన్ని మాత్రం మహారాష్ట్రలో అస్పృశ్యతకు చెందిన కులంగా అగ్రవర్ణాలు పరిగణించే మహర్ కులస్తులు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. పందొమ్మి దవ శతాబ్దంలో సైనిక పటాలాల్లో మహర్ల నియామ కానికి ఆంగ్లేయులు మొగ్గు చూపుతుండేవారు. కోరెగావ్ సమరంలో పాల్గొన్న ఆంగ్లేయుల సైన్యంలో మహర్లే ఎక్కువగా ఉండేవారు. అగ్ర కులానికి చెందిన పీష్వా సైన్యంపై మహర్ల ఆధిక్యతతో కూడిన సైనిక పటాలం సాధించిన విజయం దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. వారికంటూ ఒక సానుకూల గుర్తింపును తెచ్చి పెట్టింది.

### శివాజీ ఏలుబడిలో మహర్లకు పెద్ద పీట

మహారాష్ట్రలో అంటరాని కులానికి చెందినవారైనప్పటికీ సైనిక మరియు పరిపాలన సేవల్లో మహర్లు అనాదిగా కీలకమైన పదవులను నిర్వహించి ఉన్నారు. చూడటానికి వారు బలిష్టంగా ఉండేవారు. చురుకైన తెలివితేటలతో అందంగా ఉండేవారని చరిత్రకారులు రాసుకొచ్చారు. వారిలో సైనిక ప్రతిభను ఆంగ్లేయుల కంటే ముందు ఛత్రపతి శివాజీ గుర్తించారు. మరాఠా కులానికి అంతగా గుర్తింపు లేని కాలంలో అంటే 17వ శతాబ్దంలో మహారాజు శివాజీ వారికి ఎంతో విలువ ఇచ్చారు. క్షత్రియ హోదాను సంతరించుకున్నప్పటికీ మరాఠాల జీవనశైలి రైతులను పోలి ఉండేది. సైన్యంలో చురుకైన పాత్ర పోషిస్తున్న నిమ్నవర్ణానికి చెందిన మరాఠా కుంబి, మహర్, మంగ్ కులాలతో మరాఠా కుటుంబాలకు గల సన్నిహిత సంబంధాలు పశ్చిమ భారతదేశంలో సైనిక సంస్కృతికి కీలకమైన అంశంగా మిగిలిపోయిందని చరిత్రకారుడు ఫిలిప్ కాన్‌స్టేబుల్ రాసుకొచ్చారు.

### జ్యోతిరావు ఫూలే రచనల్లోనూ..

సామాజిక సంస్కర్త జ్యోతిరావు ఫూలే సైతం బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిమ్న కులాలను ఏకం చేసే క్రమంలో ఛత్రపతి శివాజీ సైనిక నియామకాల్లో మహర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారికి పరోక్షంగా క్షత్రియ హోదాను కట్టబెట్టారని తన రచనల్లో పేర్కొన్నారు. శివాజీ ఏలుబడిలో వారు పర్వతాలపై ఉండే కోటలకు రక్షణగా ఉండేవారు. ఒకానొక దశలో దళపతులుగానూ అవతరించారు.

### పీష్వాల కాలంలో మహర్లు.. చీపుర్లు కట్టేవారు..!

శివాజీ హయాంలో ఓ వెలుగు వెలిగిన మహర్ల పరిస్థితి ఆ తర్వాత వచ్చిన పీష్వాల ఏలుబడిలో అత్యంత దయనీయంగా మారింది. అంటరానివారనే ముద్ర వారిపై మళ్ళీ పడింది. మహర్లపైన పీష్వాల ఆగడాలకు అంతులేకుండా పోయేదని చరిత్రకారులు రాసుకొచ్చారు. వారి అడుగుజాడలను తుడిచివేసుకోవడానికి మహర్లు వారి వీపులకు చీపుర్లు కట్టుకోవాల్సి వచ్చేది. ఉమ్మి వేయడానికి మెడలో కుండలు కట్టుకొని తిరిగేవారు. శౌర్య పరాక్రమాలను సంతరించుకున్న సైనికులుగా వారికి ఉన్న పేరు, ప్రతిష్ఠలు పీష్వాల పాలనలో సమూలంగా తుడిచిపెట్టుకుపోయింది.

### ఆంగ్లేయుల రాకతో పూర్వ వైభవం

పీష్వాల హవాకు అడ్డుకట్ట వేయాలని భావించిన ఆంగ్లేయులకు చెందిన ఈస్టిండియా కంపెనీ బాంబే సైన్యంలో సైనికులుగా మహర్లను నియమించుకోవడం ప్రారంభించింది. తమ పూర్వ వైభవాన్ని పొందడానికి, పొందిన అవమానాన్ని, అప్రతిష్ఠను పోగొట్టుకోవడానికి దీన్ని ఒక అద్భుతమైన అవకాశంగా మహర్లు అందిపుచ్చు కున్నారు. సైనిక నియామకంతో సామాజికంగా, ఆర్థికంగా మంచి స్థితిగతులను సాధించుకోగలిగారు. మరాఠా రాచరికాన్ని కూలగొట్టడానికి నిమ్నవర్ణాలకు చెందిన వారిని సైనికులుగా నియమించుకోవడమే సరైన మార్గమని



ఆంగ్లేయులు గుర్తించారు. ఇది బాంబే గ్యారిసన్ సైన్యంలో ప్రస్ఫుటంగా కనిపించింది. కోరెగావ్ యుద్ధం తర్వాత ఆంగ్లేయులు విజయ స్థూపంపై అమరులైన 22 మంది మహర్ సైనికుల పేర్లను చెక్కించారు. అయితే 20వ శతాబ్దం వచ్చేసరికి ఆంగ్లేయులు భారతదేశంపై మంచి పట్టు సాధించారు. సైనికులుగా వారు అందించిన చిరస్మరణీయ సేవలు ఆంగ్లేయ పాలకుల స్మృతిపథం నుంచి క్రమక్రమంగా తొలగిపోయింది. సైనికులుగా మహర్ల నియామకాన్ని నిలిపివేశారు. భారతదేశానికి స్వరాజ్యం సిద్ధించిన తర్వాత కూడా సైన్యంలో మహర్ల ప్రాముఖ్యతను చరిత్రకారులు వారి రచనల్లో పొందపరచలేదు.

### అగ్ర వర్ణంపై నిమ్న వర్ణాల విజయానికి నిదర్శనం

కాలగమనంలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ పాలకులు, చరిత్రకారులు వారిని గుర్తించినా, గుర్తించకపోయినా మహర్లకు ఒక మరపురాని విజయసంకేతంగా విజయ స్థూపం నిలిచిపోయింది. అగ్రవర్ణాలపై దళితుల గెలుపునకు నిదర్శనం అన్నట్టుగా వారికి అది ఒక మహోన్నతమైన శిఖరంగా కనిపిస్తున్నది. పశ్చిమ భారతంలో తమను ఎంతగానో అవమానించిన పీష్వా పాలన అంతమైపోవడంలో కీలకమైన పాత్ర పోషించిన కోరెగావ్ యుద్ధం నాటి స్థూపం వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా భావిస్తుంటారు మహర్లు.

# ఆప్ 'పెద్దలు' ఖరారు







**న్యూఢిల్లీ :** నాటకీయ పరిణామాలు, సుదీర్ఘ మంతనాలు, ఉత్కంఠ మధ్య ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ఖరారుచేసింది. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ శిశోడియా మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిపారు. సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, ఎన్ డీ గుప్తా ఈ నెల 16న జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తారని చెప్పారు. ఢిల్లీ నుంచి మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీలు జనార్దన్ ద్వివేది, పర్వేజ్ హష్మీ, కరణ్ సింగ్ పదవీ కాలం జనవరి 27తో ముగుస్తుంది. వీరి స్థానంలో ఆప్ అభ్యర్థులు ఏకగ్రీవంగా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. సంజయ్ సింగ్ ఆప్ జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్నారు. ఆయన 2017లో జరిగిన పంజాబ్ శాసనసభ ఎన్నికలకు పార్టీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. సుశీల్ గుప్తా 25 ఏళ్ళ నుంచి ఢిల్లీలోని పంజాబీ బాగ్ క్లబ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆప్ సభ్యుడు కాకపోవడం విశేషం. ఎన్‌సీ గుప్తా చార్టర్డ్ అకౌంటెంట్‌గా చేస్తున్నారు. ఆయన అకౌంటింగ్, బిజినెస్ పుస్తకాలను రాశారు. ఢిల్లీలో 70 శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిలో 67 స్థానాల్లో ఆప్ గెలిచింది. రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ప్రకటించడానికి ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీ ఎమ్మెల్యేలు, పొలిటికల్ యాక్షన్ కమిటీ సభ్యులతో మాట్లాడారు.

### నా బలిదానాలను స్వీకరిస్తున్నా: కుమార్ విశ్వాస్

కేజ్రీవాల్‌పై ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ కుమార్ విశ్వాస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిజం మాట్లాడినందుకు తనను శిక్షించారని ఆరోపించారు. గతంలో ఓసారి కేజ్రీవాల్ తనతో చెప్పిన మాటలను విశ్వాస్ గుర్తు చేసుకున్నారు. ''నిన్ను చంపుతాను కానీ అమరజీవిని కానివ్వబోను'' అని కేజ్రీవాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేసుకున్నారు.

# క్రీడాప్రభ

## ఓడినా నెంబర్ వనే!

**దుబాయ్:** భారత జట్టు దక్షిణాఫ్రికా చేతిలో మూడు టెస్టుల్లోనూ ఓడినా ఐసీసీ నెంబర్ వన్ ర్యాంకుకు ఎలాంటి ఢోకా ఉండబోదు. ఐతే మూడో టెస్టుల్లోనూ గెలిస్తే దక్షిణాఫ్రికా.. భారత్ సరసన చేరుతుంది. ప్రస్తుతం ఆ జట్టు టీమ్ఇండియా కంటే 13 పాయింట్లు వెనుకబడి ఉంది. విరాట్ సేన 124 పాయింట్లతో నెంబర్ వన్ గా ఉంది. సిరీస్‌ను దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేస్తే.. రెండు జట్లు 118 పాయింట్లతో నిలుస్తాయని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిస్థితిలో కూడా భారతే ముందుంటుంది. దశాంశమాన పద్ధతి ప్రకారం భారత్ పాయింట్లు 118.47 అవుతాయి. దక్షిణాఫ్రికా 117.53 పాయింట్లతో నిలుస్తుంది. భారత్ మూడు టెస్టులు గెలిస్తే 128 పాయింట్లతో ఉంటుంది. దక్షిణాఫ్రికా పాయింట్లు 107 అవుతాయి. యాషెస్ గెలిచిన ఆసీస్ మూడో స్థానం పదిలపరచుకుంది. టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి కెరీర్‌లో తొలిసారి 900 పాయింట్ల మార్క్‌ను అందుకోనున్నాడు. ఇపుడతను 893 పాయింట్లతో ఉన్నాడు. పుజారా విరాట్ కంటే 20 పాయింట్లు తక్కువతో మూడో స్థానంలో ఉన్నాడు.



## ధావన్ ఫిట్... జడేజా డౌట్!

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో శుక్రవారం ఆరంభం కాబోయే మొదటి టెస్టుకు ఓపెనర్ శిఖర్ ధావన్ అందుబాటులో ఉంటాడు. కానీ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తొలి మ్యాచ్‌లో ఆడేది అనుమానమే. ధావన్ ఫిట్‌గా ఉన్నాడని, జడేజా గత రెండు రోజులుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్నాడని బీసీసీఐ బుధవారం ఇక్కడో ప్రకటనలో తెలిపింది. భారత జట్టు వైద్య బృందం అతణ్ని పర్యవేక్షిస్తోందని అంది. మ్యాచ్ .జరిగే రోజు ఉదయం జడేజా అందుబాటుపై నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. ''భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఫిట్‌గా ఉన్నాడు. ఎంపికకు అందుబాటులో ఉన్నాడు. ధావన్.. జట్టు దక్షిణాఫ్రికా బయులుదేరడానికి ముందు చీలమండ గాయానికి గురయ్యాడు'' అని బీసీసీఐ ఆ ప్రకటనలో తెలిపింది. ''జడేజా గత రెండు రోజులుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. ఆసుపత్రిలో చేర్చాలని ఆ బృందం నిర్ణయించింది. అతను 48 గంటల్లో కోలుకుంటాడు. తొలి టెస్టుకు జడేజా అందుబాటు గురించి శుక్రవారం ఉదయం నిర్ణయం తీసుకుంటారు'' అని బీసీసీఐ చెప్పింది.



## భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టు రేపటి నుంచి

**కేప్‌టౌన్:** దక్షిణాఫ్రికాతో భారత్ 3 టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. మొదటి టెస్టు ఈనెల 5న (శుక్రవారం) ఆరంభమవుతుంది. టెస్టుల తర్వాత వన్డేలు, టీ20లు జరుగుతాయి.

**ఇదీ షెడ్యూలు**

**జనవరి 5-9:** తొలి టెస్టు (కేప్‌టౌన్‌లో భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి)
**జనవరి 13-17:** రెండో టెస్టు (సెంచూరియన్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి)
**జనవరి 24-28:** మూడో టెస్టు (జొహాన్నెస్‌బర్గ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి)
**ఫిబ్రవరి 1:** తొలి వన్డే (డర్బన్‌లో భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 నుంచి)
**ఫిబ్రవరి 4:** రెండో వన్డే (సెంచూరియన్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి)
**ఫిబ్రవరి 7:** మూడో వన్డే (కేప్‌టౌన్‌లో సాయంత్రం 4.30 నుంచి)
**ఫిబ్రవరి 10:** నాలుగో వన్డే (జొహాన్నెస్‌బర్గ్‌లో సాయంత్రం 4.30 నుంచి)
**ఫిబ్రవరి 13:** ఐదో వన్డే (పోర్ట్ఎలిజబెత్‌లో సాయంత్రం 4.30 నుంచి)
ఫిబ్రవరి 16: ఆరో వన్డే (సెంచూరియన్‌లో సాయంత్రం 4.30 నుంచి)
**ఫిబ్రవరి 18:** తొలి టీ20 (జొహాన్నెస్‌బర్గ్‌లో భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటల నుంచి)
**ఫిబ్రవరి 21:** రెండో టీ20 (సెంచూరియన్‌లో రాత్రి 9.30 నుంచి)
**ఫిబ్రవరి 24:** మూడో టీ20 (కేప్‌టౌన్‌లో రాత్రి 9.30 నుంచి).





# కొడితే కొట్టాలిరా..!

పచ్చటి పచ్చికతో విపరీతమైన వేగంతో ఉండే పిచ్‌లు... అరవీర భయంకరులైన పేస్ బౌలర్లు.. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించే బ్యాట్స్‌మెన్. ప్రపంచంలోని మేటి జట్లలో ఒకటి. తమ దేశం వచ్చిన ప్రతి జట్టును చిత్తుగా ఓడించే సేన. ఇదీ దక్షిణాఫ్రికా గురించి ప్రతి క్రికెట్ అభిమాని అభిప్రాయమిది. జట్టు గురించి సగటు అభిమాని అభిప్రాయంలో ఇసుమంతైనా అతిశయోక్తి లేదు. ఆటగాళ్లూ తిరుగులేని ప్రతిభావంతులే! ఐతే కాలం గడిచే కొద్దీ అక్కడి వికెట్లలో మార్పు వచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన పిచ్‌గా పేరుపడ్డ డర్బన్‌లోనే మన జట్టు 2010లో విజయాన్ని దక్కించుకుంది. అంతకు ముందు రెండు సార్లు.. 2013లోనూ దక్షిణాఫ్రికా గెలిచినప్పటికీ ఈ సారి టెస్టు వేదికగా డర్బన్ లేదు. కేప్‌టౌన్, సెంచూరియన్, జొహాన్నెస్ బర్గ్‌లు మూడు టెస్టులకు ఆతిథ్యమిస్తున్నాయి. జొహాన్నెస్‌బర్గ్‌లో భారత జట్టుకు మెరుగైన రికార్డే ఉంది. చివరి సారిగా కేప్‌టౌన్, జొహాన్నెస్ బర్గ్‌లలో టీమ్ ఇండియా మ్యాచ్‌ల్ని డ్రా చేసుకుంది. ఈ స్ఫూర్తితో కోహ్లి సేన విశ్వాసంతో శుక్రవారం తొలి టెస్టులోకి అడుగు పెట్టాలి. మొదటి టెస్టులో విజయాన్ని సొంతం చేసుకోవాలి. ఆ జోరులో సెంచూరియన్ టెస్టును డ్రా చేసుకోగలిగితే... అచ్చివచ్చిన జొహాన్నెస్ బర్గ్‌లో తుది పంచ్‌తో సిరీస్‌ను కైవసం చేసుకోవాలి. అందుకు తరుణమిదే. టీమ్ఇండియా ఈ మంచి తరుణాన్ని మించి పోనీరాదు. భారత్‌కు కలిసి వచ్చే అంశాలు చాలానే ఉన్నాయి. అవేంటో చూద్దాం!

ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్... అద్భుతంగా రాణిస్తున్న పేసర్లు.. పరుగుల వరద పారిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్న కెప్టెన్. ఇటు బ్యాటింగ్‌లో.. అటు బౌలింగ్‌లో పుష్కలంగా అవకాశాలు. ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న పాండ్య. అందుకే దక్షిణాఫ్రికాలో తొలి సిరీస్ విజయాన్ని లిఖించడానికి ఇది సరైన సమయం. ఈ పర్యటనలో సిరీస్ గెలుపు టీమ్ఇండియా విశ్వాసాన్ని అమాంతం హిమాలయాలంత ఎత్తుకు పెంచేస్తుందనడంలో సందేహం లేదు. ఈ ఏడాదిలో తదుపరి జరిగే కఠినమైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలు జట్టును భయపెట్టవు... సరికదా ఈ స్ఫూర్తితో ఆ సిరీస్‌ల్నీ గెలవచ్చు.



### ఆ రెండు పర్యటనలే స్ఫూర్తి

దక్షిణాఫ్రికాలో భారత జట్టు ఇంతవ రకు ఆరు సార్లు పర్యటించింది. తొలి నాలుగు సిరీస్‌ల్లోనూ దక్షిణాఫ్రికాదే విజయం. తొలి పర్యటనలో వారి జట్టు గెలిచింది.. ఒక్క టెస్టు మాత్రమే. తొలి రెండు మ్యాచ్‌ల్ని భారత్ డ్రా చేసుకోగా... పోర్ట్ఎలిజబెత్ టెస్టులో దక్షిణాఫ్రికా గెలిచింది. చివరిదైన డర్బన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తర్వాత నాలుగు సార్లు భారత జట్టు ఆ దేశంలో పర్యటించినా 2006లో జొహాన్నెస్ బర్గ్‌లో కాని తొలి విజయాన్ని దక్కించుకోలేకపోయింది. 2010లో డర్బన్‌లో కాని మరో గెలుపును సొంతం చేసుకోలేకపోయింది. ఈ విజయమే ఒక రకంగా దక్షిణా ఫ్రికా ఆధిపత్యానికి గండి కొట్టింది. 2010, 2013 పర్యటనల్లో భారత జట్టు ఆ గడ్డపై మెరుగైన ప్రదర్శన చేసింది. 2010-11లో జరిగిన 3 టెస్టుల సిరీస్‌లో టీమ్ఇండియా ఒకటి ఓడి (సెంచూరిన్), ఒకటి (డర్బన్) గెలిచింది. ఒక మ్యాచ్ (కేప్‌టౌన్) డ్రాగా ముగిసింది. సెంచూరియన్లో దక్షిణాఫ్రికా గెలవగా.. డర్బన్‌లో భారత్ విజయం సాధించింది. జొహాన్నెస్ బర్గ్ మ్యాచ్ డ్రాగా ముగియంతో సిరీస్ 1-1తో సమమైంది. చివరి సారిగా 2013లో ఆడిన రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 0-1తో ఓడిపోయింది. డర్బన్‌లో ఓడి... జొహాన్నెస్ బర్గ్‌లో డ్రా చేసుకుంది. ఈ సారి డర్బన్ టెస్టు వేదిక కాదు. 2010 పర్యటనలో కేప్‌టౌన్ మ్యాచ్‌ను డ్రా చేసుకున్న జ్ఞాపకాలతో ఈ సారి పర్యటనను ఆరంభించాలి. ఈ టెస్టులో శ్రమించి భారత జట్టు గెలవగలిగితే... అనంతరం సెంచూరియన్ టెస్టును కనీసం డ్రా చేయగలుగుతుంది. ఇక కలిసి వచ్చే జొహాన్నెస్‌బర్గ్‌లో చివరి పంచ్‌తో అదరగొట్టాలి.

### దృక్పథమే ప్రధానం

దక్షిణాఫ్రికా వంటి పేస్ పిచ్‌లపై బ్యాట్స్‌మెన్ దృక్పథమే ప్రధానం. నిప్పులు చెరిగే బంతులు వేసే వారి పేసర్లను ఎదుర్కోవాలంటే బ్యాట్స్‌మెన్‌కు సహనం, ఓర్పు అవసరం. దీంతో తొలి స్పెల్ కీలకమవుతుం ది. బ్యాట్స్‌మెన్ కొత్త బంతిని ఎలా ఎదుర్కొంటారన్న అంశంపైనే ఇన్నింగ్స్ ఆధారప డివుంటుంది. కొత్త బంతిని సమర్థంగా ఎదుర్కోగలిగితే ఇన్నింగ్స్ వేగం పెంచొచ్చు. కొత్త బంతిని సమర్థంగా ఆడడంతో పాటు పరుగులు సాధించాలి. స్ట్రయికింగ్ రొటేట్ చేయాలి. దీనిపై ఆధారపడే తొలి రోజు ఆట సాగేది. అది ఆశావహమా.. లేక నిరాశజనకమా అన్నది నిర్ణయమైపోతుంది. కొత్త బంతి కీలకమే కాని.. నిజానికి 18 లేదా 20వ ఓవర్ నుంచి బ్యాట్స్‌మెన్‌కు అసలు సిసలు పరీక్ష మొదలవుతుంది. ఈ దశ 40, 50 ఓవర్లకు సాగుతుంది. వికెట్ ఫ్లాట్‌గా ఉంటే బంతి రివర్స్ స్వింగ్ అయి మరింత ఇక్కట్లకు గురి చేస్తుంది. విదేశీ పరిస్థితుల్లో తొలి 25 ఓవర్లు కీలకమనే చెప్పాలి. తొలి టెస్టు జరిగే కేప్‌టౌన్ పిచ్‌పై ఒకప్పుడు విపరీతంగా మూవ్‌మెంట్ ఉండేది. కానీ రానురాను బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. ఎగిసి వచ్చే బౌంతుల్ని విడిచిపెట్టడం మేలు. ఇలాంటి పిచ్‌లపై ఆచితూచి ఆడాల్సిందే. దక్షిణాఫ్రికా ప్రధాన బౌలింగ్ అస్త్రం డేల్ స్టెయిన్ తొలి టెస్టులో ఆడేది అనుమానం కావడం కూడా భారత బ్యాట్స్‌మెన్‌కు కలిసివచ్చేదే. ప్రస్తుతం భారత బ్యాట్స్‌మెన్ ఫామ్‌ను బట్టి చూస్తే క్రీజులో కుదురుకుని ఆడడం వారికి సమస్య కాబోదు. ఐతే వైస్ కెప్టెన్ అజింక్య రహానే ఫామ్ ఒక్కటే ప్రస్తుతం టీమ్ఇండియా యాజమాన్యాన్ని ఆందోళన పరుస్తున్న అంశం. విదేశీ పర్యటనల్లో అద్వితీయ రికార్డున్న రహానే ఈ పర్యటనలో కీలక సమయంలో ఫామ్‌ను అందుకుంటాడని జట్టు నమ్మకంతో ఉంది.

**దక్షిణాఫ్రికాలో ఆడిన టెస్టు సిరీస్‌లు**

| ఏడాది | మ్యా | గె | ఓ | డ్రా |
|---|---|---|---|---|
| 1992-93 | 4 | 0 | 1 | 3 |
| 1996-97 | 3 | 0 | 2 | 1 |
| 2001-02 | 2 | 0 | 1 | 1 |
| 2006-07 | 3 | 1 | 2 | 0 |
| 2010-11 | 3 | 1 | 1 | 1 |
| 2013-14 | 2 | 0 | 1 | 1 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలుపు, ఓ: ఓటమి

**దక్షిణాఫ్రికాలో భారత్**

| టెస్టులు | గెలుపు | ఓటమి | డ్రా |
|---|---|---|---|
| 17 | 2 | 8 | 7 |

### పక్కాగా.. ఫుట్‌వర్క్

బ్యాట్స్‌మెన్‌కు క్రమశిక్షణ చాలా అవసరం. ఉపఖండం వెలుపల అదే కీలకమవుతుంది. దీనితో పాటు పేస్ పిచ్‌లపై ఆడే బ్యాట్స్‌మెన్‌కు లోపాలకు తావులేని ఫుట్‌వర్క్ ఉంటే క్రీజులో పాతుకుపోగలుగుతాడు. తిరుగులేని ఫుట్‌వర్క్ ఉండాలంటే బ్యాట్స్‌మెన్ మనసులో ఎలాంటి సంకోచాలు ఉండకూడదు. బుర్ర స్వేచ్ఛగా ఉంటే పాదం కూడా స్వేచ్ఛగా కదులుతుంది. ఈ రెండు ఎంతో ప్రధానమైన అంశాలు.

### బౌలింగ్‌లో క్రమశిక్షణ

గత ఏడాది ఉపఖండపు పిచ్‌లపై.. విండీస్‌లో అద్భుతంగా రాణించిన భారత్ బౌలర్లు కొత్త పరిస్థితుల్లో బౌలింగ్ చేయబోతున్నారు. ప్రధాన పేసర్లు భువనేశ్వర్ కుమార్, ఉమేశ్ యాదవ్‌లకు ఇదే తొలి దక్షిణాఫ్రికా పర్యటన. భారత్ పేసర్లు దక్షిణాఫ్రికా పిచ్‌లపై క్రమశిక్షణతో బౌలింగ్ చేయాల్సివుంటుంది. వేగాన్ని అదుపు తప్పితే పరుగుల వరదే. సరైన ప్రాంతంలో బంతిని వేసినపుడే ఫలితాలు వచ్చేది. షమి, ఇషాంత్‌కు మినహా భువీ, యాదవ్, పాండ్యలకు దక్షిణాఫ్రికా పిచ్‌లు కొత్తే. ఇది ఒక రకంగా భారత్ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.



### స్లిప్‌లో క్యాచ్‌లందుకుంటేనే..

గత ఐదేళ్లలో టెస్టుల్లో 407 వికెట్లు ఫాస్ట్ బౌలింగ్లో క్యాచ్‌ల వల్ల కూలినవే. వీటిలో 131 క్యాచ్‌లు స్లిప్‌లలో, గల్లీ ప్రాంతంలో పట్టినవే. ఈ కాలంలో భారత్‌లో 150 వికెట్లు పతనం కాగా.. 38 వికెట్లు స్లిప్, గల్లీలో క్యాచ్‌ల ద్వారా వచ్చాయి. భారత్‌ను ఆందోళన కలిగించే అంశం ఇదే. దక్షిణాఫ్రికాలోని పిచ్‌లపై వికెట్లు ఎక్కువగా స్లిప్‌లలో క్యాచ్‌ల రూపంలో వస్తాయి. కాని స్లిప్ క్యాచింగ్‌లో భారత్ రికార్డు పేలవంగా ఉంది. 2013-14 పర్యటనలో భారత ఫీల్డర్లు స్లిప్, గల్లీలో కనీసం 45 క్యాచ్‌లు జారవిడిచారు. విశేషమేమంటే స్లిప్‌లలో క్యాచింగ్ అవకాశాల్ని దక్షిణాఫ్రికా బౌలర్ల కంటే భారత్ బౌలర్లు ఎక్కువగా ఇవ్వడం. స్లిప్ లేదా వికెట్ల సమీపంలో ఫీల్డింగ్ చేసే విజయ్, ధావన్, రాహుల్, విరాట్, రహానే రోహిత్ ఏమరు పాటుకు తావులేకుండా క్యాచ్‌లు అందుకోవాలి. అపుడే మ్యాచ్‌లు సొంతమయ్యేది.

## బెంగళూరులో విరాట్... చెన్నైలో ఎం.ఎస్. ధోని!

**ముంబై:** టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ సారథి ధోని.. ఐపీఎల్‌లో తమ తమ ఫ్రాంచైజీలలోనే కొనసాగనున్నారు. విరాట్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌కాగా.. మళ్లీ ఐపీఎల్‌లోకి తిరిగి వచ్చిన చెన్నై సూపర్ కింగ్స్ ధోనీని అట్టేపెట్టుకోనుంది. పాత ఫ్రాంచైజీలతో కొనసాగే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ గురువారం ప్రకటించనుంది. 2018-2020 మూడు సీజన్లకు విరాట్, ధోనీలను ఆయా ఫ్రాంచైజీలు అట్టేపెట్టుకుంటాయి. అగ్రశ్రేణి ఆటగాళ్లలో రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ అట్టేపెట్టుకుంటుంది. ఆల్‌రౌండర్ పాండ్య, జడేజా, ఆసీస్ ఆటగాడు డేవిడ్ వార్నర్ (హైదరాబాద్)లు కూడా పాత ఫ్రాంచైజీలో కొనసాగుతారు.





## మన్రో రికార్డు సెంచరీ


### మూడో టీ20లో విండీస్‌ను చిత్తు చేసిన కివీస్

**మౌంట్ మౌగనీ (విండీస్):** ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కొలిన్ మన్రో (104, 53 బంతుల్లో, 3 ఫోర్లు, 10 సిక్స్) సిక్సర్లతో విరుచుకుపడి రికార్డు సెంచరీ బాదడంతో మూడోదైన చివరి టీ20లో న్యూజిలాండ్ 119 పరుగుల తేడాతో విండీస్‌పై విజయం సాధించింది. బుధవారం ముందుగా మన్రో విజృంభణతో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. మన్రో 53 బంతుల్లోనే 104 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో మూడు శతకాలు చేసిన క్రికెటర్‌గా మన్రో రికార్డుల పుటలకెక్కాడు. టీ20ల్లో న్యూజిలాండ్‌కిదే అత్యధిక స్కోరు. అనంతరం విండీస్ 16.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది.


మన్రో

## ఇంగ్లండ్ జట్టులో 20 ఏళ్ల స్పిన్నర్

### నేటి నుంచి యాషెస్ చివరి టెస్టు; వోక్స్ దూరం



**సిడ్నీ:** ఇంగ్లండ్‌కు యువ స్పిన్నర్ మాసన్ క్రేన్.. టెస్టు అరంగేట్రం చేయనున్నాడు. 20 ఏళ్ల క్రేన్ గురువారం ఇక్కడ ఆస్ట్రేలియాతో ఆరంభం కాబోయే యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టులో ఆడనున్నాడు. గాయానికి గురైన ఆల్‌రౌండర్ క్రిస్ ఓక్స్ స్థానంలో క్రేన్ తొలి ఆడతాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ జోయ్ రూట్ తెలిపాడు. యాషెస్ సిరీస్‌ను ఆసీస్ ఇప్పటికే 3-0తో వశం చేసుకుంది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది.

## వన్డేల నుంచి మ్యాక్స్‌వెల్ ఔట్



**సిడ్నీ:** ఇంగ్లండ్‌తో ఆడనున్న ఐదు వన్డే మ్యాచ్‌లకు డాషింగ్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను ఆస్ట్రేలియా జట్టుకు ఎంపికచేయలేదు. మ్యాక్స్‌వెల్ ఇప్పటివరకు ఆస్ట్రేలియా తరపున 80 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లు ఆడాడు. మ్యాక్స్ నిజానికి మంచి బ్యాట్స్‌మన్ కాని ఆయనలో స్థిరత్వం లోపించింది. ఆ లోపాన్ని సరిదిద్దుకుంటే ఆయన మళ్లీ జట్టులోకి రావడం ఖాయం అని స్మిత్ అన్నారు. **ఇంగ్లండ్‌తో వన్డేలకు ఆస్ట్రేలియా జట్టు:** స్టీవ్‌స్మిత్. డేవిడ్ వార్నర్, పాట్రిక్ కమిన్స్, ఆరోన్ ఫించ్ జోష్‌వుడ్, ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్ మిచెల్ మార్ష్, టిమ్ పెయినీ, జెయ్ రిచర్డ్సన్ మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్, అండ్రూటై, ఆడం జంపా.

## అండర్-19 ప్రపంచకప్‌లో ఇద్దరు భారత అంపైర్లు

**దుబాయ్:** అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి ఇద్దరు భారత అంపైర్లను ఎంపికచేసినట్లు ఐసిసి (అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్) ప్రకటించింది. ఈ మేరకు ఐసిసి బుధవారం ఒక ప్రకటన చేస్తూ.. ఈనెల 13న న్యూజిలాండ్‌లో ప్రారంభంకానున్న అండర్-19 ప్రపంచకప్‌కు 14 మంది అధికారులతో కూడిన ప్యానెల్‌కు భారత్‌కు చెందిన అనిల్ చౌదరీ, సికె నందన్‌లను ఎంపికచేసినట్లు తెలిపింది. మిగతా 12 మందిలో... రాబర్ట్ బెయిలీ, గ్రెగరీ బ్రాత్‌వెయితె, నిగెల్ దుగిడ్, షువాన్ జార్జి, షువాన్ హెయిగ్, మార్క్ హాతోర్న్, రన్‌మోర్ మార్టినెజ్, అహసాన్ రాజా, షోయబ్‌రాజా, తిమోతి రాబర్ట్ రాబిన్‌సన్, లాంగ్‌టన్ రస్రీ, పాల్ విల్సన్ ఉన్నారు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.